

'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 270

బుధవారం 14-6-2023



సింధు శుభారంభం

ఇండోనేసియా ఓపెన్‌లో ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించిన భారత స్టార్ షట్లర్ - 12లో

ఫోర్బ్స్ భారీ కంపెనీల్లో రిలయన్స్

గ్లోబల్ 2000 లిస్ట్‌లో 45వ ర్యాంక్.. జాబితాలో 55 దేశీ కంపెనీలు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారత ప్రభుత్వం బెదిరించింది

రైతు ఉద్యమ కాలంలో ట్విట్టర్ ఖాతాలపై ఆంక్షలు పెట్టాలని భారత్ ఆదేశించిందని ట్విట్టర్ మాజీ సీఈవో జాక్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



రాహుల్ ట్రక్కు జర్నీ

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అమెరికాలో ట్రక్కులో ప్రయాణించి.. భారతీయ అమెరికన్ డ్రైవర్ల సమస్యలను తెలుసుకున్నారు.

వివరాలు 6లో ▸



జెలెన్‌స్కీ సొంత పట్టణంపై దాడులు

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత పట్టణమైన క్రివీ రిహ్‌పై రష్యా క్షిపణులతో దాడి చేయడంతో 11 మంది మరణించారు.

వివరాలు 6లో ▸



ఉత్తర భారతంలో ప్రకంపనలు

జమ్మూ కశ్మీర్‌లోని దోడా జిల్లాలో మంగళవారం భూకంపం సంభవించింది. తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.4గా నమోదైంది.

వివరాలు 6లో ▸

మీ చిరునవ్వుల్లో సకల సంతోషాలు

ఈ ప్రభుత్వం మీదే.. ఉద్యోగికి మంచి చేయాలన్నదే నా తపన: సీఎం జగన్

- మీరు సంతోషంగా ఉంటే డెలివరీ మెకానిజం బాగుంటుంది.. ప్రజలూ బాగుంటారు
- కొందరు రాజకీయ కారణాలతో చెప్పే వాటిని విశ్వసించొద్దు
- కేబినెట్ నిర్ణయాలన్నీ 60 రోజుల్లోగా పూర్తిగా అమల్లోకి
- డైలీవేజ్ ఉద్యోగులు కూడా ఆప్కాస్ పరిధిలోకి
- ఉద్యోగికి, ప్రభుత్వానికీ జగన్ మంచి చేశారని భవిష్యత్తు తరాలూ చెప్పుకోవాలి
- కేబినెట్ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎంను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సాక్షి, అమరావతి: ఉద్యోగులు సంతోషంగా ఉంటే డెలివరీ మెకానిజం బాగుంటుందని, తద్వారా ప్రజలు సంతోషంగా ఉంటారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కొందరు రాజకీయ కారణాలతో చెప్పే అంశాలను ఉద్యోగులు విశ్వసించనక్కరలేదని, నా మనసు ఎప్పుడూ మీకు మంచి చేయడం కోసమే ఉంటుందని, అన్నింటినీ పరిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 7వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో కొత్తగా జీపీఎస్ తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ విలీనం, 12వ పీఆర్సీ ఏర్పాటు సహా ఉద్యోగులకు సంబంధించి తీసుకున్న పలు నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాయి. ఈమేరకు ఏపీ జేఏసీ అమరావతితో సహా పలు ఉద్యోగ సంఘాల నేతలు

మిగతా 2వ పేజీలో ▶

ఖాళీలు కనపడొద్దు

- ఆస్పత్రుల్లో ఒక్క పోస్టూ ఖాళీగా ఉండకూడదు: సీఎం జగన్
- వైద్య ఆరోగ్య శాఖలో నియామక వ్యవస్థ బలోపేతం
- ఐఏఎస్ నేతృత్వంలో ఎప్పటికప్పుడు ఖాళీల భర్తీ

2లో

ఎంపీ అవినాశ్ జైలు పాలే మీ లక్ష్యమా?

సునీతకు సుప్రీంకోర్టు ప్రశ్న.. ఎందుకీ ఈగో క్లాషెస్?

ప్రతివాది మీ కజినే కదా?

- వ్యక్తిగత వాదనలతో తొందర పడుతున్నారేమో!
- అంత అత్యవసరం ఏముంది? వెకేషన్ బెంచ్‌కు ఎందుకు?
- ఇప్పుడీ పిటిషన్‌ను కొట్టివేస్తే సీనియర్ న్యాయవాదికి ఇబ్బందే
- అరెస్టు, ఇంటరాగేషన్ సీబీఐ చూసుకుంటుంది
- ఎప్పుడు, ఏం చేయాలో దర్యాప్తు సంస్థకు తెలుసు
- మీరెందుకు జోక్యం చేసుకుంటారు?
- దర్యాప్తు పూర్తి చేసేందుకు ఇప్పటికే గడువు విధించారు
- మేం జోక్యం చేసుకుంటే అంతా మారిపోతుంది
- సీబీఐకి నోటీసులివ్వలేం.. విచారణ 19కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని జైలుపాలు చేయడమే మీ లక్ష్యమా? అని సుప్రీంకోర్టు ధర్మాసనం నర్రెడ్డి సునీతను ప్రశ్నించింది. ఈ వ్యవహారం చూస్తుంటే ఈగో క్లాషెస్‌లా ఉందని వ్యాఖ్యానించింది. తొందరపడి వ్యక్తిగత వాదనల ద్వారా నష్టపోతారేమో చూసుకోవాలని హితవు పలికింది. పిటిషనర్ సునీత విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేస్తూ అదనపు డాక్యుమెంట్లు అందచేసేందుకు అనుమతించింది. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలంటూ నర్రెడ్డి సునీత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్


రేటు కార్డా? సేఫ్‌గార్డా?



కొన్ని రాష్ట్రాల్లో పార్టీలు ఉద్యోగాల పేరుతో 'రేటు కార్డ్'లు పెట్టి యువతను దోచుకుంటున్నాయని ప్రధాని మోదీ విమర్శించారు. తమ ప్రభుత్వం యువత ప్రయోజనాల పరిరక్షణ కోసం (సేఫ్‌గార్డ్) పని చేస్తోందని అన్నారు.

వివరాలు 6లో ▸

'షాక్' ఇచ్చింది చంద్రబాబే!



ఫ్యాక్ట్ చెక్

రాష్ట్రంలోని విద్యుత్ చార్జీలకు గత టీడీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకమే కారణమని విద్యుత్ పంపిణీ సంస్థలు వెల్లడించాయి. సబ్సిడీలు చెల్లించకుండా విద్యుత్ పంపిణీ సంస్థలను నష్టాల ఊబిలోకి నెట్టివేసిందని వివరించాయి. విద్యుత్ చార్జీలపై 'ఈనాడు' తప్పుడు కథనాన్ని ఖండించాయి.

వివరాలు 3లో ▸


ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల



ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది మార్చి, మే నెలల్లో నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో కలిపి మొత్తంగా 84.35 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు చెప్పారు.

వివరాలు 10లో ▸

జన విస్ఫోటంతో దుర్బల భారత్!



ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు వాతావరణ మార్పుల ముప్పు అధికమని.. ఇందుకు అధిక జనాభానే కారణమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వివరాలు 6లో ▸

నీట్‌లో ఏపీ విజయకేతనం

ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ కైవసం చేసుకున్న బోర వరుణ్ చక్రవర్తి

తమిళనాడుకు చెందిన ప్రభంజన్‌కు కూడా..

- ఇద్దరికీ 99.99 పర్సంటైల్
- ఈడబ్ల్యూఎస్, ఎస్టీ విభాగాల్లో ఏపీకి చెందిన ప్రవర్ధన్‌రెడ్డి, జ్యోతిలాల్ చావన్‌కి ఆలిండియా మొదటి ర్యాంకులు
- ఎస్సీ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి కె.యశశ్రీకి జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు
- నీట్ యూజీ–2023 ఫలితాలు వెల్లడించిన ఎన్‌టీఏ
- దేశవ్యాప్తంగా అర్హత సాధించిన 11.45 లక్షల మంది విద్యార్థులు
- ఏపీ నుంచి 42,836 మంది అర్హత



వరుణ్ చక్రవర్తి (ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్)

సాక్షి, అమరావతి: ప్రవేశ పరీక్ష ఏదైనా టాప్ ర్యాంకులు కొల్లగొట్టడమే పనిగా పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు నీట్‌లోనూ ప్రభంజనం సృష్టించారు. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ-2023 ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ విజయకేతనం ఎగురవేసింది. రాష్ట్రానికి చెందిన బోర వరుణ్ చక్రవర్తి అఖిల భారత స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి రికార్డు సృష్టించాడు. నీట్‌లో 720కి 720 మార్కులతో సత్తా చాటాడు. 99.99 పర్సంటైల్‌తో దుమ్ము లేపాడు. అలాగే తమిళనాడుకు చెందిన ప్రభంజన్ కూడా 720 మార్కులు సాధించి మొదటి ర్యాంకులో

మిగతా 10వ పేజీలో ▶

బిపర్‌జోయ్‌తో భారీ విధ్వంసం



అరేబియా సముద్రంలో కొనసాగుతున్న బిపర్‌జోయ్ తుపాను భారీ విధ్వంసాన్ని సృష్టించే ప్రమాదముందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. దీని ప్రభావం గుజరాత్‌లోని కచ్, ద్వారక, జామ్‌నగర్‌లపైనే ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. ఈనెల 15వ తేదీ సాయంత్రం గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్, మాండ్వి, జఖౌ పోర్టులతో పాటు పాకిస్తాన్‌లోని కరాచీ మధ్య తీరాన్ని తాకే అవకాశాలున్నాయని తెలిపింది. కాగా, 21 వేల మందిని తాత్కాలిక షెల్టర్లలోకి తరలించినట్లు గుజరాత్ ప్రభుత్వం తెలిపింది.

6లో



ఆ రెండింటి వల్లే 'నైరుతి'కి తంటా!

- నిన్న 'మోకా', నేడు 'బిపర్‌జోయ్'లతో ఇబ్బంది.. తమవైపు తేమను లాక్కెళ్లిపోయిన తుపానులు
- అందుకే రుతుపవనాల విస్తరణలో జాప్యం.. దీంతో అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు
- 20 తర్వాతే రాష్ట్రంలో వర్షాలు

14లో

ఫైరవీలు, పడిగాపుల్లేవ్

- ముగిసిన ఉపాధ్యాయుల బదిలీలు
- రాష్ట్రవ్యాప్తంగా 56,829 మందికి స్థాన చలనం
- ఐదేళ్లు పూర్తిచేసుకున్న హెచ్ఎంలు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న టీచర్ల బదిలీ
- పోస్టుల బ్లాక్‌కు చోటు లేదు
- దరఖాస్తు నుంచి బదిలీ వరకు ఆన్‌లైన్‌లోనే
- 15 రోజుల్లోనే పూర్తయిన బదిలీల ప్రక్రియ

14లో





వీటి కన్నా మన వైరస్‌లే యమస్ట్రాంగ్.. వాటిని పెంచుకుందాం సార్!

ఖాళీలు కనపడొద్దు

ఆస్పత్రుల్లో ఒక్క పోస్టూ ఖాళీగా ఉండకూడదు: సీఎం జగన్

- వైద్య ఆరోగ్య శాఖలో నియామక వ్యవస్థ బలోపేతం
- ఐఏఎస్ నేతృత్వంలో ఎప్పటికప్పుడు ఖాళీల భర్తీ
- నాలుగు వారాలకు మించి ఎక్కడా పోస్టు ఖాళీగా ఉండటానికి వీల్లేదు
- ఆస్పత్రుల్లో సమస్యలపై ఫిర్యాదుకు ప్రతిచోటా ఫోన్ నంబర్లు
- సమర్థంగా ఫ్యామిలీ డాక్టర్ అమలుతో ప్రివెంటివ్ కేర్ లక్ష్యాల సాధన
- చరిత్రలో నిలిచేలా కొత్త వైద్య కళాశాలల నిర్మాణాలు


వైద్య ఆరోగ్య శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది పోస్టులు ఒక్కటి కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అందుకు తగ్గట్టు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభంకానున్న ఐదు కొత్త వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలపై సీఎం జగన్ సమీక్షించారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాలలు చరిత్రలో నిలిచిపోయే నిర్మాణాలని సీఎం పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, వైద్య శాఖలో పోస్టుల భర్తీ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఇతర కార్యక్రమాల అమలు పురోగతిపై సమీక్షించిన సీఎం జగన్ పలు సూచనలు చేశారు.

ఐఏఎస్ నేతృత్వంలో ఎప్పటికప్పుడు భర్తీ..

ప్రభుత్వాస్పత్రులను వేధించే ప్రధాన సమస్య మానవ వనరుల కొరత. దీనికి చెక్ పెట్టేలా ఇప్పటికే 48 వేలకు పైగా పోస్టుల భర్తీ చేపట్టాం. ఈ నియామకాల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుండాలి. ఎప్పటికప్పుడు ఖాళీ అయిన పోస్టులను గుర్తించి భర్తీ చేయాలి. వైద్య ఆరోగ్య శాఖలో రిక్రూట్‌మెంట్ వ్యవస్థ సమర్థంగా పనిచేయాలి. ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి. ఏదైనా పోస్టు ఖాళీ అయితే నాలుగు వారాల్లో భర్తీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

ఆరోగ్య పరిస్థితులపై ట్రాకింగ్

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలి. అప్పుడే ప్రివెంటివ్ కేర్‌లో ఆశించిన లక్ష్యాలను సాధించగలం. కార్యక్రమం అమలులో పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల పాత్ర ఎంతో కీలకం. మధుమేహం, రక్తపోటు, ఇతర నాన్ కమ్యూనికబుల్, కమ్యూనికబుల్ జబ్బుల బాధితులకు మంచి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. ఫ్యామిలీ డాక్టర్ వద్ద వీరికి చికిత్స అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాలి. విలేజ్ క్లినిక్‌ల స్థాయిలో కంటి పరీక్షలు చేపట్టాలి. క్రమం తప్పకుండా ఈ ప్రక్రియ కొనసాగాలి. టీబీ నిర్ధారణ పరీక్షలు అందరికీ చేయడం ద్వారా బాధితులను గుర్తించాలి. వారికి మంచి చికిత్స అందించే దిశగా అడుగులు వేయాలి.

క్యూ ఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి అర్హత పొందిన కుటుంబాల్లో పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ప్రతి ఒక్కరికీ క్యూ ఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ కార్డులు అందజేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడా అవినీతికి తావు లేకుండా చర్యలు చేపట్టాలి. సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ప్రతి చోటా ఫోన్ నంబర్లు ప్రదర్శించాలి. వాటిని సకాలంలో పరిష్కరించాలి.

1.39 కోట్ల మందికి ఫ్యామిలీ డాక్టర్ సేవలు

గతేడాది అక్టోబర్ 22 నుంచి ఇప్పటివరకు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 1,39,97,189 మందికి సేవలందించినట్లు అధికారులు తెలిపారు. వీరిలో 35,79,569 మంది రక్తపోటు, 24,31,934 మంది మధుమేహం బాధితులని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు (సీహెచ్‌వో) శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఫస్ట్ ఎయిడ్, పాముకాటు, ఐవీ ఇన్‌ఫ్యూజన్, ఇంజక్షన్, డ్రస్సింగ్, బేసిక్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ లాంటి అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. సికిల్‌సెల్ అనీమియా నివారణలో భాగంగా ఈ ఏడాది 6.68 లక్షల మందికి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఈ నెలలోనే అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పరీక్షలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దంత వైద్యులు ప్రతినెలా పీహెచ్‌సీలను సందర్శించేలా చర్యలు తీసుకున్నామన్నారు. టీబీ నివారణపైనా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నామన్నారు. లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వచ్చే ఏడాది మరో 3 మెడికల్ కాలేజీలు..

విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో ఏర్పాటవుతున్న మెడికల్ కాలేజీల్లో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. మరో 3 కొత్త వైద్య కళాశాలలు పాడేరు, పులివెందుల, ఆదోనిలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిగిలిన కళాశాలల్లో పనులు వేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ జవహర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్, రవాణాశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, ఔషధ నియంత్రణ విభాగం డీజీ రఘురామరెడ్డి, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రామిరెడ్డి, డీఎంఈ నరసింహం పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కేంద్ర సహాయ మంత్రి కరాడ్‌ను సన్మానించిన సీఎం జగన్


కేంద్ర మంత్రికి జ్ఞాపికను ఇస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కిషన్‌రావ్ కరాడ్‌ను సీఎం వైఎస్ జగన్ సన్మానించారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం నివాసంలో సీఎం వైఎస్ జగన్‌తో డాక్టర్ భగవత్ కిషన్‌రావ్ కరాడ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ భగవత్ కిషన్‌రావ్ కరాడ్‌ను సీఎం వైఎస్ జగన్ సన్మానించి జ్ఞాపికను అందించారు.

ఈ నెల 16న గుడివాడకు సీఎం జగన్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 16న కృష్ణా జిల్లా గుడివాడలో పర్యటించనున్నారు. ఇందుకోసం సీఎం జగన్ శుక్రవారం ఉదయం 9 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి గుడివాడ మండలం మల్లాయపాలెం చేరుకుంటారు. అక్కడ నిర్మించిన టిడ్కో గృహ సముదాయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత జరిగే బహిరంగసభలో ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం తాడేపల్లికి చేరుకుంటారు.

ఓబీసీ మహాసంఘ్ మెగా కన్వెన్షన్‌కు సీఎంకు ఆహ్వానం


సీఎం వైఎస్ జగన్‌ను ఆహ్వానించి సత్కరిస్తున్న ఓబీసీ మహాసంఘ్ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ ప్రతినిధులు మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. ఆగస్టు 7న తిరుపతిలో నిర్వహించనున్న 8వ జాతీయ మెగా కన్వెన్షన్‌లో పాల్గొనాలని కోరుతూ సీఎంకు ఆహ్వానపత్రిక అందజేశారు. 2016 నుంచి ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల్లో కన్వెన్షన్‌లు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ఓబీసీలకు సంబంధించిన డిమాండ్లు, వాటి పరిష్కారంపై చర్చిస్తుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలిండియా బ్యాక్‌వర్డ్ క్లాస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జస్టిస్ వి.ఈశ్వరయ్య, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ నాయకులు డాక్టర్ బాబారావు తైవాడే, సచిన్ రాజుర్కర్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, కేశన శంకరరావు తదితరులతో పాటు మంత్రి జోగి రమేశ్ కూడా పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి

బీసీల సర్వతోముఖాభివృద్ధికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, ఆలిండియా బ్యాక్‌వర్డ్ క్లాస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జస్టిస్ వి.ఈశ్వరయ్య అన్నారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో నిర్వహించే సభకు సీఎంను ఆహ్వానించగా.. ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. వెనుకబడిన వర్గాల విద్యార్థుల అభివృద్ధి కోసం సీఎం జగన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో ప్రైవేటు బిల్లు పెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు.

1,350 మెగావాట్ల పీఎస్పీకి అనుమతి

సాక్షి, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఎగువ సీలేరులో 1,350 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజీ ప్లాంటు (పీఎస్పీ) నిర్మాణానికి సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనెల ఆరోతేదీన ఢిల్లీలో సీఈఏ చైర్మన్ ఘనశ్యామ్‌ప్రసాద్ నేతృత్వంలోని కార్యవర్గసభ్యులతో ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు, సీఈ (హైడల్) సుజయ్ కుమార్, ఎస్ఈ రవీంద్రారెడ్డి సమావేశమై ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 150 మెగావాట్ల సామర్థ్యం గల 9 యూనిట్ల (మొత్తం 1,350 మెగావాట్లు) పీఎస్పీ నిర్మించాల్సిన అవసరం, రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితులను జెన్‌కో ఎండీ వివరించారు. ఈ నేపథ్యంలో ఆమోదం లభించింది. ఈ మేరకు మంగళవారం సీఈఏ మంగళవారం ఏపీ జెన్‌కోకు సమాచారం ఇచ్చింది.

మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు

- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపాం
- పలు పార్టీలు ప్రభుత్వానికి ఉద్యోగులను దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి
- పాత పింఛనుకు దగ్గరగా జీపీఎస్ వచ్చినందున సంతోషంగా ఉన్నాం
- ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేశామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఉద్యోగ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించినందుకు సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపామన్నారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించనందుకే ఉద్యమం చేశామని చెప్పారు. 47 అంశాలపై సీఎస్‌కు తాము లేఖ ఇస్తే 36 అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపామని చెప్పారు. సోషల్ మీడియాలో ఉద్యోగ సంఘాలపై పలువురు వ్యతిరేకంగా పలురకాల చర్చ నడుపుతున్నారని, ప్రభుత్వానికి ఉద్యోగులను దూరం చేసేందుకే పలు రాజకీయ పార్టీలు ఈ చర్చ నడుపుతున్నాయని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన రూ.1,800 కోట్ల బకాయిలను సెప్టెంబర్‌లోపు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 2014 జూన్ 2 ముందు నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరిస్తామని తెలిపిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణలో తప్పుడు సమాచారాన్ని బయటకు పంపుతున్నారని విమర్శించారు. వైద్య విధాన పరిషత్‌లో కాంట్రాక్టు సిబ్బందిని 010 కింద వేతనాలిచ్చి క్రమబద్ధీకరించే విషయం గురించి సీఎంకు ధన్యవాదాలు తెలిపాం. 12వ పీఆర్సీ వేస్తామని, జీపీఎస్ విధానంలో పాత విధానానికి సమానంగా 50 శాతం పింఛన్ ఇస్తామని, డీఆర్ ఇస్తామన్నారని వివరించారు. పాత పింఛను విధానానికి దగ్గరగా జీపీఎస్ వచ్చినందున తాము సంతోషంగా ఉన్నామని వెల్లడించారు. జీపీఎస్ అనేది 80 శాతం వరకు పాత పింఛన్ విధానానికి దగ్గరగా ఉందని, ఈ చట్టంలో పీఆర్సీ ఎరియర్స్ పొందుపరచాలని కోరామని చెప్పారు. ఉద్యోగుల జీపీఎఫ్ డబ్బును తిరిగి ఇస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. ఆప్కాస్ కింద పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి నేత వలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపామన్నారు.

సుందరంగా అంబేడ్కర్ స్మృతివనం


పనులను పరిశీలిస్తున్న ఎండీ బి.రాజశేఖర్ రెడ్డి

సాక్షి, అమరావతి: విజయవాడ నడిబొడ్డున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 125 అడుగుల అంబేడ్కర్ స్మృతివనాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దనున్నట్టు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ బి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. స్మృతివనంలో చేపట్టాల్సిన గార్డెనింగ్, గ్రీనింగ్ పనులపై మంగళవారం ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొత్తం 19.4 ఎకరాల విస్తీర్ణంలో స్మృతివనం పనులు చేస్తుండగా.. అందులో 8.9 ఎకరాలు పచ్చదనానికి కేటాయించామని తెలిపారు. ఈ హరితవనంలో మొఘల్ గార్డెన్ ల్యాండ్ స్కేపింగ్, మొక్కలు, గులకరాయి నమూనాలు, రంగుల పూలలో కనిపించే జాతీయ పక్షి నెమలిని తీర్చిదిద్దనున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంలో తీర్చిదిద్దిన రంగుల పూల మొక్కలను నాటనున్నారు. స్మృతివనం సుందరీకరణ ప్రణాళిక సిద్ధం చేశామని, సివిల్ వర్క్స్ పూర్తయిన వెంటనే గార్డెనింగ్ పనులు చేపడతామని తెలిపారు.

సీఎం చిత్రపటాలతో కాంట్రాక్టు ఉద్యోగుల సంబరం


శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, జేఎల్‌లు


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సీఎం జగన్ చిత్రపటాలతో కృతజ్ఞతలు చెబుతున్న ఏపీఎన్జీవోలు,కాంట్రాక్టు ఉద్యోగులతో ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఆమదాలవలస/రాజమహేంద్రవరం రూరల్: కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయాన్ని పురస్కరించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలతో రాష్ట్రంలోని పలుచోట్ల కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. తమ జీవితాల్లో వెలుగులు నింపారని కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం జరిపారు. 12వ పీఆర్సీ కమిటీ, కొత్త జిల్లా కేంద్రాలలో హెచ్ఆర్ఏ 16 శాతం పెంపుదల, ఏపీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లింపు తదితర నిర్ణయాలపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాసనసభాపతి తమ్మినేని సీతారాం, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాజమండ్రి అధ్యక్షుడు వైవీవీఎస్ నాయుడు, కార్యదర్శి సేవా ప్రవీణ్ కుమార్, జేఏసీ కార్యదర్శి డి.వేణుమాధవ్, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నేత చటర్జీ తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబాల్లో వెలుగులు నింపారు

సీఎం జగన్ వద్ద భావోద్వేగానికి గురైన కాంట్రాక్ట్ ఏఎన్ఎం ప్రభావతి

'ఇంతవరకు కాంట్రాక్టు ఉద్యోగులను ఏ ప్రభుత్వమూ గుర్తించలేదు. మీరు ముఖ్యమంత్రిగా వచ్చి మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. జీవితాంతం మా కుటుంబాలు మీకు రుణపడి ఉంటాయి' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కాంట్రాక్టు ఏఎన్ఎంగా పనిచేస్తున్న ఇందిరా ప్రభావతి చెప్పారు. ఆత్మకూరు మండలం బైర్లుటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇరవై ఏళ్లకు పైగా కాంట్రాక్టు ఏఎన్ఎంగా పని చేస్తున్న ఆమె సీఎం నిర్ణయంతో రెగ్యులరైజ్ కానున్నారు. ఈ సందర్భంగా తమ కుటుంబాల్లో వెలుగులు నింపారంటూ సీఎం జగన్ ఎదుట భావోద్వేగానికి గురయ్యారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను ఏపీ జేఏసీ అమరావతితో సహా పలు ఉద్యోగ సంఘాల నేతలు కలిశారు. వారితో పాటు ఇందిరా ప్రభావతి కూడా సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. – సాక్షి అమరావతి





సీఎం చిత్రపటానికి పాఠశాల విద్యార్థినుల క్షీరాభిషేకం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు ఇవ్వడాన్ని పురస్కరించుకుని గుంటూరు చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి విద్యార్థినులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. జగన్ మామపై తమకు ఉన్న అభిమానం చాటుకున్నారు. – గుంటూరు ఎడ్యుకేషన్

ఉద్యోగులపై కడుపుమంట ఎందుకు?

- ఎల్లో మీడియాపై ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ వెంకటరామిరెడ్డి ఫైర్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి చెప్పారు. వేల మంది ఉద్యోగులకు మేలు జరుగుతుంటే ఓర్వలేకే ఎల్లో మీడియా నీచమైన కథనాలు ప్రచురిస్తోందని, అంత కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. ఆయన మంగళవారం తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కుదరదంటూ గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక శాఖలో ఉన్న రావత్ ఫైల్ పక్కనబెట్టారని ఒక తోకపత్రికలో రాశారని, అప్పట్లో రావత్ ఫైనాన్స్ విభాగంలోనే పని చేయలేదని చెప్పారు. ఇంతగా అబద్ధాలు ఎలా రాస్తారని ప్రశ్నించారు. క్రమబద్ధీకరణ కుదరదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినట్టుగా కూడా అవాస్తవాలు రాశారని చెప్పారు. 10 సంవత్సరాల సర్వీస్ ఉండి, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు గతంలో తీర్పులు ఇచ్చిందన్నారు. కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందని తెలిపారు. తోకపత్రిక కథనం చూస్తే దీన్ని కోర్టులో అడ్డుకోవాలని ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోందన్నారు.

లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన ఆడిటర్

- రూ.26 లక్షల కాంట్రాక్టు బిల్లుకు రూ.26 వేల డిమాండ్
- ఆయనతో సహా ఆపరేటర్, కాంట్రాక్టర్ ప్రతినిధుల అరెస్టు

దొండపర్తి (విశాఖ దక్షిణ): కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (నేవీ)లో కాంట్రాక్టు బిల్లుల మంజూరు కోసం లంచం డిమాండ్ చేసిన ఆడిటర్, ఆపరేటర్‌ను, ఇస్తున్న కాంట్రాక్టర్ ప్రతినిధులు ఇద్దరిని సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. భానుప్రతాప్ అనే కాంట్రాక్టర్ నేవీలో పలు కాంట్రాక్టు పనులు చేశారు. ఇందుకోసం అతడికి రూ.26 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని మంజూరు చేయడానికి రూ.26 వేలు లంచం ఇవ్వాలని కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (నేవీ)లో సీనియర్ ఆడిటర్ తెలికిచెర్ల రమణకుమార్, డాటా ఎంట్రీ ఆపరేటర్ బి.డి.డి.నూకేశ్వరరావు డిమాండ్ చేశారు. దీనికి కాంట్రాక్టర్ భానుప్రతాప్ అంగీకరించి తనకు ప్రమాదం జరిగిందని, రూ.26 వేలు శుభాషిష్ మిశ్రాతో పంపిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై సీబీఐ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందడంతో నిఘా పెట్టారు. ఆడిటర్, ఆపరేటర్లకు మిశ్రా డబ్బులు ఇస్తున్న సమయంలో సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం డిమాండ్ చేసిన ఇద్దరితో పాటు కాంట్రాక్టర్, అతని ప్రతినిధిని కూడా అరెస్టు చేసి మంగళవారం విశాఖ సీబీఐ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. ఆ నలుగురు ఇళ్లలోనూ సీబీఐ అధికారులు తనిఖీలు చేసి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

మీ చిరునవ్వుల్లో సకల సంతోషాలు

▶ మొదటి పేజీ తరువాయి

మంగళవారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలనుద్దేశించి సీఎం మాట్లాడారు.

నిర్ణయాలన్నీ 60 రోజుల్లోగా అమల్లోకి

ఉద్యోగులకు సంబంధించి కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలన్నీ 60 రోజుల్లోగా పూర్తిగా అమల్లోకి రావాలని, ఈ విషయంలో ఎక్కడా జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. డైలీవేజ్ కేటగిరీ ఉద్యోగులను కూడా ఆప్కాస్ పరిధిలోకి తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఉభయులకూ ప్రయోజనకరంగా జీపీఎస్

సమస్యలను అలాగే వదిలేయకుండా ప్రతి ఒక్క అంశానికీ పరిష్కారం చూపేందుకు తొలిసారిగా ఈ ప్రభుత్వమే ప్రయత్నిస్తోందని సీఎం చెప్పారు. ఉద్యోగులకు మంచి జరగాలి, అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి కూడా మంచి జరగాలనే ఆలోచన చేశామన్నారు. దాదాపు రెండేళ్లు కసరత్తు చేసిన తరువాత ఉభయులకూ ప్రయోజనకరంగా ఉండేలా జీపీఎస్‌ను రూపొందించామని వెల్లడించారు.

భవిష్యత్తు తరాలూ చెప్పుకునేలా..

ఇదంతా అయ్యే పని కాదని 2003లో ప్రభుత్వాలు చేతులెత్తేశాయన్నారు. ఆ పరిస్థితి తలెత్తకుండా, ఉద్యోగులు రోడ్డు మీదకు రాకూడదనే ఉద్దేశంతో ఎంతో ఆలోచన చేశామని తెలిపారు. ఆ రోజు వైఎస్ జగన్ ఉద్యోగులకు మంచి చేశారని, అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా మంచి చేశారనే మాట భవిష్యత్తు తరంలో కూడా వినిపించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.


ఉద్యోగసంఘాల నేతలతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

> "ఉద్యోగులను సంతోషంగా ఉంచేందుకు నా తరపు నుంచి ప్రతి కార్యక్రమాన్ని మనసా, వాచా, కర్మణా చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నా. ఈ విషయాన్ని ఎప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నా.."
> – ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం జగన్

బేసిక్ వేతనంలో కనీసం 50 శాతం పెన్షన్ వచ్చేలా

ఉద్యోగులు ఈ రోజు తీసుకుంటున్న జీతం బేసిక్‌లో కనీసం 50 శాతం పెన్షన్‌గా వచ్చేలా జీపీఎస్ రూపొందించడంతోపాటు ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణలోకి తీసుకుని డీఆర్‌లు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. రిటైరైన ఉద్యోగుల జీవన ప్రమాణాలు స్థిరంగా కొనసాగేలా గ్యారంటీ పెన్షన్ స్కీమ్‌ను తీసుకొచ్చామన్నారు.

జీపీఎస్ దేశానికే రోల్ మోడల్

అధికారంలోకి వచ్చాక 1.35 లక్షల మంది సచివాలయ ఉద్యోగులను నియమించామని, భవిష్యత్తులో వారి నుంచి వైఎస్ జగన్ తమకు మంచి చేశాడన్న మాట రావాలే కానీ మరో మాట రాకూడదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులకు మంచి జరగాలని చిత్తశుద్ధితో కృషి చేశామని, ఇంత సిన్సియర్‌గా పరిష్కారం వెతికిన పరిస్థితి రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదన్నారు. భవిష్యత్‌లో జీపీఎస్ దేశానికే రోల్ మోడల్ అవుతుందన్నారు. ఈ పథకం ఉద్యోగులకు మేలు చేస్తుందని, వారికి అన్ని రకాలుగా మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులదని పేర్కొంటూ మిమ్మల్ని పూర్తిగా భాగస్వాములుగా చేసుకున్నామని, మీ మొహంలో చిరునవ్వు ఉంటేనే బాగా పని చేయగలుగుతారని, ప్రజలూ సంతోషంగా ఉంటారని చెప్పారు.

కన్నా కుటుంబంపై గృహ హింస కేసు నిర్ధారణ

అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ తీర్పును సమర్థించిన మహిళా సెషన్స్ కోర్టు

విజయవాడ స్పోర్ట్స్: టీడీపీ నాయకుడు, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కుటుంబంపై గృహ హింస కేసు విజయవాడ మహిళా సెషన్స్ కోర్టులో రుజువైంది. కన్నా లక్ష్మీనారాయణ కోడలు శ్రీలక్ష్మీకీర్తి పెట్టిన ఈ కేసుపై విజయవాడ ఒకటో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శైలజాదేవి మంగళవారం తీర్పు ఇచ్చారు. కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, శ్రీలక్ష్మీకీర్తి ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహం జరిగిన నాటి నుంచి అత్త విజయలక్ష్మి, మామ లక్ష్మీనారాయణతో పాటు భర్త నాగరాజు వేధింపులకు పాల్పడుతున్నారని, వివాహం జరిగిన కొన్నేళ్ల వరకు పిల్లలు పుట్టకపోవడంతో భర్త నాగరాజు వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడని, తనను ఇంట్లోకి రానివ్వడంలేదని బాధితురాలు శ్రీలక్ష్మీకీర్తి కోర్టును ఆశ్రయించారు. లక్ష్మీనారాయణ కుటుంబం గృహ హింసకు పాల్పడిందని గతంలోనే మెట్రోపాలిటన్ కోర్టులో రుజువైంది. బాధితురాలు శ్రీలక్ష్మీకీర్తికి కన్నా కుటుంబం రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని, గృహ వసతి నిమిత్తం నెలకు రూ.50 వేలు చెల్లించాలని, లక్ష్మీకీర్తి కుమార్తె కౌశికి మానసకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలు చెల్లించాలని మెట్రోపాలిటన్ కోర్టు గతంలో తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై కన్నా కుటుంబం అప్పీల్‌కు వెళ్లింది. వీరి అప్పీల్‌ను మహిళా సెషన్స్ కోర్టు తోసిపుచ్చి మెట్రోపాలిటన్ కోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థించింది.

క్లుప్తంగా...

నేడు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

సాక్షి, అమరావతి: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర స్వచ్ఛంద రక్తదాతల సంఘం వ్యవస్థాపకులు సాయిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని పాల్గొంటారని తెలిపారు.

జగన్‌పై నమ్మకం ఉండబట్టే ఆ నిధులిచ్చారు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను ఇప్పుడు ఇచ్చారంటే.. అప్పుడు చంద్రబాబుపై నమ్మకం లేక, ఇప్పుడు జగన్‌పై కేంద్రానికి నమ్మకం ఉండడం కాదా... అని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు అవినీతికి పాల్పడే అవకాశం ఉందనే అప్పుడు నిధులివ్వలేదన్నారు. ఇప్పుడు జగన్ అవినీతి రహిత పాలన చూసి కేంద్రం నిధులిచ్చిందని చెప్పారు. బీజేపీకి ఆంధ్రులపై అభిమానం ఉంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కొందరు చంద్రబాబు కోవర్టులు చెప్పే మాటలు నమ్మి అమిత్‌షా, జేపీ నడ్డా వంటి నాయకులు వైఎస్ జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో బీజేపీ నాయకులు ఆంధ్రులకు దూరం అవుతారు తప్ప.. ఆ పార్టీ పరపతి పెరగదని వ్యాఖ్యానించారు. కాపులను అడ్డు పెట్టుకుని చంద్రబాబుని గద్దె ఎక్కించాలని పవన్ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఒక్క వైఎస్సార్‌సీపీకి తప్ప, మరే పార్టీకీ ఒంటరిగా పోటీ చేసే సత్తా లేదని చెప్పారు.

టీటీడీ ద్వారా 1,933 ఆలయాల నిర్మాణానికి నిధులు

రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న 1,933 దేవాలయాలకు ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు మంజూరైనట్లు కొట్టు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం దేవదాయ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై మల్లిఖార్జునస్వామి దేవాలయం పునర్నిర్మాణం, ప్రాకార మండపం, సివిల్ వర్క్స్‌ను జూలై 30కి పూర్తి చేయాలని ఆదేశించారు.

నేటి నుంచి పవన్‌కళ్యాణ్ 'వారాహి' యాత్ర

సాక్షి, అమరావతి: అసెంబ్లీ ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో వారాహి విజయయాత్ర పేరుతో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ బుధవారం నుంచి ఉభయ గోదావరి జిల్లాల్లో రాజకీయ పర్యటనలు మొదలు పెట్టనున్నారు. అన్నవరం సత్యనారాయణస్వామి దర్శనం తర్వాత యాత్రను మొదలుపెట్టి ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కత్తిపూడి కూడలిలో తొలిసభ నిర్వహిస్తారు. ఈ నెల 16న పిఠాపురం, 18న కాకినాడ, 20న ముమ్మిడివరం, 21న అమలాపురం, 22న రాజోలు నియోజకవర్గం మలికిపురం, 23న నరసాపురం సభల్లో పవన్‌కళ్యాణ్ పాల్గొంటారని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

'షాక్' ఇచ్చింది చంద్రబాబే!

జగన్ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకే 'ఈనాడు' అంకెల గారడీ

- నాడు సబ్సిడీల కోతలు... నేడు అదనపు చెల్లింపులు
- భారీగా విద్యుత్ సబ్సిడీలు భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కొనుగోలు, సరఫరా వ్యయం పెరిగితే సర్దుబాటు సర్వసాధారణం
- ఏపీఈఆర్సీ ఉత్తర్వుల ప్రకారం ఇప్పుడు మరుసటి నెలలోనే సర్దుబాటు
- ఇదే బాబు చేస్తే ఒప్పు.. జగన్ చేస్తే తప్పన్నదే రామోజీ రాజ్యాంగం
- విద్యుత్ డిమాండు అనూహ్యంగా పెరిగినా కోతలు లేకుండా సరఫరా
- మసిపూసి మారేడుకాయ చేస్తున్న డ్రామోజీ చెప్పని వాస్తవాలివీ



సాక్షి, అమరావతి

'రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెరగడానికి గత టీడీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకమే కారణం. 2014–15 నుంచి 2018–19 మధ్య ఐదేళ్లలో ఆ ప్రభుత్వం చెల్లించాల్సిన సబ్సిడీలను చెల్లించకుండా విద్యుత్ పంపిణీ సంస్థలను నష్టాల ఊబిలోకి నెట్టేసింది. ప్రస్తుత ప్రభుత్వం చెల్లించాల్సిన సబ్సిడీలను పక్కాగా చెల్లించడమే కాకుండా అదనంగా విడుదలచేస్తూ ఆదుకునే ప్రయత్నం చేస్తోంది. 2014–19 మధ్య పెరిగిన విద్యుత్ కొనుగోలు, పంపిణీ వ్యయాలను అప్పటి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలికి (ఏపీఈఆర్సీ) సమర్పించలేదు. నిజానికి.. ఏపీఈఆర్సీ అనుమతించిన మేరకే డిస్కంలు విద్యుత్ చార్జీలను వసూలు చేస్తున్నాయి. అంతకుమించి ఒక్కపైసా కూడా వసూలు చేయడంలేదు. కానీ, ప్రజలు ఏమాత్రం భరించలేని విధంగా ప్రభుత్వం రకరకాల పేర్లతో ఇష్టారాజ్యంగా విద్యుత్ చార్జీలు పెంచిందంటూ 'స్విచ్చేస్తే షాకే' శీర్షికతో ఈనాడు మరో తప్పుడు కథనాన్ని మంగళవారం అచ్చేసింది..' అంటూ ఆ పత్రిక రాతలను విద్యుత్ పంపిణీ సంస్థలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మా జనార్ధన్‌రెడ్డి, కె.సంతోష్‌రావులు మంగళవారం అంశాల వారీగా వెల్లడించిన వివరాలివీ...

ఆరోపణ: సామాన్యులు మోయలేనంత భారీగా గత నాలుగేళ్లలో ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచింది.

వాస్తవం: ఈ అభియోగం పూర్తిగా అసత్యం. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వారికి రాష్ట్ర ప్రభుత్వం నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువనున్న ఎంబీసీలకు వంద యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించింది. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగానే 2021–22 ఆర్థిక సంవత్సరం నుంచి అప్పటివరకు అమలులో వున్న వార్షిక ట్రూఅప్ చార్జీల స్థానంలో త్రైమాసిక సర్దుబాటు చార్జీల విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి త్రైమాసిక సర్దుబాటు చార్జీల స్థానంలో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ సంవత్సరం జూన్ నుంచి నెలవారీ విద్యుత్ కొనుగోలు చార్జీల సవరింపును అమలుచేస్తున్నాయి. అందువల్ల జూన్‌లో ఈ సంవత్సరం ఏప్రిల్ నెల విద్యుత్ కొనుగోలు చార్జీలు వర్తిస్తాయి. నిబంధనల ప్రకారం కనిష్ట గ్రిడ్ డిమాండ్ ఉన్న సీజన్‌లో ధరలు తక్కువుంటే ఆ తగ్గింపు కూడా వినియోగదారులకు వర్తిస్తాయి. మిగతా రాష్ట్రాల్లో కూడా ఇదే విధానం అమలవుతోంది.

ఆరోపణ: ఉపాధి కోసం చిన్నచిన్న దుకాణాలు నడుపుకునే చిన్న వ్యాపారులకు కూడా విద్యుత్ చార్జీల పెంపు నుంచి మినహాయింపు ఇవ్వలేదు.

వాస్తవం: చిరు వ్యాపారుల ప్రయోజనాలను పరిరక్షించాలని ప్రభుత్వం ఎంతో అంకితభావంతో ఉంది. అందువల్లే చిరు వ్యాపారులకు 2019 నుంచి ఇప్పటి వరకూ విద్యుత్ చార్జీలు పెంచలేదు. చిరు వ్యాపారులకు మేలు చేయాలనే లక్ష్యంతోనే పలు వర్గాలకు సబ్సిడీ రూపంలో ఉచిత విద్యుత్ అమలుచేస్తోంది. సెలూన్ షాపులు నడుపుకునే వారికి నెలకు 150 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. దారిద్ర్యరేఖకు దిగువనున్న గోల్డ్ స్మిత్‌లు (బంగారు ఆభరణాలు తయారు చేసే వారికి) వంద యూనిట్లు, ఇస్త్రీ దుకాణాలు నడుపుకునే రజకులకు 150 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. మరికొన్ని వర్గాల చిరు వ్యాపారులకు కూడా కొంతమేర ఉచిత విద్యుత్ అందిస్తూ సబ్సిడీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ఆక్వా యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లు నడుపుకునే వారికి కూడా రాయితీతో కూడిన విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించింది. అంతేకాక.. చిరు వ్యాపారులకు జగనన్న తోడు ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం కూడా అందిస్తోంది.

ఆరోపణ: ప్రజల నుంచి ఏటా రూ.11,270కోట్లు అదనంగా వసూలుచేస్తూ ప్రభుత్వం దండుకుంటోంది.

వాస్తవం: ఇది పూర్తిగా అసత్యం. ఏటా వ్యవసాయ, గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు పెరుగుతాయి. వినియోగదారులు పెరిగినట్లే వసూలు మొత్తం పెరుగుతుంది. దీనిని అదనపు వసూళ్ల కింద చూపడం సమంజసం కాదు. పెరిగిన వ్యయాలకు అనుగుణంగా ఏపీఈఆర్సీ సిఫార్సుల ప్రకారమే డిస్కంలు విద్యుత్ చార్జీలు వసూలుచేస్తున్నాయి. ఇందులో కూడా ప్రభుత్వం కొంత భాగం సబ్సిడీగా భరిస్తోంది. విద్యుత్ పంపిణీ సంస్థలు వచ్చే ఆర్థిక సంవత్సరానికి వాటి ఆదాయ అవసరాల నివేదికలు ముందు సంవత్సరం సెప్టెంబర్ నెల నాటికి ఉన్న పరిస్థితుల ఆధారంగా రూపొందిస్తాయి. అప్పుడు వంద శాతం ఖచ్చితత్వంతో విద్యుత్ కొనుగోలు వ్యయం అంచనా వేయడం సాధ్యపడదు. ఆర్థిక సంవత్సరం జరుగుతున్నప్పుడు విద్యుత్ కొనుగోలు ఖర్చులో వాస్తవంగా హెచ్చుతగ్గులుంటాయి. అవి విద్యుత్ చట్టంలోను, సంబంధిత నిబంధనలలో నిర్దేశించిన విధంగా ఇంధన చార్జీలలోగానీ, విద్యుత్ కొనుగోలు వ్యయంలోగానీ ఉండే హెచ్చుతగ్గులు సర్దుబాటు చార్జీల ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలకు వసూలుచేసుకునే వెసులుబాటు ఉంటుంది. దాని ప్రకారమే రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ సర్దుబాటు చార్జీలు విధిస్తున్నాయి.

ఆరోపణ: ట్రూ అప్, ఇంధన సర్దుబాటు, విద్యుత్ సుంకం అంటూ రకరకాల పేర్లతో విద్యుత్ బిల్లులు వసూలుచేస్తూ ప్రభుత్వం ప్రజలకు షాక్ కొడుతోంది.

వాస్తవం: విద్యుత్ తయారుచేయాలంటే బొగ్గు, ఆయిల్ లాంటి అనేక ముడిపదార్థాలు అవసరం. వీటి కొనుగోలు ధర, రవాణా వ్యయం పెరిగినప్పుడు ఆ మేరకు విద్యుత్ చార్జీలను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఏ ప్రభుత్వానికైనా ఇలా చేయక తప్పదు. గత ప్రభుత్వం ఇలా చార్జీలు వసూలుచేస్తే ఒప్పుగా, ఇప్పుడు వసూలుచేస్తే తప్పుగా ఈనాడుకు కనిపిస్తోంది. ఈ సంవత్సరం విద్యుత్ నియంత్రణ మండలి వారి టారిఫ్ ఉత్తర్వుల ప్రకారం అన్ని వనరుల నుంచి సరాసరి విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్ రూ.4.31 ఉండగా, 2023 ఏప్రిల్ నెలలో సంభవించిన అధిక ఉష్ణోగ్రతలవల్ల గ్రిడ్ డిమాండ్ అంచనాల కన్నా అధికంగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం దాదాపు 617 మిలియన్ యూనిట్లను బహిరంగ మార్కెట్‌లో స్వల్పకాలిక కొనుగోళ్ల ప్రాతిపదికన రూ.475 కోట్లు ఖర్చుచేయాల్సి వచ్చింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి ఏపీఈఆర్సీ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ప్రతి యూనిట్‌కు రూ.0.20 ట్రూ అప్ చార్జీని డిస్కంలు వసూలుచేస్తున్నాయి. గృహ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సుంకం పెరగలేదు. ఇదివరకు నిర్దేశించిన ప్రకారమే యూనిట్‌కు కేవలం 6 పైసలు వసూలుచేస్తున్నాయి. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలకు సంబంధించి విద్యుత్ కొనుగోలు, సరఫరా వ్యయం ప్రతి యూనిట్‌కు దాదాపు రూ.1.0 పెరిగినప్పటికీ నిబంధనల మేరకు యూనిట్‌కు కేవలం రూ.0.40 సర్దుబాటుగా వసూలుచేస్తున్నాయి. ఆర్థిక సంవత్సరం 2020–21కు గాను కోవిడ్‌వల్ల విద్యుత్ డిమాండ్ కనిష్టంగా ఉన్న కాలంలో మార్కెట్ ధరలు అత్యంత కనిష్టంగా వున్నప్పుడు విద్యుత్ కొనుగోలు చేయడంతో దాదాపు రూ.4,800 కోట్లు విద్యుత్ పంపిణీ సంస్థలు మిగల్చాయి. ఈ తగ్గింపు వాస్తవ ఖర్చులు ఆడిట్ అయ్యాక విద్యుత్ నియంత్రణ మండలి వారు జారీచేసిన ఆర్థిక సంవత్సరం 2022–23 టారిఫ్ ఉత్తర్వులలో పంపిణీ సంస్థల నికర వార్షిక ఆదాయ అవసరాల నుంచి తగ్గించారు.

ఆరోపణ: వ్యవసాయ మీటర్లకు అమర్చే స్మార్ట్ మీటర్ల భారాన్ని ట్రూఅప్ చార్జీల రూపంలో ప్రజలపైనే వేయనుంది.

వాస్తవం: వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల బిగింపునకు అయ్యే మొత్తం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు స్పష్టంగా ప్రకటించింది. అయినా ఈ ఖర్చును ఇతర వినియోగదారులపై మోపుతారని 'ఈనాడు' పదే పదే అబద్ధాలు అచ్చేస్తోంది. ఈ స్మార్ట్ మీటర్ల ఖర్చు భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తగిన ఉత్తర్వులిచ్చింది. స్మార్ట్ మీటర్ల సరఫరాదారుని ఎంపిక ప్రక్రియ కూడా అత్యంత పారదర్శకంగా నిబంధనల ప్రకారమే పూర్తయింది.

మెరుగైన ఆరోగ్య సంరక్షణకు జగన్ ప్రభుత్వం ప్రాధాన్యం



మంత్రి రజిని సమక్షంలో ఒప్పందం చేసుకుంటున్న డీఎంఈ, సీఐఐ ప్రతినిధులు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు జీజీహెచ్‌లోని ప్రసూతివార్డు అభివృద్ధికి సీఐఐ సహకారం

సాక్షి, అమరావతి: ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ కల్పించడానికి సీఎం వైఎస్ జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుంటూరు జీజీహెచ్‌లోని ప్రసూతి వార్డు అభివృద్ధికి సహకారం అందించేందుకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ముందుకొచ్చింది. ఈ మేరకు మంత్రి రజిని సమక్షంలో మంగళవారం డీఎంఈ డాక్టర్ నరసింహం, సీఐఐ ఫౌండేషన్ ఏపీ చాప్టర్ చైర్మన్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రసూతి వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరిన వెంటనే సీఐఐ ముందుకురావడం అభినందనీయమని అన్నారు. ఈ వార్డులో రోజూ సగటున 350 మందికి ఓపీ సేవలు అందించడంతోపాటు 35 వరకు ప్రసవాలు చేస్తున్నట్లు తెలిపారు. నిత్యం 300 మంది ఇన్ పేషెంట్లు ఉండే ఈ వార్డును అభివృద్ధి చేయడం ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఇప్పటికే గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఇదే తరహాలో ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని బోధనాస్పత్రుల అభివృద్ధికి ఏకంగా రూ.3,820 కోట్లు ఖర్చు చేస్తున్నామని ఆమె వివరించారు.

ఎంపీ అవినాశ్ జైలు పాలే మీ లక్ష్యమా?

▶ మొదటి పేజీ తరువాయి

మంగళవారం విచారించింది. అయితే సుప్రీం వెకేషన్ బెంచ్ సీనియర్ న్యాయవాదులను అనుమతించకపోవడంతో పిటిషనర్ సునీత తన వాదనలు తానే వినిపించడం ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఆమెకు సహకరించేందుకు ధర్మాసనం అనుమతించింది. తాను పిటిషనర్‌నని, తన తండ్రి హత్యకు గురయ్యారని సునీత చెబుతుండగా.. ఆ విషయాల్లోకి తాము వెళ్లడం లేదని, వెకేషన్‌లో ఎందుకు వచ్చారని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఈ కేసులో జూన్ 30 కల్లా దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. చార్జిషీట్ ముందే ఫైల్ చేయాల్సి ఉంది. ఏ–8 (అవినాశ్) భారీ కుట్ర చేసిన ప్రధాన వ్యక్తుల్లో ఒకరు. సీబీఐ దర్యాప్తునకు సహకరించడంలేదు. ముందస్తు బెయిలు పొందడం వల్ల కస్టోడియల్ ఇంటరాగేషన్ కుదరడం లేదు. ముందస్తు బెయిలు ఎందుకు ఇచ్చారో కారణాలు తెలియడం లేదు' అని సునీత పేర్కొన్నారు. ఈ సమయంలో జస్టిస్ విక్రమ్‌నాథ్ జోక్యం చేసుకుంటూ 'దీంట్లో అంతగా అత్యవసరమైన పరిస్థితి ఏముంది? వెకేషన్ బెంచ్‌కు రావాల్సిన అవసరం ఉందా?' అని ప్రశ్నించారు.

సీబీఐ చూసుకుంటుంది..

'ఒక వ్యక్తిని అరెస్టు చేయాలో లేదో దర్యాప్తు సంస్థ చూసుకుంటుంది. ఎవరిని, ఎప్పుడు అరెస్టు చేయాలో ఎవరిని కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాలో సీబీఐకి తెలుసు. విచారణకు సహకరిస్తున్నారా.. లేదా.. అనేది కూడా సీబీఐ చూసుకుంటుంది. మీరెందుకు జోక్యం చేసుకుంటారు? ఈ కేసులో పలు సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయి. మీకెందుకు ఈగో క్లాషెస్? అతడిని (ఎంపీ అవినాశ్) జైలు పాలు చేయాలన్న లక్ష్యమా? ఆ విధంగా చూడొద్దు. ఈ తరహా ప్రొసీడింగ్స్ ఎందుకు?' అని జస్టిస్ అమానుల్లా వ్యాఖ్యానించారు.

ఇప్పుడీ పిటిషన్‌ను కొట్టివేస్తే..

ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇతర నిందితులతో కలసి సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీత ఆరోపించారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ అవినాశ్ సీబీఐ దర్యాప్తునకు సహకరిస్తున్నప్పుడు కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం ఏముందని ప్రశ్నించింది. 'మీకో సలహా ఇస్తాం. మీరు వ్యక్తిగతంగా వాదిస్తున్నారు. చట్టంపై అవగాహన లేమితో వాదనలో అంతగా ప్రావీణ్యం లేకపోవచ్చు. మేం ఇప్పుడు ఈ పిటిషన్‌ను కొట్టివేస్తే సీనియర్ న్యాయవాదికి ఇబ్బంది అవుతుంది. అందుకే సెలవుల తర్వాత విచారణ జాబితాలోకి చేరుస్తాం' అని సునీతను ఉద్దేశించి ధర్మాసనం పేర్కొంది. సీబీఐ దర్యాప్తు ఈ నెల 30 కల్లా పూర్తి కావాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఈ సమయంలో పేర్కొన్నారు. వాదనలకు సీనియర్ న్యాయవాదులను అనుమతించడం లేదన్న విషయాన్ని గుర్తు చేస్తూ తమకు ఇబ్బంది కలగ చేయవద్దని ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది. తాము ఇప్పుడు వాదనలకు అనుమతిస్తే మరో నలుగురు సీనియర్ న్యాయవాదులు తమను వివక్షకు గురి చేశారని ఆరోపించే అవకాశం ఉందని పేర్కొంది. తాము అనుమతించకపోయినప్పటికీ మీరు వాదనలు చేస్తున్నారంటూ లూథ్రాను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టులో మరో బెంచ్ నిర్దేశించిన డెడ్‌లైన్‌ను తాము మార్చలేమని స్పష్టం చేసింది.

గడువు నిర్దేశించాక ఎలా మారుస్తాం?

సీబీఐకు నోటీసులిచ్చి విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించాలని ధర్మాసనాన్ని సునీత కోరారు. అయితే ఇప్పటికే మరో బెంచ్ జూన్ 30వ తేదీ అని గడువు నిర్దేశించిన తరువాత తాము ఎలా మారుస్తామని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకవేళ ఇప్పుడు తాము జోక్యం చేసుకుంటే మొత్తం అంతా మారిపోతుందని వ్యాఖ్యానించింది. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వాలని సునీత మరోసారి అభ్యర్థించడంతో ధర్మాసనం స్పందిస్తూ.. 'ఎందుకు సీబీఐ రావాలని కోరుతున్నారు? రావాలో వద్దో సీబీఐ నిర్ణయించుకుంటుంది. ప్రతివాది సహకరించకుంటే, కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమైతే, హైకోర్టు ఆదేశాలు సరి కాకుంటే సీబీఐ తనకు తానే వస్తుంది. అందుకే చెబుతున్నాం. జూలై 3న కోర్టుకు రండి. మీ న్యాయవాది వాదిస్తారు' అని ధర్మాసనం సూచించింది.

న్యాయవాది వాదించడమే సబబు..

హైకోర్టు ఆదేశాలు నిష్ప్రయోజనమని ఈ అంశానికి సంబంధించి మరో కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని సునీత పేర్కొనడంతో అందుకే తాము సెలవుల తర్వాత రావాలని సలహా ఇస్తున్నామని ధర్మాసనం తెలిపింది. ప్రతివాది అవినాశ్ మీ కజినా? అని ధర్మాసనం పదేపదే సునీతను ప్రశ్నించగా... అవునని తన రెండో కజిన్ అని సునీత సమాధానమిచ్చారు. అయితే పిటిషనర్ తరఫున న్యాయవాది వాదించడమే సబబని, ఇందులో సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా సునీత పిటిషన్‌ను బుధవారం విచారణ జాబితాలో చేర్చాలని, అడ్వొకేట్ ఆన్‌రికార్డ్స్ హాజరవుతారని లూథ్రా న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వడంలో తాము జోక్యం చేసుకోబోమని, పిటిషనర్ విజ్ఞప్తి మేరకు ఈ నెల 19న విచారణ జాబితాలో చేర్చాలంటూ రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

మళ్లీ కాపులను మోసగించడానికే పవన్ యాత్ర

- పవన్ వారాహి యాత్ర.. చంద్రబాబు కుప్పం యాత్ర.. లోకేశ్ పాదయాత్ర.. ఇన్నాళ్లు ఏమయ్యాయి ఈ యాత్రలు
- కోవిడ్‌లో వీరంతా పక్క రాష్ట్రంలో తలదాచుకుంటే.. సీఎం వైఎస్ జగన్ ప్రజలను ఆదుకున్నారు
- సీఎం వైఎస్ జగన్ ప్రజలకు చేస్తున్న మంచి పవన్‌కు కనిపించటంలేదా?: కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి: చంద్రబాబు డైరెక్షన్‌లో మరోసారి కాపులను మోసం చేసే కుట్రతోనే పవన్‌కళ్యాణ్ వారాహి యాత్రను చేపడుతున్నారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి విమర్శించారు. కాపు ఉద్యమంపై కేసులు పెడితే ఎందుకు మాట్లాడలేదో వివరణ ఇచ్చి, కాపులకు క్షమాపణ చెప్పి అప్పుడు పవన్ యాత్ర చేపట్టాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాపు ఓట్లను చంద్రబాబు దరిచేర్చడానికే పవన్ యాత్ర చేపట్టాడని విమర్శించారు. చంద్రబాబుకు రాజకీయ మేలు కోసమే జనసేన పార్టీ పెట్టించారన్నారు. అందుకే బాబు ఇచ్చిన రూట్ మ్యాప్‌లో పవన్ యాత్ర చేపట్టారని, బాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌నే చదువుతారని ఎద్దేవా చేశారు. కాపులున్న ప్రాంతాల్లోనే పవన్‌తో చంద్రబాబు యాత్ర చేయిస్తున్నాడన్నారు. దీనివెనుక ఉన్న కుట్రను కాపులంతా తెలుసుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు రాష్ట్రంలో కాపులపై కేసులు పెట్టడంతోపాటు రాజకీయంగా కక్ష సాధింపునకు పాల్పడితే పవన్ ఏనాడైనా ప్రశ్నించాడా? అని నిలదీశారు. కాపులపై చంద్రబాబు పెట్టిన అక్రమ కేసులు ఎత్తేసిన సీఎం వైఎస్ జగన్ కాపులకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా చేస్తున్న మేలు పవన్‌కు కనబడటంలేదా అన్ని ప్రశ్నించారు. చంద్రబాబు కుప్పం యాత్ర, లోకేశ్ పాదయాత్ర, పవన్ వారాహి యాత్ర అంటూ ఇప్పుడు జనంలోకి వస్తున్నారని, ఇన్నాళ్లు వీళ్లంతా ఎక్కడున్నారని, ఈ యాత్రలు ఏమయ్యాయని నిలదీశారు. కోవిడ్ సమయంలో బాబు, పవన్, లోకేశ్ పక్క రాష్ట్రంలో తలదాచుకుంటే ఇక్కడ ప్రజలను అన్ని విధాలుగా ఆదుకున్నది సీఎం వైఎస్ జగన్ అని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌ను సింగిల్‌గా ఎదుర్కోలేక వీళ్లంతా కలిసి ప్రాంతాలు, కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తుపెట్టుకున్నారని, మరోసారి సీఎం వైఎస్ జగన్‌కు పట్టం కడతారని చెప్పారు.

వైఎస్ జగన్ పాలనలో టీబీ డ్యాం రికార్డులు

- అత్యధిక జలాల రాక, వినియోగం, విద్యుదుత్పత్తిలో..
- జూలై 15 కల్లా హగేరి ఆక్విడెక్ట్ శాశ్వత పునరుద్ధరణ పూర్తి
- రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన



సమావేశం అనంతరం మంత్రి బుగ్గనను సన్మానిస్తున్న టీబీ బోర్డు ఇంజనీర్లు. చిత్రంలో మంత్రి గుమ్మనూరు, ఎమ్మెల్యే సాయిప్రసాదరెడ్డి

కర్నూలు (సిటీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో తుంగభద్ర జలాశయం మూడు రికార్డులు నెలకొల్పిందని రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. అత్యధిక జలాల రాక, వినియోగం, విద్యుదుత్పత్తి జరిగాయని తెలిపారు. ఆయన మంగళవారం కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాదరెడ్డితో కలిసి కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌లోని తుంగభద్ర డ్యామ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980–81లో మొదటి అత్యధిక నీటివినియోగం.. 216.646 టీఎంసీలు నమోదైందని చెప్పారు. ఆ తర్వాత 2021–22లో 208.61 టీఎంసీలు, 2022–23 సంవత్సరంలో 190.432 టీఎంసీల నీటివినియోగం జరిగిందని తెలిపారు. 2021–22లో 205.230 మిలియన్ యూనిట్లు, 2022–23లో 193.26 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సైతం సీఎం వైఎస్ జగన్ హయాంలోనే నమోదైనట్లు చెప్పారు. డ్యామ్ చరిత్రలో అత్యధిక ఇన్‌ఫ్లో సైతం గత రెండేళ్లలోనే నమోదైనట్లు తెలిపారు. డ్యామ్ వద్ద పీపీపీ మోడల్‌లో మల్టీ మీడియా, లేజర్ షో, రోప్ వే ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీలను ఆధునీకీకరించనున్నట్లు తెలిపారు. జూలై 15వ తేదీ నాటికి హగేరి నదిపై ఆక్విడెక్ట్ శాశ్వత పునరుద్ధరణ పనులు పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం టీబీ డ్యామ్ ఇంజనీర్లతో కలిసి డ్యామ్ నీటినిల్వలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, తుంగభద్ర బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, జలవనరులశాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఎల్ఎల్‌సీ బళ్లారి ఈఈ నీలకంఠారెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు రూ.1,170 కోట్లు

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు



బి.కొత్తకోట: ఈ ఏడాదిలో రైతులకు వ్యవసాయ ఉచిత విద్యుత్ కనెక్షన్లకు ప్రభుత్వం రూ.1,170 కోట్లు భరించినట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోష్‌రావు చెప్పారు. ఆయన మంగళవారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌పై డిస్కం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో ఏపీఎస్పీడీసీఎల్ మొదటిస్థానంలో ఉందని చెప్పారు. 78 వేల కనెక్షన్లు మంజూరు చేసి, వాటికి ఉచితంగా ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. దీనికి ఖర్చయిన రూ.1,170 కోట్లను ప్రభుత్వమే భరించిందని చెప్పారు. రైతులపై పైసా భారం మోపలేదన్నారు. రూ.5,084 కోట్లతో వ్యవసాయ, గృహాలకు వేర్వేరుగా విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేసే పనులను దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు సర్వే పనులు చేపట్టాయని తెలిపారు. ఈ పనులు పూర్తయ్యాక పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని 13 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు ఉచిత విద్యుత్తుకు ప్రభుత్వం ఏటా రూ.5 వేల కోట్లు భరిస్తోందని తెలిపారు. జగనన్న కాలనీలకు సంబంధించిన 3,120 లేఅవుట్లలో విద్యుదీకరణ పనులకు రూ.1,413 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గృహాలకు పదివేల మీటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో రూ.500 కోట్లతో 110 విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏడులక్షల ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా కోసం ఏటా రూ.250 కోట్లు భరిస్తోందన్నారు. మండల కేంద్రంలో నివాసం ఉండని అధికారులు, ఉద్యోగులకు టీఏ, డీఏ నిలిపేస్తున్నట్లు ఆయన చెప్పారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మ్యాపథాన్ ముగింపు సదస్సులో ఐఐటీ-తిరుపతి డైరెక్టర్ సత్యనారాయణ



విజేతలతో ఐఐటీ తిరుపతి డైరెక్టర్, అతిథులు

ఏర్పేడు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్న అవకాశాలను సక్రమంగా వినియోగించుకుని దానికి తగ్గట్టుగా యువత ముందుకు సాగాలని ఐఐటీ–తిరుపతి డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ సూచించారు. ఐఐటీ–తిరుపతి ప్రాంగణంలో మంగళవారం జరిగిన మ్యాపథాన్ ముగింపు సదస్సులో ఆయన ప్రసంగించారు. ఐఐటీ–ముంబై ఫాసీ, ఐఐటీ–తిరుపతి నవ ఆవిష్కార్, ఐ హబ్ ఫౌండేషన్, రుద్రా ల్యాబ్ సహకారంతో ఫిబ్రవరి 23న ప్రారంభమైన మ్యాపథాన్‌లో 26 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 5,151 విద్యార్థులు 1,780 బృందాలుగా పాల్గొన్నట్లు వివరించారు. వీటిలో విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు ఎంతో సృజనాత్మకతతో ఉన్నాయని ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేసేలా చూడాలన్నారు. మ్యాపథాన్‌లో చాంపియన్లుగా ఎంపికైన 14 బృందాలకు రూ.5 వేల వంతున, విజేతలైన 74 బృందాలకు రూ.2 వేల వంతున, ముఖ్య విద్యార్థుల బృందాలకు రూ.వెయ్యి వంతున నగదు బహుమతులు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఐఐటీఎస్ఐఎఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీఈవో రోషన్‌శ్రీవాత్సవ మాట్లాడుతూ గెలుపొందిన బృందాలకు జీఐఎస్‌కు సంబంధించి ఇంటర్న్‌షిప్, సమ్మర్ ఫెలోషిప్, జాబ్‌మేళాలో అవకాశం కల్పించేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు కళాశాలలకు చెందిన బృందాలు చాంపియన్లుగా నిలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కన్నన్, పెన్నన్, ఫాసీ ప్రాజెక్ట్ మేనేజరు మహమ్మద్ కాసిమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



శరీరానికీ, మనసుకూ ఉమ్మడి ఆరోగ్య రహస్యం ఏమిటంటే, గతం గురించి చింతించకూడదు. భవిష్యత్తు గురించి ఆందోళన కూడదు. ఈ క్షణం వివేకంగా, మనఃపూర్తిగా జీవించాలి.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 14 జూన్ 2023

డేటా భారతంలో లీకుల భాగోతం

రకరకాల సందర్భాల్లో, డిజిటల్ వేదికల్లో మనం అందజేస్తున్న వ్యక్తిగత సమాచారం ఏ మేరకు సురక్షితం? చాలాకాలంగా వేధిస్తున్న ఈ ప్రశ్న సోమవారం మరోసారి ముందుకొచ్చింది. కోవిడ్ టీకాకరణకు డిజిటల్ బుకింగ్ సర్వీస్ వేదికైన ప్రభుత్వ పోర్టల్ 'కోవిన్' డేటాబేస్ నుంచి ప్రముఖుల వ్యక్తిగత డేటా సైతం టెలిగ్రామ్ యాప్‌లో దర్శనమిచ్చి, మనవాళ్ళ సమర్థతను వెక్కిరించింది. మలయాళ మీడియా 'ది ఫోర్త్' తన యూట్యూబ్ వీడియోలో చూపిన డేటా చోరీ వైనం దిగ్భ్రాంతికరం. అనేక వార్తాసంస్థలూ సదరు టెలిగ్రామ్ బాట్‌ను పరీక్షించి, లీక్ నిజమేనని నిర్ధారించాయి. ప్రభుత్వ సైబర్ భద్రతా సంస్థ 'ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్' దీనిపై విచారణ చేపట్టిందే తప్ప, కనీసం అప్రమత్తత జారీ చేయకపోవడం విచారకరం. ప్రభుత్వం అసలీ వార్తల్నే కొట్టిపారేయడం మరీ విడ్డూరం. కానీ, కోవిన్‌లోనే లభించే మైనర్లు, మేజర్ల సమాచారం ఈ లీకుల్లో ఉంది. ఇది అనుమానాల్ని పెంచుతోంది. సైబర్ సెక్యూరిటీ, డేటా చట్టాల తక్షణావసరాన్ని గుర్తు చేస్తోంది.

గతంలో 2018లోనే మన ఆధార్ డేటాబేస్ నుంచి భారీగా లీక్ జరిగినట్టు వార్తలొచ్చాయి. ఆ హ్యాకింగ్‌ను ప్రభుత్వం ఇప్పటి దాకా బాహాటంగా ప్రస్తావించ లేదు. 'కోవిన్' సంగతికే వస్తే, 2021 జూన్‌లోనూ 'కోవిన్' పోర్టల్ హ్యాకైంది. 15 కోట్ల మంది భారతీయుల డేటా అంగట్లో అమ్ముడైంది. అప్పుడూ మన సర్కార్ అదేమీ లేదంది. ఇక గత ఏడాది జనవరిలోనూ ఇలాంటి వార్తలే వచ్చాయి. అప్పుడూ డేటాబేస్ 'సురక్షితంగా ఉంద'ని నేషనల్ హెల్త్ అథారిటీ వాదించింది. కానీ, అసలు గోప్యతా విధానమంటూ ఏదీ లేకుండానే 'కోవిన్' జనంలోకి వచ్చింది. చివరకు 2021లో ఢిల్లీ హైకోర్ట్ ఆదేశించాక, తప్పక విధాన ప్రకటన చేసింది. తాజా ఉదంతంలో 'కోవిన్' వేదిక నుంచి 'నేరుగా ఉల్లంఘన' జరగలేదని ప్రభుత్వం తెలివిగా జవాబిచ్చింది. గతంలో కోవిన్‌లో కాక వేరెక్కడో చోరీ అయిన సమాచారమే ఇదంటోంది. మరి ఒకప్పుడు ఇలాంటి చోరీలే జరగలేదన్న సర్కార్... ఇప్పుడు తాజా చోరీ సమాచారం పాతదే అంటోందంటే ఏది నిజం? ఏది అబద్ధం?

అసలీ వార్తలన్నీ 'ఆధారరహితం, తుంటరి చేష్టలు' అన్నది ఎప్పటి లానే సర్కారు వారి పాత పాట. ఒకవేళ అదే నిజమనుకున్నా, ప్రభుత్వ సంస్థల చేతుల్లోని డిజిటల్ డేటా భద్రత, సత్వరమే వ్యక్తిగత డేటా రక్షణ చట్టం అవసరమైతే ఉంది. తాజా రచ్చ మరోసారి మనకు చెబుతున్న పాఠం అదే. ఢిల్లీలోని వైద్యసంస్థ ఎయిమ్స్ గత 8 నెలల్లో రెండుసార్లు సైబర్ దాడులకు గురైన సంగతి అంత తేలిగ్గా మర్చిపోలేం. వ్యక్తిగత ఆరోగ్య వివరాలు, అలాగే ఆధార్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ సమాచారం ఉన్న ఇతర పత్రాలకు మరింత భద్రత అవసరమని తాజా ఘటన అప్రమత్తం చేసింది.

'వందకోట్ల సార్లు యత్నించినా ఆధార్ భద్రతను ఛేదించడం అసాధ్యమంటూ 2018లో అప్పటి ఐటీ మంత్రి పార్లమెంట్ సాక్షిగా బల్లగుద్దారు. కానీ, మరిప్పుడు తాజా డేటా ఉల్లంఘనలో మొబైల్ నంబర్‌ను బట్టి ఆధార్ వివరాలు అంత కచ్చితంగా టెలిగ్రామ్ బాట్‌లో ఎలా వస్తున్నాయి? నిజానికి శరవేగంతో అన్నీ డిజిటలీకృతమవుతున్న ప్రపంచంలో కొత్త ముప్పు – వ్యక్తిగత డేటా లీకులు. అది ఇప్పుడు ప్రపంచమంతా ఉన్నదే. లక్షలాది రిటైల్ కస్టమర్లతో లావాదేవీలు నడిపే డొమినో ఇండియా నుంచి 18 కోట్ల మంది సమాచారం లీకు సహా అనేక పోర్టల్స్ నుంచి వ్యక్తిగత డేటా అంగట్లో సరుకు కావడం కొన్నేళ్ళుగా మన దేశంలో ఆనవాయితీ అయింది. 2020 నుంచి చూస్తే, అమెరికా, రష్యా, ఇరాన్‌ల తర్వాత ప్రపంచంలోనే అధికంగా 14 కోట్ల డేటా గోప్యత ఉల్లంఘనలు జరిగిన దేశం మనదే. ఇంత జరుగుతున్నా వ్యక్తిగత డేటా రక్షణపై దేశంలో ఇప్పటికీ సరైన చట్టం లేదు.

భారత్‌లో 2017లో డేటా గోప్యత బిల్లు తొలిసారిగా రూపుదిద్దుకున్నప్పటి నుంచి ఇప్పటికీ కొత్త చట్టం పనులు నత్తనడక నడుస్తున్నాయి. గడచిన వర్షాకాల సమావేశాల్లోనే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని అనుకున్నా, చివరకు దాన్ని పక్కన పడేసి, 2022 డిసెంబర్‌లో కొత్త ముసాయిదాను తెచ్చారు. అనేక విడతల సలహా సంప్రతింపులు జరిపినా, కొత్త బిల్లు ఇంకా పార్లమెంట్ మెట్లెక్కనే లేదు. కాగా, కేంద్రం త్వరలోనే ప్రతిపాదిత 'డిజిటల్ ఇండియా' చట్టాన్నీ, అలాగే సవరించిన 'డిజిటల్ డేటా పరిరక్షణ బిల్లు 2022'నూ పార్లమెంట్‌లో పెడుతుందని సమాచారం. అలాగే అన్ని రకాల ప్రభుత్వ డేటా నిల్వ, అందుబాటు, భద్రతా ప్రమాణాలకు ఉమ్మడి చట్రాన్నిచ్చే 'నేషనల్ డేటా గవర్నెన్స్ పాలసీ'ని ఖరారు చేస్తున్నామని అమాత్యుల మాట. భవిష్యత్తులో అవి ఊరట కావచ్చేమో.

అయితే, ఇకనైనా సంస్థలు తాము సేకరించిన వ్యక్తిగత డేటాను ఒక్కసారికే, సదరు నిర్ణీత ప్రయోజనానికే వాడుకొనేలా చట్టంలో కట్టుదిట్టాలు చేయడం కీలకం. సంస్థలపైనే బాధ్యత మోపాలి. అలాగే, డేటా చోరీ అనుమానం రాగానే సంభావ్య బాధితులందరికీ సదరు సంస్థలు సమాచారమివ్వడం తప్పనిసరి చేయాలి. దానివల్ల వారు వెంటనే పాస్‌వర్డ్‌లు మార్చుకొని, సురక్షితులయ్యే వీలుంటుంది. అయినా, ప్రభుత్వం చేతిలోని 'కోవిన్' లాంటి వాటి నుంచే డేటా లీకవుతూ పోతే పౌరులకిక ఏం నమ్మకం మిగులుతుంది? సమస్తం డిజిటలైన వేళ ఉల్లంఘనలు తప్పవనుకున్నా, నష్టాన్ని తగ్గించడం, డేటా గోప్యతకు చట్టబద్ధ రక్షణ కల్పించడం ప్రథమ కర్తవ్యం. ప్రభుత్వ కనీస కర్తవ్యం. లీకైన కోట్లాది ప్రజల డేటా నేరగాళ్ళ చేతిలో పడితే ఆర్థికంగా, సామాజికంగా చెలరేగే సంక్షోభం అనూహ్యం. అందుకే, ఈ లీకుల్ని కొట్టిపారేసే వైఖరి వదిలి, సర్కార్ కఠిన చర్యలకు దిగాలి. ప్రతిదానికీ పుట్టుపూర్వోత్తరాలన్నీ సేకరించే ధోరణి మాని, వీలైనంత వరకు అతి తక్కువ డేటానే సేకరించే పద్ధతి మేలంటున్న పౌరసమాజం మాటల్నీ పట్టించుకోవాలి.

క్రీడా జగతిలో మహిళల దుఃస్థితికి అద్దం

ఒక దశాబ్దం పాటు రెజ్లింగ్‌లో ఆధిపత్యం చలాయించిన రాజకీయ నాయకుడికి వ్యతిరేకంగా మహిళా మల్లయోధులు పోరాడుతున్నారు. బ్రిజ్ భూషణ్ సింగ్‌పై లైంగిక ఆరోపణలు కొత్తవి కావు. 2016లోనే అలాంటి కథనం పత్రికలో వచ్చింది. కానీ దాన్ని సద్దుమణిగేలా చేశారు. క్రీడలలో మహిళలపై లైంగిక వేధింపులు 'అసాధారణం కాదు' అనేది కలవరపరిచే వాస్తవం. భారతీయ క్రీడలను ఎంత బలహీనంగా మేనేజ్ చేస్తున్నారో దేశానికి తెలిసేలా చేయగలిగారు మన రెజ్లర్లు. ఇది బీజేపీతో ప్రారంభం కాలేదు, దీనితో ముగిసిపోదు. క్రీడా సమాఖ్యల నుండి రాజకీయ నాయకులను బయటకు పంపిస్తే తప్ప ప్రయోజనం ఉండదు. కేసును పోలీసులు ఎలా నిర్వహిస్తారు, బ్రిజ్‌భూషణ్‌కు ఏమవుతుంది అనేది క్రీడల్లోకి అడుగుపెడుతున్న అమ్మాయిలకు ఒక సంకేతంగా ఉంటుంది.

సందర్భం



బర్ఖా దత్

ఇలా చెప్పడం నాకు బాధగా ఉంది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పార్లమెంటేరియన్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ధైర్యంగా నిరసన తెలుపుతున్న భారతదేశపు ప్రముఖ రెజ్లర్లు, ఇప్పుడు వెనుకకు నెట్టబడి ఉండవచ్చు.

వేధింపులు, అధికార దుర్వినియోగ ఆరోపణలతో ప్రజల్లోకి వెళ్లే మహిళలకు తరచుగా జరిగే విధంగానే వ్యవస్థ సంపూర్ణ శక్తి సాధారణంగా వారికి వ్యతిరేకంగా ప్రబలంగా ఉంటుంది. అది ఫిర్యాదుదారుల శక్తిని మించిపోతుంది.

దీనిపై స్పందించిన రెజ్లర్లు తాము తిరిగి ప్రాక్టీసుకు రావడాన్ని తమ లక్ష్యం నుంచి వెనక్కి తగ్గినట్లు చూడకూడదని చెప్పారు. వారు నిరంతర నిబద్ధతతో బలంగా నిలబడిన కారణంగానే వారికీ, ప్రభుత్వానికీ మధ్య ఇటీవలి రౌండ్ చర్చలకు దారితీసింది. కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ ఛార్జిషీట్ దాఖలుకు జూన్ 15ను డెడ్‌లైన్‌గా విధించారు. అలాగే రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) నిర్వహణ కోసం జూన్ 30 వరకు ఎన్నికలు నిర్వహించాలని గడువు విధించారు. ఈ నిర్దిష్ట ప్రతిపాదనలను స్వాగతించాలి. జంతర్ మంతర్‌లో నిరసన కార్యక్రమం జరిగినప్పుడు వారిని లాగిపడేయడం, దూరంగా తీసుకుపోవడానికి ప్రయత్నించడానికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయిన తర్వాత, మల్లయోధుల పట్ల ప్రజల్లో ఏర్పడిన విస్తృత సానుభూతిని ప్రభుత్వం ఆలస్యంగా గుర్తించింది.

అయితే మరి తర్వాత ఏమి జరుగుతుందనే విషయంలో నేను ఎందుకు సంశయంగా ఉన్నాను?

ఆరుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై నాలుగు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 'లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం' (పోక్సో)కి చెందిన దరఖాస్తు ఉన్నందున ఆయన్ని వెంటనే అరెస్టు చేయడానికి బలమైన చట్టపరమైన ఆధారం ఉంది. వేధింపులు, దుర్వినియోగం తోపాటు వేధింపులకు సంబంధించిన 12 విభిన్న సందర్భాలను వారి ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్‌లు)లో పేర్కొన్న ఏడుగురు ఫిర్యాదుదారులలో ఒకరు మైనర్. అయితే గత వారం రోజులుగా మైనర్ తండ్రి పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారు. తన కుమార్తె పట్ల చెడుగా ప్రవర్తించాడని అనుకున్నందున తాను సింగ్ మీద తప్పుడు వేధింపు ఆరోపణలు చేసినట్లుగా ఆయన ఇప్పుడు చెబుతున్నారు. ఒత్తిడి, బెదిరింపుల పర్యవసానంలా కనిపిస్తున్న ఈ నిర్ణయాలను మార్చుకోవడం వల్ల (తన కుటుంబం భయంతో కొట్టుమిట్టాడుతోందని ఒక ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు), కేవలం తన కుమార్తె కేసును మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరి కేసునూ బలహీనపరిచే అవకాశం ఉంది. తన తొలి ఫిర్యాదులో, తన కూతురును ముందుకు రాకుండా చేసిన భయాన్ని తండ్రి ప్రస్తావించాడు. మరి ఈ రోజు కూడా అదే భయం ఆయన్ని ఆడిస్తోందా?



కలవరపరిచే వాస్తవాలు

వాస్తవం ఏమిటంటే, సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ చందర్ శేఖర్ లూథ్రా ఎత్తి చూపినట్లుగా, సింగ్‌పై దుర్వినియోగ ఆరోపణలు కొత్తవి కావు. అవి అంతకు ముందూ నమోదయ్యాయి. లూథ్రా నాతో మాట్లాడుతూ, 2016లో లక్నోలోని మహిళా శిబిరానికి హాజరైన ముగ్గురు యువ క్రీడాకారిణులు తమను బ్రిజ్‌భూషణ్ హోటల్ రూముకు రమ్మని పిలిచారని ఫిజియో థెరపిస్టుతో చెప్పినప్పుడు అలాంటి సంఘటన మొదటిసారి బయటపడిందని చెప్పారు. ''మేము నివేదించిన కథనాన్ని ఒక హిందీ వార్తాపత్రిక వాస్తవంగా ప్రచురించింది; కానీ అంతా సద్దుమణిగిపోయేలా చేశారు'' అని లూథ్రా చెప్పారు. మహిళా క్రీడాకారిణులకు బ్రిజ్ భూషణ్ వల్ల కలుగుతున్న వ్యథల గురించి ప్రభుత్వంలోని అధికారులకు కూడా తెలుసునని ఎఫ్ఐఆర్ ఆరోపించింది. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఫొటో అవకాశం సందర్భంగా సింగ్ ''నా పిరుదులపై చేయి వేయడానికి ప్రయత్నించారు' అని ఒక ఫిర్యాదుదారు చేసిన ప్రకటనను అంతర్జాతీయ రిఫరీ జగ్బీర్ సింగ్ కూడా ధ్రువీకరించారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వార్తాపత్రిక నివేదించింది.

అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో ఉన్న సంబంధాల గురించి, ముఖ్యంగా గ్యాంగ్‌స్టర్లకు ఆశ్రయం కల్పించారనే ఆరోపణలపై బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తాను విచారించినట్లు ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ నాతో చెప్పారు. చివరికి కోర్టులో కేసు వీగిపోయినప్పటికీ, సింగ్ నిర్దోషిగా విడుదలైనప్పటికీ, ''భూషణ్ ప్రమాదకరమైన వ్యక్తి'' అని నీరజ్ కుమార్ నాతో అన్నారు.

ఒకప్పుడు బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియాకు సలహాదారుగా ఉన్న కుమార్, క్రీడలలో మహిళలపై లైంగిక వేధింపులు ''అసాధారణం కాదు'' అనే వాస్తవాన్ని నొక్కిచెప్పారు. యువ మహిళా క్రికెటర్లు, క్రికెటర్ల తల్లుల నుంచి లైంగిక అనుకూలతను ఆశించిన సెలెక్టర్లు, కోచ్‌ల గురించిన ఆరోపణలు కూడా తనకు తెలుసుననేంత వరకూ నీరజ్ వెళ్లిపోయారు. ఆయన మాటలు వింటున్నప్పుడు నాకు ఒళ్లు జలదరించింది.

భారతీయ క్రీడలను ఎంత బలహీనంగా మేనేజ్ చేస్తున్నారో తెలిసేలా రెజ్లర్లు దేశం దృష్టిని అటువైపుగా మళ్లించారు. ఇది బీజేపీతో ప్రారంభం కాలేదు, దీనితో ముగిసిపోదు. క్రీడా సమాఖ్యల నుండి రాజకీయ నాయకులను బయటకు పంపిస్తే తప్ప ప్రయోజనం ఉండదు. లేదంటే, రాజకీయ అధికారం, ఫెడరేషన్ల నియంత్రణ మధ్య ఉన్న దుష్ట సంబంధం ఎప్పటికీ విచ్ఛిన్నం కాదు.

మౌనమే నయమా?

కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్‌ను ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇదంత సులభం కాదు. రెజ్లర్లు ఎత్తి చూపినట్లుగా, బ్రిజ్ భూషణ్‌కు ఫెడరేషన్‌పై గట్టి పట్టు ఉంది. ఆయన కుమారుడు కరణ్ భూషణ్ సింగ్ దాని ఉపాధ్యక్షుడు; ఆయన అల్లుడు ఆదిత్య ప్రతాప్ సింగ్ సంయుక్త కార్యదర్శి. రెజ్లింగ్ ఫెడరేషన్ మీద బ్రిజ్ భూషణ్ సింగ్ పరివార్ నిర్బంధం సమగ్రంలా కనబడుతోంది. గత వారాంతంలో ఆయన చేపట్టిన అయోధ్య ర్యాలీని రద్దు చేసినప్పటికీ, భారీగా జనానికి చేరువయ్యేలా తన ఉత్తరప్రదేశ్ నియోజకవర్గంలో పర్యటిస్తానని సింగ్ ప్రకటించారు.

అధికారానికి సంబంధించిన ఇలాంటి సంకేతాల మధ్య, మీరు ఫిర్యాదుదారుని కుటుంబం భయపడిందని నిందించగలరా? ప్రత్యేకించి బ్రిజ్ భూషణ్ సింగ్ లేదా ఆయనతో సంబంధం ఉన్నవారు... మిమ్మల్ని మీ కెరియర్‌లో పైకి తేగలిగి, అవసరమైతే తొక్కేయగలిగిన పక్షంలో. ఒక దశాబ్దం పాటు రెజ్లింగ్‌లో ఆధిపత్యం చలాయించిన రాజకీయ నాయకుడికి వ్యతిరేకంగా మహిళా క్రీడాకారులు పోరాడుతున్నారు. పోలీసులు ఈ కేసును ఎలా నిర్వహిస్తారు, బ్రిజ్ భూషణ్‌కు ఏమి జరుగుతుంది అనేది మనందరికీ ఒక సంకేతం; ముఖ్యంగా భారతీయ మహిళలు, అది పెద్దవాళ్లయినా, చిన్నవాళ్లయినా, ఇంకా ముఖ్యంగా ఇప్పుడే క్రీడల్లోకి అడుగుపెట్టిన బాలికలకు ఇది సూచనగా ఉంటుంది. ఈ విషయం గురించి మాట్లాడినందుకు ఇది వారు చెల్లించాల్సిన మూల్యం అని వాళ్ళు నమ్మాలని మనం కోరుకుందామా? మౌనం సురక్షితమని వారు భావించాలని మనం కోరుకుందామా?

వ్యాసకర్త ప్రముఖ పాత్రికేయురాలు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కోల్పోతున్న అవకాశం



హోటళ్లు, ఆతిథ్యం విషయంలో ఇండియా ప్రపంచంలోని అత్యుత్తమైన వాటితో పోటీ పడగలదు, ఓడించగలదు. అయినప్పటికీ ఇండియాకు చాలా చిన్న దేశాలైన ఇటలీ, స్పెయిన్ కంటే కూడా తక్కువ టూరిస్టులు వస్తుంటారు. టూరిజంలో తర్వాతి దశకు చేరగలిగే అవకాశం ఒకటి ఎదురుచూస్తోంది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

లేదంటే కుదరదు!



ట్విట్టర్ అనేది కేవలం ఒక సామాజిక మాధ్యమం. జాక్ డోర్సీ (ట్విట్టర్ సహ వ్యవస్థాపకుడు, మాజీ సీఈఓ) నేతృత్వంలో అది తనను తానో సార్వభౌమ దేశంలా భావించుకోవడం మొదలుపెట్టి, దాని కార్యక్రమాలు సాగుతున్న దేశ చట్టాలను అనుసరించాల్సిన అవసరం లేదనుకుంది. కానీ అలా నడవదు. ఇక్కడి చట్టాలను అనుసరించాల్సిందేనని చెప్పి భారత ప్రభుత్వం సరైన పనే చేసింది.

– సునంద వశిష్ట్, జర్నలిస్ట్

ఓవర్ రియాక్షన్



ట్విట్టర్‌ను సెన్సార్ చేయడానికి జరిగిన ప్రయత్నాల పట్ల జాక్ డోర్సీ ప్రత్యేకంగా ఇండియాను మాత్రమే విమర్శించలేదు. యూఎస్ ప్రభుత్వం, ఇతరులను కూడా విమర్శించారు. కానీ బీజేపీ ప్రతినిధులు, వారి చీర్‌లీడర్ల లాంటి టీవీ యాంకర్లు ఎందుకు అంత కోపోద్రిక్తులవుతున్నారు? వాళ్లు ఇండియాను దయనీయంగా కనబడేట్టు చేస్తున్నారు.

– తల్వీన్ సింగ్, కాలమిస్ట్

ఆ కోణమూ చూడాలి



భూమి తన చరిత్ర పొడవునా వేలాదిసార్లు తీవ్ర వాతావరణ మార్పులకు గురైంది. అసలు మనుషులే లేని కాలంలో వాతావరణ మార్పు ఎలా జరిగింది? లేకపోతే ఇప్పటి ప్రచారమంతా మరో కుంభకోణమా?

– అహ్మద్ మాలిక్, సర్జన్

ఆయనకూ భయమే



నేను పకోడీల్ని వేయిస్తున్నప్పుడు నేల మీదున్న బల్లిని గమనించాను. పనిలో చివరి దశలో ఉండి, అలా వదిలేసే వీలు లేక దాన్ని వెళ్లగొట్టమని నా భర్తను పిలిచాను. వంటగదిలో ఏనాడూ వేలుపెట్టని ఆ మనిషి నా చేతిలో ఉన్న జాలి గరిటెను తీసుకుని పకోడీల పని చూడటం మొదలుపెట్టాడు.

– ప్రేరణ, గృహిణి

సారాంశం
సరికొండ చలపతి

సంఘం చెక్కుతున్న 'కసి'ల్పాలు

ఓ రాజుగారికి బావమరిది అంటే గిట్టదు. ఆ రాజుగారు మంచాన పడ్డారు. చివరి ఘడియల్లో మతాచార్యులవారు ధైర్యం చెబుతూ ' నీ శత్రువులందరినీ క్షమిస్తే గానీ స్వర్గానికి వెళ్లే అవకాశం లేదు'అన్నాడట. రాజుగారు వెంటనే భార్యను పిలిచి 'నీ ముద్దుల సోదరుడిని క్షమించానని రాయి.. నే చనిపోయింతర్వాత ఆ ఉత్తరం పోస్టు చెయ్యి..' అని చివరి సందేశం వినిపించి కళ్లు మూశాడు.
చివరి ఘడియల్లోనూ అదే కసి..

.....

ఫ్రెడరిక్ చక్రవర్తి సైన్యాన్ని కఠోర నియమాలతో అదుపులోకి తెచ్చే శిక్షణలో పేరు పడ్డాడు. రాత్రుళ్ల పదకొండు దాటాక గుడారాల్లో ఎవ్వరూ దీపం వెలిగించి ఉంచకూడదని, ఉంచితే ఉరిశిక్షేనని ఉత్తరువు జారీ చేశాట్ట. ఓ రోజు తనిఖీకి వెళ్లి కెప్టెన్ టెంట్ హౌస్‌లో ప్రవేశించి ఆయన దీపం వెలుతురులో ఉత్తరం రాస్తున్న దృశ్యం చూశాడట. ఆ ఉత్తరం ఎవరికి? అని అడిగాడు. ' నా భార్యకి..' అని కెప్టెన్ భయంగా సమాధానం చెప్పాడు. అయితే.. నేను చెబుతాను మరో వాక్యం రాయి.. అని ' నేను రేపు చచ్చిపోతున్నాను. ' అన్న వాక్యం రాయించాడట. తెల్లారి ఆ కెప్టెన్‌ను ఉరి తీశారని చెప్పక్కర్లేదుగా.. ఇదొరకం కసి..

.....

ప్రముఖ రచయిత బుచ్చిబాబు 'కసి' పై రాసిన వ్యాసంలో చరిత్రలోంచి చెప్పిన ఉదాహరణలు. దాన్ని ఆయన 'కసిత్వం'గా పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న, పేరుకుపోయిన కసిని కాస్త తీవ్రంగా, కాస్త విశ్లేషణగా, కాసింత వెటకారంగా, మరింత ఆందోళనతో, ఆ వ్యాసంలో చర్చించారు. కసిత్వం, అచ్చంగా ద్వేషం మాత్రమే కాదు. ప్రపంచంపై రేగి ప్రసారమైన కోపం, ఆవేశం అంటారాయన. ఇది చాలా ఏళ్ల కిందటి మాట. ఇవాళ అదే కసిత్వంపై వ్యాసం రాస్తే ఒళ్లు గగుర్పొడిచే ఉదాహరణలు కనిపిస్తాయి.. ద్వేషం, అసూయ, ఆవేశం కలగలిపిన కసిత్వం తాలూకు పరాకాష్ఠ రోజూ వివిధ సంఘటనల రూపంలో మనల్ని కలవర పరుస్తూనే ఉంది.

• తనతో సహజీవనం చేసి ఆనందం, దుఃఖం పంచుకున్న ఒక అమ్మాయిని చంపి, ముక్కలుగా చేసి, కొన్ని ముక్కలు కుక్కర్లో ఉడికించి, కొన్ని మిక్సీలో వేసి.. – **మనసు చాలా రోజులపాటు వేటాడే కసిత్వం.**

• తాను ఇష్టపడ్డ, తనను ప్రేమించిన అమ్మాయి మరో యువకుడిని ఇష్టపడుతుందని, అతనివైపు మరలుతుందేమోనన్న అనుమానంతో అందరూ చూస్తుండగానే..20 సార్లు కత్తితో పొడిచి.. మళ్లీ వెనక్కు వచ్చి..బండరాయితో తలపై బాది.. **నిన్నటిదాకా ప్రేమగా ఉన్న అమ్మాయిపై ఈ స్థాయి కసిత్వం.. ఊహకు అందనిది.**

• ఒక అమ్మాయితో సంబంధం నెరపి, తనను పెళ్లి చేసుకోవాల్సి వస్తుందని.. ఆమెను చంపి ఉప్పు పాతర వేసి..దానితోపాటు నిన్నటి సంతోషాలు, స్నేహాలను కూడా పాతరేసి.. **ఇలా రోజుకో సంఘటన.. రోజుకో షాక్.. ఎంత కసిత్వంతో సమాజం నడుస్తుందో.. మనుషులకు మృగాలకు అంతరం ఎలా తరిగిపోతోందో.. అన్నీ ఉదాహరణలే.**

.....

ప్రేమ ద్వేషం పుట్టుపూర్వోత్తరాలు (Origin of Love and Hate)అనే గ్రంథంలో 'అయన్ సట్టి' అనే మానసిక శాస్త్రజ్ఞుడు ఇలా రాశారు.. **''ద్వేషంగా మారిన ప్రేమను మించిన ద్వేషం భూ ప్రపంచంలో లేదు...'** పై సంఘటనలు చూస్తే ఆయన మాట నిజం అనిపిస్తోంది.

ఇవన్నీ ఎప్పుడో అరుదుగా సంఘటనలైతే వ్యక్తిగతంగా వారి ప్రవర్తన లోపం కింద సర్దుకోవచ్చు గానీ.. తరచుగా జరుగుతున్న సందర్భం ఇది. మనం ఉంటున్న సమాజాన్నే దీనికి కారణంగా చెప్పాల్సి ఉంటుంది.

.....

ఇవన్నీ ఉన్మాద సంఘటనలు గానే మనం సరిపెట్టుకుని బాధ్యత నుంచి సమాజం తప్పుకున్నా.. మనం పైన చెప్పుకున్న 'అయన్ సట్టి' చెప్పిన మరోమాట మాత్రం అనుక్షణం గుర్తుపెట్టుకోవాల్సిందే. – ఎందుకంటే ఇప్పుడు సమాజంలో జరుగుతున్నదిదే కనుక. **'' నిందించబడిన శిశువుని మించిన కాఠిన్యం నరకంలో కూడా లేదు. తద్వారా బాల్యంలో ప్రబలిన ' కసి' అత్యంత ప్రమాదకరం...'..**

ఆ మధ్య విద్యారంగంపై జరుగుతున్న చర్చల్లో ఒక మానసిక నిపుణుడు చెప్పిన మాట చూడండి.

'తన ర్యాంకు కార్డుతో ఆనందంగా మీ దగ్గరకు పరుగెత్తుకు వచ్చిన చిన్నారి మొహంలో సంతోషంతో పాటు.. చిన్నారి కళ్లలో 'కసి'ని చూశారా..' మీరు గమనిస్తే అది పిల్లల్లో మనం ఇంజెక్ట్ చేస్తున్నదే, దయ, జాలి, స్నేహం, సాన్నిహిత్యం, పరస్పర మద్దతు స్థానంలో నిర్దయగా సమాజం పిల్లలో పోటీ, మంచి లైఫ్ పేరుతో ప్రవేశ పెడుతున్న రుగ్మత.. అది సమాజానికి శాపం.' – అని కుండబద్దలు కొట్టేశాడు.

పైన చెప్పిన 'అయన్ సట్టి' మాటలతో సరిపోల్చుకోవాల్సిన విషయం ఇది. సమాజం రూపురేఖలను నిర్ధారించే ఓ తరం కళ్లలో కసితో పెరుగుతోంది. ఆయన చెప్పినట్టు అత్యంత ప్రమాదకరంగా...

లైఫ్ రేసు లాంటిది.. నువ్వు పరుగెత్తకపోతే వెనుకబడిపోతావ్.. అని పోటీ ప్రపంచంలోకి పిల్లలను, బాల్యాన్ని నెట్టి పక్క వారిని స్నేహితులుగా, సహోద్యోగులుగా, తోటి మానవులుగా కాక ..పోటీ దారుల్లాగా చేస్తోంది ఈ విద్యావ్యవస్థ అంటారు బెర్ట్రాండ్ రస్సెల్. ఆయన ఇది చెప్పి పోయి దశాబ్దాలైనా.. ఇంకా అదే ఒరవడి, ఇంకాస్త బలంగా, స్పీడ్‌గా కొనసాగిస్తున్నాం.

.....

పోటీ అనేది సొంత అభివృద్ధికి,సొసైటీ బెటర్‌మెంట్‌కు అవసరమే. కానీ ఎవరితో పోటీ పడుతున్నాం, ఎందుకు పోటీ పడుతున్నాం అనేది కూడా చూసుకోవాల్సిందే. లేకుంటే పోటీ పడుతున్న తీరు సొసైటీ మానసిక ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని మానసిక శాస్త్రజ్ఞులు ప్రతి సందర్భంలో హెచ్చరిస్తూనే ఉన్నారు. సమాజంలో అనేక జాడ్యాలకు ఇది కారణం అవుతుందని చెబుతూనే ఉన్నారు. పోటీ అనివార్యమైతే ఎలాగోలా.. గెలవడమే మార్గం. టీఎస్‌పీఎస్సీ స్కామ్ దీనికి ఉదాహరణ. దీని మూలం పైన మానసిక శాస్త్రజ్ఞులు చెప్పిన దాంట్లోనే ఉంది. **జేఈఈ పరీక్షల్లో స్మార్ట్ కాపీయింగ్, జామర్లు పెట్టి పరీక్షలు నిర్వహించాలన్న మేధావుల సూచన పరాకాష్ఠ.** లక్షలాది యువకులు.. పిడికెడు అవకాశాలు పోటీలో పరుగెత్తాలన్న సొసైటీ ప్రోద్బలం... తద్వారా పెరుగుతున్న కసిత్వం.. ఎక్కడికి దారి తీస్తుందో చెప్పడానికి ఇది ఉదాహరణ

.....

ఐఐటీయన్ అయిన తన పిల్లాడిని కోల్పోయిన ఓ తండ్రి మాట వినండి.


''పొరుగు వారి కన్నా బాగుండాలని నేర్పించే సమాజంలో ఉన్నాం.. విద్యావ్యవస్థ, ఉద్యోగాల అవస్థ.. మన పిల్లలను పక్కోడితో ఎప్పుడూ పోటీలోనే ఉంచుతుంది.. తోటివారికన్నా మంచిర్యాంకు , మంచి డిగ్రీ, మంచి ఉద్యోగం, మంచి ఇల్లు, మంచి కారు.. మంచి కంఫర్ట్.. పోటీయే జీవితం.. ఎల్‌కేజీ అయినా, ఐఐటీ అయినా, ఐఏఎస్ అయినా., అంతే. గెలుపు తప్ప ఓటమికి వీలులేని లైఫ్. ఎలాగోలా గెలవడం.. ఎలాగోలా కంఫర్ట్ సాధించడం.. ఎలాగోలా.. ఇవన్నీ వ్యక్తుల్లో, సమాజంలో అలజడికే దారి తీస్తాయి కదా..? చివరికి వారి ఆత్మహత్య కూడా సమాజంపై వారు చూపించే నిరసనే..''

.....

.. ఈసారి మంచి ర్యాంకుతో, ఉద్యోగంతో మీ దగ్గరకు వచ్చిన పిల్లల కళ్లలోకి చూడండి. పైన పెద్ద మనిషి హెచ్చరించిన 'కసి' కనిపిస్తుందేమో.

ఒక వేళ కనిపిస్తే.. మంచి ర్యాంకు రాని నాడు, మంచి ఉద్యోగం రాని నాడు, ఓటమి అనివార్యమైననాడు.. అంతటి 'కసిత్వం' పిల్లలను ఎటువైపు నడిపిస్తుందో ఊహించండి. పైన చెప్పుకున్న అనేక అమానవీయ సంఘటనలకు, లేదా ఆత్మహత్యలకు బీజం పడకుండా ఆపగలుగుతాం.

• **ఈ ఫ్యామిలీ 'పాస్'**



అత్యధిక మార్కులు, ర్యాంకులు, తోటివారితో పోటీలకు భిన్నమైన, ఆనందకరమైన చిత్రమిది. పదోతరగతి బోర్డు పరీక్షలలో తమ కుమారుడు 35 శాతం మార్కులు సాధించినందుకు ముంబైలో ఓ కుటుంబం చేసుకుంటున్న సంబరం.. నెటిజన్లనుంచి ప్రశంసలందుకుంది.

రూపాలే వేరు

జ్యోతిర్మయం

ఒక పండుగ రోజున ఓ కుటుంబంలోని సభ్యులందరూ అభ్యంగన స్నానాలు చేసి, ఊళ్ళో ఉన్న దేవాలయాలకు వెళ్లారు. శివుడు, వెంకటేశ్వర స్వామి, రాముడు, అమ్మవారు, చివరిగా ఆ ఊరి గ్రామదేవతను కూడా దర్శించుకుని ఇంటికి వచ్చారు. ఆ రోజు వాళ్ళు ఒక అతిథిని భోజనానికి పిలిచారు.

పండుగ రోజు దేవాలయాలన్నీ రద్దీగా ఉండటంతో ఆ ఇంటి గృహిణి ఇంటికి వచ్చి, వంట మొదలు పెట్టడం ఆలస్యమైంది. అతిథి భోజనానికి ఒంటిగంటకు వచ్చాడు. గృహస్థు ఆయనను ఆహ్వానించి, వంట పూర్తవ్వ వస్తోందని వినయంగా చెప్పాడు. 'ఇంత ఆలస్యం ఎందుకయింద'ని అతిథి అడిగాడు. కుటుంబ పెద్ద 'మేం ఊళ్ళో దేవాలయాలన్నింటికీ వెళ్లాం. అక్కడ జనం ఎక్కువగా ఉండటం వల్ల వంట మొదలు పెట్టటం ఆలస్యం అయింద'ని చెప్పాడు.

వంట పూర్తయ్యాక ఆ ఇల్లాలు భోజనానికి లోపలికి రమ్మని పిలిచింది. గృహస్థు, అతిథికి కట్టుకోవడానికి పంచె ఇచ్చాడు. అతిథి 'ఇది ఉత్తరీయమా' అని అడిగాడు. గృహస్థు 'కాదు, పంచె' అన్నాడు. అతిథి దానిని భుజం మీద వేసుకుని 'ఇప్పుడు దీన్నేమంటారు?' అన్నాడు. 'ఉత్తరీయం' అన్నాడు గృహస్థు. అతిథి ఈ సారి దానిని తలకు చుట్టుకుని 'దీనిని ఇప్పుడేమంటారు?' అన్నాడు. 'తలపాగా' అన్నాడు గృహస్థు. దానినే అతిథి నడుముకు కట్టుకుని ఇప్పుడేమంటారు అని అడిగాడు. 'పంచె' అంటూ ఆయనెందుకిలా చేస్తున్నాడో అర్థం కాక ఆశ్చర్యంగా చూస్తున్నాడు గృహస్థు.

'వస్త్రం ఒక్కటే. ధరించిన తీరును బట్టి దానిని ఉత్తరీయం, తలపాగా, పంచె అంటున్నాం. అలాగే దైవం ఒక్కటే. రూపాలే వేరు. పురుష రూపం అయితే వెంకటేశ్వర స్వామి, రాముడు, మరో దేవుడు అంటాం. క్రోధ స్త్రీ రూపం అయితే కాళిక అంటాం. శాంత రూపం అయితే లలిత అంటాం. ఆయా రూపాలన్నీ ఆయా యుగాలలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం 'హరి' దాల్చిన అవతారాలే. రూపాలే వేరు. హరి ఒక్కడే. ఇన్ని రూపాలను పూజించనక్కరలేదు. మనసుకు నచ్చిన ఏ ఒక్క రూపాన్నో నమ్మి పూజిస్తే చాలు' అని చెప్పాడు అతిథి.

ఆ కుటుంబ సభ్యులందరినీ ఉద్దేశించి అతిథి చెప్పిన మాటలు మనందరికీ కూడా వర్తిస్తాయి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి బ.ఏకాదశి ఉ.10.18 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం అశ్విని ప.3.20 వరకు, తదుపరి భరణి, వర్జ్యం ప.11.26 నుండి 1.02 వరకు, తదుపరి రా.12.59 నుండి 1.29 వరకు, దుర్ముహూర్తం ప.11.33 నుండి 12.23 వరకు, అమృత ఘడియలు ఉ.8.20 నుండి 9.53 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.28, సూర్యాస్తమయం: 6.30.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్



ఆలయం వెలుపల కేంద్రమంత్రి పియూష్ గోయల్

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. మాజీ డీజీపీ ఆర్పీ ఠాగూర్, కిడాంబా మూవీ నటీనటులు అశ్విన్ బాబు, నందిత శ్వేత, నిర్మాత శ్రీధర్ తదితరులు శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

కష్టపడ్డ వారికి సముచిత స్థానం

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల సమావేశాలలో విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు గతంలో ఎవరూ చేయని విధంగా అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పదవులిచ్చి గౌరవించారని ఆ పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జి, ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ గ్రీవెన్స్ సెల్, సాంస్కృతిక విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌ఛార్జ్‌లు, జిల్లా అధ్యక్షులతో ఆయన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారన్నారు. ఈ నాలుగేళ్ల పాలనలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చిన ముఖ్యమంత్రి.. అవినీతి, అక్రమాలకు తావులేకుండా, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందుతున్న వారు సంతృప్తితో ఉన్నారని.. సీఎం జగన్ పాలనకు జనామోదం వ్యక్తమవుతోందని విజయసాయిరెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు న్యాయం జరగని పార్టీ కార్యకర్తలను కూడా గుర్తించి వారికి తగిన రీతిలో న్యాయం జరిగేలా పార్టీ చర్యలు తీసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. కిందిస్థాయిలో కార్యకర్తల సమస్యలను పరిష్కరించే బాధ్యతను పార్టీ గ్రీవెన్స్ విభాగం తీసుకోవాలని సూచించారు. పార్టీ అనుబంధ విభాగాలకు సంబంధించి కమిటీల నియామకం పూర్తికాగానే వాటిల్లోని సభ్యులకు ఐడీ కార్డులు జారీచేస్తామన్నారు. జిల్లా, మండల స్థాయి కమిటీల ఏర్పాటులో స్థానిక ఎమ్మెల్యేలు, నియోజక వర్గ సమన్వయకర్తలతో సమన్వయం చేసుకుని పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ బలోపేతానికి అనుబంధ విభాగాల నేతలిచ్చిన సలహాలు, సూచనలను అమలు జరిగేలా చేస్తానని విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నారాయణమూర్తి, సాంస్కృతిక విభాగ అధ్యక్షురాలు వంగపండు ఉష, ఏపీ ఫారెస్ట్ డెవలెప్‌మెంట్ చైర్మన్ గుర్రంపాటి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలి జనార్దనరెడ్డి ఆస్తుల స్వాధీనానికి ఆదేశం

- 77 ఆస్తుల్ని సీజ్ చేయాలని సీబీఐ కోర్టు ఉత్తర్వులు

బనశంకరి: ప్రస్తుత ఎమ్మెల్యే, కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డిపై క్రిమినల్ కేసు పరిష్కారమయ్యేవరకు ఆయనతో పాటు సతీమణి లక్ష్మీ అరుణారెడ్డి ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోవాలని మంగళవారం బెంగళూరులోని సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి జయంత్‌కుమార్ ఆదేశించారు. జనార్దనరెడ్డిపై నమోదైన క్రిమినల్ కేసు దర్యాప్తు ముగిసేవరకు మొత్తం 77 ఆస్తులను సీజ్ చేయాలని చెప్పారు. గతంలో గాలి జనార్దనరెడ్డి దంపతుల ఆధీనంలో ఉన్న మొత్తం 124 ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి అనుమతించాలని కోరుతూ సీబీఐ ఈ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారించిన న్యాయాధికారి 77 ఆస్తులను స్వాధీనానికి అనుమతి ఇచ్చారు. అక్రమ ఖనిజ విక్రయాల కేసులో గాలి జనార్దనరెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఇటీవల ఆదేశించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి నాగేంద్రతో పాటు 16 మందిపై గనులు, ఖనిజ అభివృద్ధి నియంత్రణ చట్టం కింద కేసుల దాఖలుకు ఆదేశించింది. 2008–2011 కాలంలో ఇనుప ఖనిజం విక్రయం వల్ల రాష్ట్ర ఆదాయానికి రూ.211 కోట్ల నష్టం వాటిల్లిందని కేసు నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ, సెస్ చెల్లించకుండా కుట్రపన్నారనే ఈ కేసులో గాలిజనార్దన రెడ్డి మొదటి నిందితుడిగా ఉన్నారు.

తల్లిని చంపి.. సూట్‌కేసులో కుక్కి..
ఓ కూతురు ఘాతుకం

నేరుగా పోలీస్ స్టేషన్‌కు సూట్‌కేసుతో వెళ్లి లొంగిపోయిన నిందితురాలు

అత్తా-అమ్మ మధ్య గొడవలతో నలిగిపోయిన కూతురు • బెంగళూరులో దారుణం



శవాన్ని కుక్కిన సూట్‌కేస్



నిందితురాలు సేనాసేన్

సాక్షి బెంగళూరు: అత్త, అమ్మ మధ్య రేగిన ఘర్షణ నేపథ్యంలో కూతురే అమ్మను హతమార్చి.. మృతదేహాన్ని సూట్‌కేసులో తీసుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. బెంగళూరు మైకో లేఔట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. బీవాపాల్ (70)ని కుమార్తె సోనాలి సేనాసేన్ (39) నిద్ర మాత్రలు ఇచ్చి, ఆ తర్వాత తన చున్నీతో గొంతు నులిమి చంపేసింది. పోలీసుల కథనం ప్రకారం.. కోల్‌కతాకు చెందిన ఫిజియోథెరపిస్ట్ సేనాసేన్ అస్సాంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుబ్రత్ సేన్‌ను పదేళ్ల క్రితం వివాహం చేసుకుంది. ఈ దంపతులు బెంగళూరు బీళేకహళ్లిలోని ఎస్ఎస్ఆర్ గ్రీన్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. వీరితోపాటు సేనాసేన్ అత్త, మామ, కొడుకు కూడా కలిసే ఉంటున్నారు. సేనాసేన్ తండ్రి మరణించడంతో తల్లి బీవాపాల్, తమ్ముడిని బెంగళూరులోని తన ఇంటికి తీసుకెళ్లింది. కాగా.. అత్తా, అమ్మ మధ్య చిన్నపాటి గొడవలు మొదలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యుల మధ్య మనశ్శాంతి కరువైంది. ఇంట్లో అత్త, అమ్మ మధ్య జరుగుతున్న గొడవ కారణంగా వారిని చూసుకునేందుకు రెండేళ్ల క్రితం తన ఫిజియోథెరపిస్ట్ ఉద్యోగం కూడా వదిలేసి సేనాసేన్ ఇంట్లోనే ఉంటోంది.

అమ్మ చంపేయమనడంతో..

రెండు రోజుల క్రితం ఇంట్లో ఉన్న మనవడు అల్లరి చేస్తుండడంతో బీవాపాల్ పిల్లాడిని మందలించి రెండు దెబ్బలు వేసింది. దీంతో సేనాసేన్ అత్తకు కోపం వచ్చి మరోసారి బీవాపాల్‌పై మండిపడింది. ఈ సమయంలో కూతురు సేనాసేన్ తన తల్లిని మందలించింది. మనవడి సంగతి వదలేయాలని.. తాము చూసుకుంటామని, అన్ని విషయాల్లో కలగజేసుకోవద్దని తల్లికి హితవు పలికింది. ఈ క్రమంలో కోపంతో తాను ఇన్ని మాటలు పడ్డాక బతికి ఉండటం వ్యర్థమని.. నువ్వే నాకు నిద్రమాత్రలు ఇచ్చి చంపేయాలని తల్లి బీవాపాల్ కూతురు వద్ద కన్నీటి పర్యంతమైంది. దీంతో కూతురు సేనాసేన్ కోపోద్రిక్తురాలై 'నువ్వు నిజంగానే నాన్న దగ్గరికి పో. నేను జైలుకు పోతాను' అని చెప్పింది. అత్త, అమ్మ మధ్య నలిగిపోతూ చేసేదేమీలేక తల్లిని చంపేయాలని నిర్ణయానికి వచ్చిన సేనాసేన్ సోమవారం ఉదయం 7 గంటలకు తల్లికి 20కి పైగా నిద్ర మాత్రలు ఇచ్చింది. ఉదయం 11 గంటలకు బీవాపాల్ కడుపు నొప్పితో అల్లాడుతుండగా.. ఆమె బాధ ఇంట్లో వారికి ఎవరికీ తెలియకూడదని భావించి తన చున్నీతో తల్లిని గొంతు నులిమి చంపేసింది. అనంతరం మృతదేహాన్ని సూట్‌కేసులో పెట్టుకుని క్యాబ్ బుక్ చేసుకుని నేరుగా బయట పడేయాలని నిర్ణయించుకుంది. అయితే, శవాన్ని బయట పడేసేందుకు ఇష్టం లేక మైకో లేఔట్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి 'మా అమ్మను నేనే చంపేశాను. అరెస్ట్ చేయండి' అని కోరింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ సేనాసేన్‌ను అరెస్ట్ చేశారు.

కెనడాలో వైభవంగా మలయప్ప స్వామి కల్యాణం

- హాజరైన 10 వేల మందికిపైగా భారతీయులు



స్వామివారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కెనడాలోని టొరంటో, మాంట్రియల్, ఒట్టావా నగరాల్లో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. టీటీడీ కెనడాతో పాటు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని 14 నగరాల్లో శ్రీనివాస కల్యాణం జరుపుతోంది. ఇందులో భాగంగా టీటీడీ నుంచి వెళ్లిన అర్చకులు, వేద పండితులు వైఖానస ఆగమం ప్రకారం కల్యాణ క్రతువును జరిపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎన్ఆర్‌టీఎస్ టీటీడీతో పాటు ప్రవాస భారతీయులను సమన్వయం చేసింది. తెలుగువారే కాకుండా ఇతర భారతీయ రాష్ట్రాలకు చెందిన 10 వేల మందికిపైగా ఎన్ఆర్ఐ భక్తులు కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తిరుమల నుంచి తీసుకెళ్లిన లడ్డూ ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ప్రవాసాంధ్రుల వ్యవహారాల ఏపీ ప్రభుత్వ సలహాదారు, ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్ ఎస్.మేడపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 17 నుంచి జూలై 23 వరకు యూఎస్ఏలో 11 నగరాల్లో శ్రీవారి కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవంలో కెనడాలోని ఇండియా హై కమిషన్.. హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మ, స్థానిక ఎంపీలు చంద్ర ఆర్యా, ఆనా రాబర్ట్స్ పాల్గొన్నారు. తెలుగు అలయన్స్ ఆఫ్ కెనడా ఆధ్వర్యంలో చారి సమంతపూడి, కరుణాకర్‌రెడ్డి పాపల, శ్రీనాథ్ కుందూరి, కల్పన మోటూరి, వైశంపాయన్ దతార్, అరుణ్, ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్లు జగన్‌మోహన్, వేణుగోపాల్ కల్యాణ ఏర్పాట్లు చేశారు. ఎస్వీబీసీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి స్వామివారి కల్యాణాన్ని వెబ్‌లైవ్ కవరేజీ అందించారు.

ఆరు నెలల చిన్నారిలో
అద్భుత ప్రతిభ

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



బంగారు పతకం, ప్రశంసాపత్రాలతో చిన్నారి లాస్విక ఆర్య

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా): ఆరు నెలల చిన్నారి మంత్రి లాస్విక ఆర్య అద్భుతమైన ప్రతిభ ప్రదర్శించి వరల్డ్ వైడ్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. అనకాపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన మంత్రి వెంకట నారాయణమూర్తి, తేజస్విని దంపతుల కుమార్తె లాస్విక ఆర్యకు ప్రస్తుతం తొమ్మిది నెలల వయస్సు. ఆరు నెలల వయస్సులో ఆమె తల్లి తేజస్విని ఇంట్లో కూరగాయలు, జంతువుల బొమ్మలను చూపించి వాటిని గుర్తించడంలో శిక్షణ ఇచ్చారు. మూడు నిమిషాల 36 సెకన్లలో 11 రకాల కూరగాయల బొమ్మలను గుర్తించిన వీడియోను తీసి గత మార్చి నెలలో వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపించారు. జంతువుల బొమ్మలను గుర్తించిన మరో వీడియోను తీసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపించారు. వాటిని పరిశీలించిన సంస్థల నిర్వాహకులు చిన్నారి లాస్విక ప్రతిభను మెచ్చుకుని ఈ నెల 12, 13 తేదీల్లో బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అంతర్జాతీయ స్థాయి గల రెండు సంస్థల బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పిస్తూ.. వారి యూట్యూబ్, ఇన్‌స్టా, ట్విట్టర్, ఫేస్‌బుక్ ఖాతాలలో వీడియోను పోస్ట్ చేశారు.

ప్రభుత్వంపై బురదచల్లడమే ఎల్లో మీడియా లక్ష్యం

989వ రోజు రిలే దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు



తాడికొండ: పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదచల్లడమే బాబూ అండ్‌కో ఎల్లో మీడియా లక్ష్యమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 989వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాష్ట్రానికి ఒక్క రూపాయి నిధులు సాధించలేని బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. రాజధాని పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూసిన బాబుకు న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బ తగలడం హర్షణీయమన్నారు. 54 వేల ఎకరాల్లో పేదలకు కేవలం 1,350 ఎకరాలు ఇళ్ళ స్థలాలకు కేటాయిస్తే కులవాదులకు వచ్చిన నష్టమేంటో చెప్పాలని ప్రశ్నించారు. పేదల కోసం పోరాటం చేయకుండా బాబు ప్రయోజనాల కోసం పాకులాడుతున్న వామపక్షాలు మనుగడ పూర్తిగా కోల్పోయాయని, అగ్రకుల పెత్తందారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న వామపక్షాలు, దళిత దళారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కనీసం కౌన్సిలర్‌గా గెలవలేని లోకేశ్ పాదయాత్ర పేరుతో చేస్తున్న హడావుడి చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, బొలిమేర శామ్యూల్, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు కలిసొచ్చినా గెలుపు వైఎస్సార్‌సీపీదే

మంత్రి మేరుగు నాగార్జున



తిరుపతి మంగళం/తిరుమల: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా చివరకు గెలుపు మాత్రం వైఎస్సార్‌సీపీదేనని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. తిరుపతి పద్మావతి అతిథిగృహంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో చంద్రబాబు.. టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన సుజనాచౌదరి, సీఎం రమేశ్‌లతో వైఎస్ జగన్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే సీఎం జగన్ సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి.. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారని చెప్పారు. అలాగే అన్ని రంగాల్లోనూ సంస్కరణలు తీసుకువచ్చి.. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు. అందుకే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను బీజేపీ వాళ్లు ప్రైవేటీకరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జనసేన అధినేత పవన్ ఎందుకు యాత్రలు చేస్తారో, ఎందుకు సీఎం జగన్‌పై విమర్శలు చేస్తారో ఆయనకే తెలియదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి వచ్చినా.. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. అనంతరం తిరుమల శ్రీవారిని మంత్రి దర్శించుకున్నారు. సమావేశంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, మల్లారపు మధు, రాజేష్, కిరణ్ పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని కప్పలకు పెళ్లి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో వరుణుడు కరుణించాలని కోరుతూ కప్పలకు పెళ్లి తంతు నిర్వహించారు. సంతోషిమాత ఆలయ అర్చకుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి పర్యవేక్షణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కప్పలకు వివాహం చేశారు. ఓ కప్ప మెడలో పుస్తెల తాడు కూడా వేశారు. ఒక చెక్కబల్లను ఊయలలా తయారు చేసి, దానికి కప్పలను కట్టి, మేళ తాళాలతో గ్రామంలో యువకులు ఊరేగించారు. మహిళలు ఆ కప్పలపై పసుపు, కుంకుమ వేసి, పసుపు నీళ్లు చల్లారు. – కొత్తపేట

ఉత్తరాంధ్రలో 'అమూల్' పాల సేకరణ ధర పెంపు

- గరిష్టంగా లీటర్‌కు గేదె పాలపై రూ.2.24, ఆవుపాలపై రూ.1.15 పెంపు
- కిలో వెన్నపై రూ.20, ఘన పదార్థాలపై రూ.8 మేర పెంపు
- నేటి నుంచి వర్తింపు



సాక్షి, అమరావతి: 'జగనన్న పాల వెల్లువ' ద్వారా అమూల్ తరపున ఉత్తరాంధ్ర జిల్లాల్లో పాలను సేకరిస్తున్న బనస్కాంత్ కోఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ మరోసారి పాల సేకరణ ధరను పెంచింది. ఈ పెంపు బుధవారం నుంచి వర్తించనుంది. అమూల్ తరపున రాయలసీమ జిల్లాల పరిధిలో కైరా యూనియన్, కోస్తా, సెంట్రల్ ఆంధ్రా జిల్లాల పరిధిలో సబర్కాంత్, ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో బనస్కాంత్ యూనియన్లు పాలు సేకరిస్తున్నాయి. పథకం ప్రారంభించినప్పుడు లీటర్‌కు గరిష్టంగా గేదె పాలకు రూ.71.47, ఆవు పాలకు రూ.34.20 చెల్లించగా, గత 30 నెలల్లో ఆ యూనియన్లు విడతల వారీగా ఏడుసార్లు ధరలు పెంచాయి. గతేడాది డిసెంబర్‌లో ఆరోసారి పాల సేకరణ ధరలను పెంచిన బనస్కాంత్ యూనియన్ తాజాగా మరోసారి ధరలు సవరించింది. లీటర్‌కు గేదె పాలపై గరిష్టంగా రూ.2.24, కనిష్ఠంగా రూ.1.12, ఆవు పాలపై గరిష్ఠంగా రూ.1.15, కనిష్ఠంగా రూ.0.97 చొప్పున పెంచింది. ఈ తాజా పెంపుతో లీటర్‌కు గరిష్ఠంగా గేదె పాలకు రూ.87.52, కనిష్ఠంగా రూ. 44.38, ఆవు పాలకు గరిష్ఠంగా రూ.43.61, కనిష్ఠంగా రూ.36.74 ధరలు ఉంటాయి. గడిచిన 30 నెలల్లో గేదె పాలపై రూ.16.53, ఆవు పాలపై రూ.9.49 మేర పెంచినట్లయ్యింది. అదే విధంగా కిలో వెన్నపై రూ.20, ఘన పదార్థాలపై రూ.8 మేర పెంచారు. తాజా పెంపు వల్ల 32,173 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. కాగా ఇప్పటివరకు 2.69 లక్షల మంది మహిళా పాడి రైతుల నుంచి 8.35 కోట్ల లీటర్ల పాలను సేకరించగా, రూ.370.76 కోట్లు చెల్లించింది.

ఉత్తరాంధ్రలో తాజాగా పెంచిన పాల సేకరణ ధరలు (రూ.లలో)

	కొవ్వు శాతం	ఎస్ఎన్ఎఫ్ శాతం	పాత ధర	కొత్త ధర	పెరిగిన ధర
గేదె పాలు	5.5	9	42.26	43.38	1.12
	11	9	87.52	89.76	2.24
ఆవు పాలు	3.2	8.7	35.77	36.74	0.97
	5.4	8.7	42.46	43.61	1.15

వెన్న,ఘనపదార్థాల సేకరణ ధరలు (కిలోకు రూ.ల్లో)

	పాతధర	కొత్త ధర	పెరుగుదల
వెన్న	796	816	20
ఘనపదార్థాలు	301	309	8

పోలీసులపై కోపంతో జీపు ఎత్తుకెళ్లాడు!

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రక్షక్ పోలీసు జీపును ఎత్తుకెళ్లిన నిందితుడు సూర్య (23)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం స్టేషన్ బయట జీపును పార్కింగ్ చేసి, తాళాలను అందులోనే వదిలేయడంతో ఓ వ్యక్తి జీపును చోరీచేసి.. తమిళనాడులోని వందవాసి వద్ద పోలీసులు పట్టుకున్నారు. సమాచారం అందుకున్న చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఇతర పోలీసు అధికారులు వందవాసివెళ్లి జీపుతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకుని మంగళవారం చిత్తూరుకు తీసుకొచ్చారు. చోరీపై నిందితుడ్ని ప్రశ్నిస్తే తాను ఓ ఫిర్యాదు చేయడానికి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళితే ఎవ్వరూ పట్టించుకోలేదని, అందుకే జీపును ఎత్తుకెళ్లినట్లు విచారణలో చెప్పినట్లు సమాచారం. కాగా నిందితుడు తమిళనాడులోని తిరున్వేలికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

యువతిపై ప్రేమోన్మాది దాడి

- నంద్యాల పట్టణంలో ఘటన
- పరారీలో నిందితుడు



యువతిపై దాడి చేసిన యువకుడిని అడ్డగించిన స్థానిక మహిళలు

బొమ్మలసత్రం(నంద్యాల): ప్రేమించడం లేదని ఓ యువతిపై ప్రేమోన్మాది దాడికి పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలి తల్లి తెలిపిన వివరాలివీ.. నంద్యాల పట్టణానికి చెందిన ఓ యువతి స్థానిక ఎస్పీజి కాలనీలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. పట్టణంలోని టెక్కె సుంకులమ్మ వీధిలో నివాసముంటున్న శ్రీకాంత్ అనే యువకుడు తనని ప్రేమించాలని రోజూ ఆమె వెంటపడి వేధించేవాడు. ఈ క్రమంలో మంగళవారం కళాశాల పూర్తయ్యాక ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న యువతిని శ్రీకాంత్ అడ్డగించి తనని ప్రేమించాలని, లేదంటే ఇక్కడే చంపుతానని బెదిరించాడు. యువతి అందుకు అంగీకరించకపోవడంతో పదునైన ఆయుధంతో యువతి తలపై దాడి చేశాడు. కళాశాల నుంచి స్థానిక ఎన్జీవోస్ కాలనీలోని యువతి ఇంటి వరకు దాడి చేస్తూ వెళ్లాడు. ఇది గమనించిన స్థానికులు దాడి చేస్తున్న యువకుడిని అడ్డుకుని నిలదీయడంతో వారిపైనా దాడికి యత్నించాడు. గాయపడిన యువతిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ పరారీలో ఉన్నాడు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నట్లు టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

• తెలంగాణ

పరీక్ష మధ్యలో వెళ్లి ఉరేసుకుని..

- బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య
- పరీక్ష హాల్ నుంచి బాత్రూంలోకి వెళ్లి బలవన్మరణం

భైంసా: పరీక్షలు రాస్తున్న విద్యార్థిని.. ఉన్నట్టుండి మధ్యలో లేచి వెళ్లిపోయింది.. అలాగని హాస్టల్ గదికి కాకుండా బాత్రూంలోకి వెళ్లింది.. అందులోని ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. నిర్మల్ జిల్లా బాసరలోని ట్రిపుల్‌ఐటీలో మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటన కలకలం రేపుతోంది. పరీక్షల ఒత్తిడితోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు ట్రిపుల్ ఐటీ అధికారులు చెప్తున్నారు. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం గౌరైకల్ గ్రామానికి చెందిన వడ్ల దీపిక.. బాసర ఆర్జీయూకేటీలో పీయూసీ–1 చదువుతోంది. మంగళవారం ట్రిపుల్‌ఐటీలో జరిగిన పరీక్షకు హాజరైంది. అయితే మధ్యలోనే ఆమె పరీక్ష హాల్ నుంచి బయటికి వెళ్లిపోయింది. హాస్టల్ గదికి వెళ్లాల్సిన ఆమె.. పరీక్ష హాల్ సమీపంలో ఉన్న బాత్రూంలోకి వెళ్లింది. చాలాసేపైనా ఆమె బయటికి రాకపోవడం, పిలిచినా పలకకపోవడంతో అక్కడివారు వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు తలుపులు బద్దలుకొట్టి చూడగా..దీపిక బాత్రూంలోని ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. ఆమెను వెంటనే క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌కు.. అక్కడి నుంచి భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, విషయం తెలుసుకున్న విద్యార్థి, ప్రజాసంఘాలు, ప్రతి పక్షాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు గేటు వద్ద ఆందోళనకు దిగారు. దీపిక ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నా యని, సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్షల ఒత్తిడి వల్లే దీపిక ఆత్మహత్యకు పాల్ప డినట్టు భావిస్తున్నామని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ చెప్పారు.

'ఆర్‌ఆర్‌ఆర్' అత్యంత శక్తివంతమైన చిత్రం

- హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్
- మూడు రోజుల జీ–20 స్పెషల్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం

రాయదుర్గం(హైదరాబాద్): భారతదేశ విశేషాలను ప్రపంచానికి చాటిచెప్పిన అత్యంత శక్తివంతమైన చిత్రంగా ×ఆర్‌ఆర్‌ఆర్‌× గుర్తింపు సాధించిందని హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా ఇన్‌స్ట్రక్షనల్ మీడియా(ఐఎంసీ) నిర్వహిస్తున్న మూడు రోజుల జీ–20 స్పెషల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓవెన్ మాట్లాడుతూ చలన చిత్రాలు ప్రపంచానికి కిటికీల వంటివన్నారు. ఉర్దూ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ.. అకడమిక్ కార్యకలాపాలతోపాటు జీవ వైవిధ్యం, క్యాంపస్ డెవలప్‌మెంట్ వంటి విభిన్న రంగాల్లో కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మనూ జీ–20 క్యాంపస్ కనెక్ట్ ప్రోగ్రామ్ చైర్ పర్సన్‌ప్రొఫెసర్ షగుఫ్తా షాహీన్, ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్, నిర్మాత ఒమర్ అజ్మీ, డాక్టర్ ఇంతియాజ్ ఆలమ్, అధికారులు, విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. మూడురోజులపాటు జరిగే ఈ ఫెస్టివల్‌లో జీ–20 దేశాల నుంచి మొత్తం 18 సినిమాలు ప్రదర్శించనుండగా, మొదటి చిత్రంగా ×ఆర్‌ఆర్‌ఆర్‌×ను ప్రదర్శించారు.

'ఆదిపురుష్' టికెట్టు రూ. 50 పెంపునకు తెలంగాణ అనుమతి

- ప్రత్యేక షోలతో 6 ఆటలకు సైతం అనుమతి

సాక్షి, హైదరాబాద్: రామాయణ కథను తెరకెక్కిస్తూ నిర్మించిన 'ఆదిపురుష్' సినిమా విడుదలయ్యే 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు టిక్కెట్ ధరలను రూ. 50 పెంచుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. రాష్ట్రంలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లకు ఇది వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 16వ తేదీ ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక షోలతో కూడిన ఆరు ఆటలతో సినిమాను నడిపించుకునేందుకు అన్ని రకాల థియేటర్లకు సడలింపు వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఈ అనుమతులు కేవలం ఆదిపురుష్ సినిమాకు మాత్రమేనని స్పష్టం చేసింది.

పైకప్పు నిర్మాణం చేపట్టండి

- రాంపురం హైస్కూల్ హెచ్ఎంకు డీఈఓ ఆదేశాలు

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం హైస్కూల్ తరగతి గదుల పైకప్పు రేకులు లేచిపోయి మొండిగోడలు దర్శనమిస్తున్న పరిస్థితిపై 'సాక్షి' ప్రధాన సంచికలో మంగళవారం ఫొటోవార్త ప్రచురితమైంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు స్పందించారు. హైస్కూల్ హెచ్ఎం జయపాల్‌రెడ్డి, సీఆర్పీ దోమల సత్యశ్రీనివాస్‌కు ఫోన్ చేసి గ్రామ పంచాయతీ సహకారంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలపై వేలాడుతున్న చెట్టుకొమ్మలను వెంటనే తొలగించి, గోడలపై రేకుల కప్పు నిర్మించి, విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

క్లుప్తంగా...

కశ్మీర్‌లో భూకంపం.. ఉత్తరభారతంలో ప్రకంపనలు

దోడా/న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. తీవ్రత రిక్టర్‌ స్కేలుపై 5.4గా నమోదైంది. ప్రజలు భయభ్రాంతులకు గురై ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. కొన్ని భవనాలకు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో దోడాకు 150 కిలో మీటర్ల దూరంలోని హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా, ఢిల్లీ, పంజాబ్, హరియాణాలతోపాటు పొరుగునే ఉన్న పాకిస్తాన్‌లోనూ ప్రకంపనలు సంభవించాయి. దోడాలో భూమికి ఆరు కిలో మీటర్ల లోతున భూకంప కేంద్రం ఉందని నేషనల్‌ సెంటర్‌ ఫర్‌ సిస్మోలజీ(ఎన్‌సీఎస్‌)తెలిపింది. దోడాలోని భదేర్వాహ్‌ పట్టణంలోని కొన్ని భవనాలకు పగుళ్లు సంభవించాయి. జిల్లా ఆస్పత్రిలోని ఓ వార్డు పైకప్పు కూలి శిథిలాలు రోగులపై పడ్డాయి. దీంతో, వారిని అధికారులు అక్కడి నుంచి ఖాళీ చేయించారు.

బిహార్‌ మంత్రి ఆకస్మిక రాజీనామా

పట్నా: బిహార్‌ మంత్రి సంతోష్‌ సుమన్‌ పదవికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. బిహార్‌ మాజీ ముఖ్యమంత్రి, హిందుస్తానీ అవామ్‌ మోర్చా(హెచ్‌ఏఎం) వ్యవస్థాపకుడు అయిన జీతన్‌ రామ్‌ మాంఝి కొడుకే సంతోష్‌ సుమన్‌. సంతోష్‌ సుమన్‌ సీఎం నితీశ్‌ కుమార్‌ కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను నిర్వహిస్తున్నారు. తమ పార్టీ హెచ్‌ఏఎంను అధికార జేడీయూలో విలీనం చేయాలంటూ ఒత్తిళ్లు ఎక్కువైనందునే వైదొలుగుతున్నట్లు సంతోష్‌ సుమన్‌ తెలిపారు. తన రాజీనామా లేఖను సీఎంకు పంపానన్నారు. సంతోష్‌ సుమన్‌ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. హెచ్‌ఏఎంకు సంకీర్ణంలో ఇక చోటులేదని స్పష్టం చేసింది. అసెంబ్లీలో హెచ్‌ఏఎంకు నలుగురు సభ్యులున్నారు.

నైజీరియాలో ఘోర పడవ ప్రమాదం.. 100 మంది మృతి

అబుజా: నైజీరియాలోని క్వారా రాష్ట్రంలో నైగర్‌ నదిలో పడవ మునిగిన దుర్ఘటనలో సుమారు 100 మంది చనిపోయారు. నైగర్‌ రాష్ట్రంలోని ఓ గ్రామంలో సోమవారం జరిగిన వివాహ వేడుకలో పాల్గొని పడవలో తిరిగి వస్తుండగా తెల్లవారు జామున మూడు గంటల సమయంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. ఉదయం వరకు ఈ ప్రమాదం విషయం ఎవరికీ తెలియలేదు. అనంతరం అధికారులు గాలింపు చేపట్టారు. ప్రమాదం నుంచి ఎవరూ బయటపడినట్లు సమాచారం లేదు.

జన విస్ఫోటనంతో దుర్బల భారత్‌!



- పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడానికి ప్రకృతి విధ్వంసం
- ఇతర దేశాలతో పోలిస్తే వాతావరణ మార్పుల ముప్పు అధికం
- హెచ్చరించిన పర్యావరణ నిపుణులు

వాతావరణ మార్పులు ప్రపంచ దేశాలకు పెను విపత్తుగా పరిణమిస్తున్నాయి. కొన్ని దేశాల్లో ఆకస్మిక వరదలు, అదే సమయంలో మరికొన్ని దేశాల్లో కరువులు.. ఇవన్నీ వాతావరణ మార్పుల ఫలితాలే. ఈ విపత్తు వల్ల ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలకూ ముప్పు ఉన్నప్పటికీ భారత్‌కు మాత్రం ఇంకా ఎక్కువ ప్రమాదం పొంచి ఉందని, దేశంలోని అధిక జనాభాయే ఇందుకు కారణమని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం(యూఎన్‌ఈపీ) కార్యనిర్వాహక డైరెక్టర్‌ ఎరిక్‌ సొల్హీమ్‌ స్పష్టం చేయడం గమనార్హం. వాతావరణ మార్పుల ప్రభావాలు ప్రపంచమంతటా కనిపిస్తున్నాయని చెప్పారు. అధిక జనాభా వల్ల భారత్‌ మరింత దుర్బల దేశంగా మారనుందని హెచ్చరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాతావరణ నిపుణులు ఏం చెబుతున్నారంటే..

- భూగోళం ఎదుర్కొంటున్న అన్ని రకాల పర్యావరణ సమస్యలు భారత్‌కు కూడా ఎదురవుతున్నాయి.
- భారత్‌లో ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల్లోని పలు నగరాలు, పట్టణాలు ఇప్పటికే కాలుష్యంతో నిండిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య తీవ్రత గురించి తెలిసిందే.
- నానాటికీ పెరిగిపోతున్న జనాభా, తద్వారా మానవ కార్యకలాపాలు ఈ కాలుష్యానికి, విపత్కర పరిస్థితులకు కారణమవుతున్నాయి.
- వాతావరణ మార్పుల ముప్పు అమెరికాతో పోలిస్తే భారత్‌కు అధికంగా ఉంది.
- భారత్‌లో ప్రకృతి విధ్వంసం కొనసాగుతోంది. మానవ ఆవాసాలు, వ్యవసాయం కోసం అడవులను యథేచ్ఛగా నరికేస్తున్నారు. ప్రకృతి సమతుల్యతకు దోహదపడే జంతుజాలం నశిస్తోంది. జీవవైవిధ్యం క్రమంగా కనుమరుగవుతోంది.
- పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడానికి ప్రకృతిని బలి చేయక తప్పడం లేదు. పరిమిత జనాభా కలిగిన దేశాలు, జనాభా పెరుగుదలను నియంత్రిస్తున్న దేశాల్లో ఇలాంటి పరిస్థితి పెద్దగా లేదు.
- భారత్‌లో జనాభా పెరుగుదలను నియంత్రిస్తే కాలుష్యాన్ని కట్టడి చేయవచ్చు. వాతావరణ మార్పులను కూడా నియంత్రించవచ్చు.
- భారత్‌ జనాభా 142 కోట్ల పైమాటే. జన విస్ఫోటనంతో ప్రపంచ కాలుష్య దేశాల జాబితాలో భారత్‌ మొదటి స్థానానికి చేరే రోజులు ఎంతో దూరంలో లేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- భూగోళంపై పర్యావరణాన్ని చక్కగా కాపాడుకుంటేనే మనుషులకు, జీవజాలానికి ఆవాసయోగ్యంగా ఉంటుంది. ఇందుకోసం ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ పరిరక్షణపై తక్షణమే దృష్టి పెట్టాలి.
- చైనాలో 100 శాతం విద్యుదీకరణ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్‌ వాహనాల వినియోగం పెరుగుతోంది. ఇతర దేశాల్లోనూ ఇలాంటి ప్రయత్నమే జరగాలని నిపుణులు సూచిస్తున్నారు.

– సాక్షి, నేషనల్‌ డెస్క్‌

భారత ప్రభుత్వం బెదిరించింది

- రైతుల ఉద్యమ సమయంలో ట్విట్టర్‌ ఖాతాలను నిలిపివేయాలని ఆదేశించింది
- మాట వినకపోతే భారత్‌లో ట్విట్టర్‌ను మూసేస్తామని హెచ్చరించింది.
- ట్విట్టర్‌ మాజీ సీఈఓ జాక్‌ డోర్సే సంచలన ఆరోపణలు
- ఖండించిన పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు
- డోర్సే పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం
- డోర్సే ఆరోపణలపై మోదీ ప్రభుత్వం స్పందించాలని కాంగ్రెస్‌ డిమాండ్‌



న్యూఢిల్లీ: భారత్‌లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020, 2021లో పెద్ద ఎత్తున రైతుల ఉద్యమం జరిగినప్పుడు ట్విట్టర్‌ ఖాతాలపై ఆంక్షలు విధించాలని కేంద్ర ప్రభుత్వం తమను ఆదేశించిందని, మాట వినకపోతే దేశంలో ట్విట్టర్‌ను మూసివేస్తామని హెచ్చరించిందని జాక్‌ డోర్సే సంచలన ఆరోపణలు చేశారు. ట్విట్టర్‌ సహ వ్యవస్థాపకుడైన జాక్‌ డోర్సే 2021లో ఆ సంస్థ సీఈఓ పదవి నుంచి తప్పుకున్నారు. ఖాతాలపై ఆంక్షలు విధించడంతోపాటు కొన్ని పోస్టులను తొలగించకపోతే సంస్థను మూసివేయడంతోపాటు ఉద్యోగుల ఇళ్లలో సోదాలు చేస్తామని భారత ప్రభుత్వం బెదిరించిందని, తమపై ఒత్తిడి తెచ్చిందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. తుర్కియే(టర్కీ), నైజీరియా ప్రభుత్వాల నుంచి కూడా తమకు బెదిరింపులు వచ్చాయని అన్నారు. చెప్పినట్లు చేయాలని అక్కడి ప్రభుత్వాలు తమపై ఒత్తిడి తెచ్చాయని పేర్కొన్నారు. భారత ప్రభుత్వంపై జాక్‌ డోర్సే చేసిన ఆరోపణలను కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్‌ చంద్రశేఖర్‌ మంగళవారం కొట్టిపారేశారు. డోర్సే పచ్చి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. డోర్సే సీఈఓగా ఉన్న సమయంలో భారత ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగా పనిచేసేందుకు ట్విట్టర్‌ యాజమాన్యం నిరాకరించిందని గుర్తుచేశారు. భారత ప్రభుత్వ చట్టాలు తమకు వర్తించవన్నట్లుగా వ్యవహరించిందని అన్నారు. ట్విట్టర్‌ సంస్థ నుంచి ఎవరూ జైలుకు వెళ్లలేదని, మన దేశంలో ట్విట్టర్‌ను మూసివేయలేదని చెప్పారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికే జాక్‌ డోర్సే పస లేని ఆరోపణలు చేస్తున్నారని రాజీవ్‌ చంద్రశేఖర్‌ ఆక్షేపించారు. జాక్‌ డోర్సే ఆరోపణలను కేంద్ర ప్రసార శాఖ మంత్రి అనురాగ్‌ ఠాకూర్, బీజేపీ సీనియర్‌ నేత, కేంద్ర ఐటీ శాఖ మాజీ మంత్రి రవి శంకర్‌ ప్రసాద్, బీజేపీ ఐటీ విభాగం నాయకుడు అమిత్‌ మాలవీయ తదితరులు ఖండించారు. దేశానికి వ్యతిరేకంగా కొందరు తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని, అలాంటి వారి ఖాతాలపై చర్యలు తీసుకోవాలని అప్పట్లో ట్విట్టర్‌ యాజమాన్యానికి సూచించామని రవిశంకర్‌ ప్రసాద్‌ అన్నారు.

కేంద్రం సమాధానం చెప్పాలి: ఖర్గే

ట్విట్టర్‌ మాజీ సీఈఓ జాక్‌ డోర్సే చేసిన ఆరోపణలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్‌ చేశారు. సోషల్‌ మీడియాను, జర్నలిస్టులను అణచివేయడం ప్రభుత్వం ఇకనైనా ఆపాలని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చేందుకు బీజేపీ పన్నుతున్న కుట్రలను కచ్చితంగా అడ్డుకుంటామని ఖర్గే తేల్చిచెప్పారు. డోర్సే ఆరోపణలపై మోదీ ప్రభుత్వం వెంటనే స్పందించాలని కాంగ్రెస్‌ సీనియర్‌ నేతలు జైరామ్‌ రమేశ్, రణదీప్‌ సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌ తదితరులు డిమాండ్‌ చేశారు.

ట్విట్టర్‌ ఖాతాలను బ్లాక్‌ చేశారు: తికాయత్‌

వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు సాగిస్తున్న ఉద్యమాన్ని ప్రముఖంగా వెలుగులోకి తీసుకొచ్చిన ట్విట్టర్‌ ఖాతాలను అప్పట్లో ప్రభుత్వం నిలిపివేసిన సంగతి నిజమేనని, ఈ విషయం చిన్న పిల్లలకు కూడా తెలుసని భారతీయ కిసాన్‌ యూనియన్‌(బీకేయూ) నేత రాకేశ్‌ తికాయత్‌ చెప్పారు. ఖాతాలను బ్లాక్‌ చేసేలా ట్విట్టర్‌ యాజమాన్యంపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందని అన్నారు. రైతుల ఉద్యమం ప్రజల్లోకి వెళ్లకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. చాలా ట్విట్టర్‌ ఖాతాలు ఇప్పటికీ మూసివేసి ఉన్నాయని వివరించారు. అసమ్మతిని, వ్యతిరేకతను కేంద్రం సహించదని వ్యాఖ్యానించారు.

తమిళనాడు మంత్రి ఇంట్లో ఈడీ సోదాలు

సాక్షి, చెన్నై: తమిళనాడు విద్యుత్, ఎక్సైజ్‌ శాఖల మంత్రి సెంథిల్‌బాలాజీకి చెందిన పలుప్రాంతాల్లో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌(ఈడీ) సోదాలు జరిపింది. చెన్నైలోని ఆయన నివాసాలు, కార్యాలయాలు, సచివాలయంలోని చాంబర్, కరూర్, కోయంబత్తూరు, ఈరోడ్‌లోని ఆయన సన్నిహితుల నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్‌ బలగాలు బందోబస్తు కల్పించారు. గత నెలలోనూ మంత్రి సెంథిల్‌ బాలాజీకి చెందిన 40 చోట్ల ఐటీ సోదాలు వారం రోజుల పాటు సాగిన విషయం తెలిసిందే. అయితే, సచివాలయంలో ఎలాంటి అనుమతులు పొందకుండా ఈడీ సోదాలు నిర్వహించడంపై డీఎంకే ప్రభుత్వం సీరియస్‌ అయింది. దీనిని సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడవటంగా సీఎం స్టాలిన్‌ అభివర్ణించారు. దీనిపై బుధవారం మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. 'రాజకీయంగా ఎదుర్కోలేని బీజేపీ, బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతోంది. వీటికి మేం భయపడం. ఈ విషయం వారే గ్రహించే సమయం దగ్గరపడింది' అని ముఖ్యమంత్రి స్టాలిన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. దివంగత సీఎం జయలలిత హయాంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న సెంథిల్‌ బాలాజీపై లంచాలు తీసుకుని ఉద్యోగాలిచ్చినట్లు (క్యాష్‌ పర్‌ జాబ్స్‌) కుంభకోణం కేసు ఉంది. ఇందులో మనీలాండరింగ్‌ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.

వచ్చే నెలలో సీడబ్ల్యూసీకి కొత్త టీమ్‌!

- కసరత్తు చేస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- ఎన్నికల దృష్ట్యా తెలంగాణ నుంచి ఒకరికి చోటు దక్కే చాన్స్‌?

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్‌ పార్టీలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ కాంగ్రెస్‌ వర్కింగ్‌ కమిటీ (సీడబ్ల్యూసీ) పునర్‌ వ్యవస్థీకరణపై పార్టీ చీఫ్‌ మల్లికార్జున ఖర్గే దృష్టి సారించారు. ఈ ఏడాది డిసెంబర్‌లోనే తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతుండటం, మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు ఎదుర్కోవాల్సిన దృష్ట్యా సీడబ్ల్యూసీ నియామకాలను పూర్తి చేసే కసరత్తులో పడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన పార్టీ మూడు రోజుల ప్లీనరీ సమావేశంలో, వర్కింగ్‌ కమిటీ సభ్యులందరినీ నామినేట్‌ చేసేందుకు పార్టీ అధ్యక్షుడికే పూర్తి అధికారం ఇవ్వాలని స్టీరింగ్‌ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా కుల, ప్రాంత, రిజర్వేషన్ల ప్రాతినిధ్యం ఆధారంగా సభ్యుల ఎంపికను మొదలుపెట్టినట్లు ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. రాయ్‌పూర్‌ ప్లీనరీలో తీసుకున్న నిర్ణయం మేరకు సీడబ్ల్యూసీలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, మహిళలు, 50 ఏళ్లలోపు యువకులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిన నేపథ్యంలో వీటి ఆధారంగా ఇప్పటికే కొన్ని పేర్లను షార్ట్‌లిస్ట్‌ చేసినట్లు తెలుస్తోంది. రాహుల్‌గాంధీ అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ లిస్ట్‌పై చర్చలు చేసి నెలలోగా తుది ప్రకటన చేస్తారని సమాచారం. ఇక సీడబ్ల్యూసీలోకి తెలుగు రాష్ట్రాల నుంచి ఎవరిని తీసుకుంటారనే దానిపై ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది చివరన జరగనున్న ఎన్నికల దృష్ట్యా తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం దక్కుతుందని ఏఐసీసీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీజేపీ పార్టీలో అత్యున్నత పార్లమెంటరీ బోర్డుతో పాటు, కేంద్ర ఎన్నికల కమిటీలో సీనియర్‌ నేత కె.లక్ష్మణ్‌కు ఆ పార్టీ అవకాశం ఇచ్చింది. మరోపక్క పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా డీకే అరుణ కొనసాగుతున్నారు. తెలంగాణ నేతలకు బీజేపీ ఇచ్చిన ప్రాధాన్యత మాదిరే రాష్ట్ర నేతలకు కాంగ్రెస్‌ హైకమాండ్‌ సీడబ్ల్యూసీలో ప్రాధాన్యమిస్తుందని భావిస్తున్నారు. ఒకవేళ చోటు కల్పించాలని నిర్ణయిస్తే షార్ట్‌లిస్ట్‌లో ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్లు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. పదేళ్ల కింద తెలంగాణ నుంచి మాజీ పీసీసీ అధ్యక్షుడు కె.కేశవరావు సీడబ్ల్యూసీలో సభ్యునిగా ఉండగా, ఆ తర్వాత రాష్ట్రం నుంచి కొత్త సభ్యుడిగా ఎవరికి అవకాశం దక్కుతుందన్న దానిపై తీవ్ర ఆసక్తి నెలకొంది.

రేటు కార్డా? సేఫ్‌ గార్డా?

- యువత భవిష్యత్తు ఎవరిపై ఆధారపడాలి?
- అది దేశమే తేల్చుకుంటుంది
- ఉద్యోగ నియామకాల్లో అవినీతిని అంతం చేశాం
- ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ
- రోజ్‌గార్‌ మేళాలో 70,000 మందికి నియామక పత్రాలు పంపిణీ



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై మరోసారి విరుచుకుపడ్డారు. కొన్ని రాష్ట్రాల్లో వారసత్వ పార్టీలు ఉద్యోగాల పేరిట 'రేటు కార్డ్‌ల'తో యువతను దోచుకుంటున్నాయని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం యువత ప్రయోజనాల పరిరక్షణ కోసం(సేఫ్‌గార్డ్‌) పని చేస్తోందని ఉద్ఘాటించారు. వారసత్వ పార్టీలా? లేక మంచి చేసే ప్రభుత్వమా? యువత భవిష్యత్తు ఎవరిపై ఆధారపడాలన్నది దేశమే తేల్చుకుంటుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ మంగళవారం రోజ్‌గార్‌ మేళాలో పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన 70,000 మందికి పైగా యువతీ యువకులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఇప్పటి విపక్షాలు గతంలో అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డాయని పరోక్షంగా కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. పథకాల పేరిట ప్రజాధనం దోచుకున్నాయని ఆరోపించారు. ఉద్యోగాల నియామకాల్లోనూ అవినీతి, అవకతవకలు జరిగాయన్నారు. రిక్రూట్‌మెంట్‌ ప్రక్రియలో అవినీతి, ఆశ్రిత పక్షపాతాన్ని ప్రోత్సహించడం ద్వారా వారసత్వ పార్టీలు యువతను దగా చేస్తున్నాయని ఆక్షేపించారు. తమ ప్రభుత్వం వచ్చాక పూర్తి పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు ప్రజా సాధికారతే లక్ష్యంగా కృషి చేస్తున్నామని వెల్లడించారు. గతంలో నియామక ప్రక్రియ పూర్తి కావడానికి ఏడాదికిపైగా సమయం పట్టేదని, ఇప్పుడు నెలల వ్యవధిలోనే పారదర్శకంగా పూర్తి చేస్తున్నామని గుర్తుచేశారు.

నిర్ణయాత్మకత.. మన గుర్తింపు

సమాజంలో విభజన తెచ్చేందుకు, ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు కొన్ని పార్టీలు భాషను ఒక ఆయుధంగా వాడుకుంటున్నాయని ప్రధాని మోదీ విమర్శించారు. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇలాంటి పెడపోకడలు కనిపిస్తున్నాయని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు బీజేపీని, హిందీ భాషను బూచిగా చూపిస్తూ పబ్బం గడుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఉద్యోగాలకు రేటు కార్డులు, కట్‌ మనీ వంటివి కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ రేటు కార్డులు యువత కలలను, సామర్థ్యాలను ఛిద్రం చేస్తున్నాయని చెప్పారు. ఉద్యోగాలు ఇప్పించినందుకు బదులుగా పేద రైతుల నుంచి భూములు తీసుకున్నందుకు ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్‌ యాదవ్‌ క్రిమినల్‌ కేసులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు.

ఆర్థిక వ్యవస్థకు కొత్త ధీమా

దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్‌ రంగంలో నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందుబాటులోకి వస్తున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ముద్రా యోజన, స్టార్టప్‌ ఇండియా, స్టాండప్‌ ఇండియా వంటి కార్యక్రమాలతో స్వయం ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతున్నాయని చెప్పారు. ఆర్థికంగా వేగంగా ముందుకు సాగుతున్నామని, మన దేశ ఆర్థిక వ్యవస్థకు గతంలో ఇలాంటి విశ్వాసం, ధీమా ఎన్నడూ లభించలేదన్నారు.

జెలెన్‌స్కీ సొంత పట్టణంపై రష్యా క్షిపణి దాడులు

11 మంది మృతి, 28 మందికి గాయాలు



కీవ్‌: ఉక్రెయిన్‌ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత పట్టణమైన క్రివ్యి రిహ్‌పై సోమవారం రాత్రి రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. ఒక అపార్ట్‌మెంట్‌ భవనం, గోదాముపై జరిగిన ఈ దాడుల్లో 11 మంది ప్రజలు చనిపోగా, మరో 28 మంది గాయపడ్డారు. రష్యా ఆక్రమణ మొదలైన 15 నెలల తర్వాత ఉక్రెయిన్‌ బలగాలు తీవ్ర ఎదురుదాడులు ప్రారంభించిన సమయంలో ఈ దాడి జరగడం గమనార్హం. క్షిపణులు సృష్టించిన విధ్వంసానికి సంబంధించిన ఫొటోలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ టెలిగ్రామ్‌ చానల్‌లో ప్రసారం చేశారు. దాడుల అనంతరం సహాయక చర్యలను చేపట్టినట్లు నీప్రోపెట్రోవ్‌స్క్‌ ప్రాంత గవర్నర్‌ చెప్పారు. ఘటనపై రష్యా రక్షణ శాఖ స్పందించింది. ఉక్రెయిన్‌ సైనిక స్థావరాలు, పశ్చిమదేశాలు అందించిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి డిపోలపై తాము దాడులు చేసినట్లు తెలిపింది. ఉక్రెయిన్‌లోని రెండో అతిపెద్ద నగరం ఖర్కీవ్‌పై షహీద్‌ డ్రోన్లతో రష్యా జరిపిన దాడుల్లో ఇద్దరు పౌరులు గాయపడ్డారని అధికారులు చెప్పారు. రాజధాని కీవ్‌పైనా రష్యా క్షిపణి దాడులు మంగళవారం కొనసాగాయని, అయితే, రక్షణ వ్యవస్థలు వాటిని గాలిలోనే అడ్డుకున్నాయని తెలిపారు. మొత్తం 14 క్షిపణుల్లో 10 క్షిపణులను, నాలుగు షహీద్‌ డ్రోన్లలో ఒకదానిని కూల్చేసినట్లు ఉక్రెయిన్‌ మిలటరీ ప్రకటించింది. అదేవిధంగా, జెపోరిఝియా, డొనెట్‌స్క్, లుహాన్‌స్క్‌ ప్రాంతాల్లో తిష్టవేసిన రష్యా బలగాలపై నాలుగు చోట్ల ఎదురుదాడి కొనసాగుతోందని తెలిపింది.

ప్రధాని మోదీతో జేక్‌ సలీవన్‌ భేటీ

న్యూఢిల్లీ: అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్‌ సలీవన్‌ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం సలీవన్‌ మంగళవారం ఢిల్లీకి చేరుకున్నారు. అనంతరం మోదీతో సమావేశమై, భారత్‌–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల ప్రగతిపై చర్చించారు. మోదీకి ఆహ్వానం పలికేందుకు తమ అధ్యక్షుడు జో బైడెన్‌ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని సలీవన్‌ తెలిపారు. తన అమెరికా పర్యటన ఫలవంతం కావాలని ఆకాంక్షిస్తున్నానని, ఇరు దేశాల ప్రయోజనాలతో ముడిపడిన ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై బైడెన్‌తో చర్చిస్తానని మోదీ ఈ సందర్భంగా సలీవన్‌తో చెప్పారు.

21న మోదీకి బైడెన్‌ దంపతుల ప్రత్యేక విందు

వాషింగ్టన్‌: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 21 నుంచి 24వ తేదీ దాకా.. నాలుగు రోజులపాటు అమెరికాలో పర్యటించనున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ దంపతులు ఈ నెల 21న మోదీకి ప్రత్యేక విందు ఇస్తారని, ఈ విందులో బైడెన్‌ కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొంటారని సమాచారం. 22న అధికారిక విందు జరుగుతుందని వైట్‌హౌస్‌ సీనియర్‌ అధికారి ఒకరు చెప్పారు. 22న విందు కంటే ముందు వైట్‌హౌస్‌ సౌత్‌ లాన్‌లో మోదీకి ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అయితే, 21న మోదీకి ప్రత్యేక విందు ఎక్కడ ఇస్తారన్నది ఇంకా తెలియరాలేదు.

రసాయనాల ట్యాంకర్‌ పేలి.. నలుగురు మృతి

పుణె: పుణె–ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై మంగళవారం కెమికల్‌ ట్యాంకర్‌ పేలిన ఘటనలో నలుగురు చనిపోగా మరో ముగ్గురు గాయపడ్డారు. మిథనాల్‌తో వెళ్తున్న ట్యాంకర్‌ లోనావాలా –ఖండాలా మధ్య ప్రమాదానికి గురైంది. అనంతరం పేలుడు సంభవించి, మంటల్లో చిక్కుకుంది. దీంతో, ట్యాంకర్‌లోని ఒక వ్యక్తితోపాటు పక్కనే వెళ్తున్న వాహనదారుల్లో ముగ్గురు తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం కారణంగా ఉదయం 11.40 నుంచి 12.40 గంటల వరకు ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. క్రేన్ల సాయంతో వాహనం శిథిలాలను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

బిపర్‌జోయ్‌తో భారీ విధ్వంసం

- 15న సాయంత్రం తీరాన్ని దాటే అవకాశం
- 150 కిలోమీటర్ల వేగంతో గాలులు.. 25 సెంటీమీటర్ల కుంభవృష్టి కురియవచ్చు
- గుజరాత్‌లోని కచ్, ద్వారక, జామ్‌నగర్‌లకు ఐఎండీ హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలిస్తున్న యంత్రాంగం



గాంధీధామ్‌లో ఏర్పాటు చేసిన తుపాను షెల్టర్‌

న్యూఢిల్లీ/అహ్మదాబాద్‌: అరేబియా సముద్రంలో కొనసాగుతున్న బిపర్‌జోయ్‌ తుపాను భారీ విధ్వంసాన్ని సృష్టించే ప్రమాదముందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఈ ప్రభావం గుజరాత్‌లోని కచ్, ద్వారక, జామ్‌నగర్‌ జిల్లాలపైనే ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. బిపర్‌జోయ్‌ మంగళవారం అత్యంత తీవ్ర స్థాయి నుంచి తీవ్రమైన తుపానుగా బలహీనపడిందని ఐఎండీ పేర్కొంది. ఇది గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్, మాండ్వి, జఖౌ పోర్టులతోపాటు పాకిస్తాన్‌లోని కరాచీ మధ్య ఈ నెల 15 సాయంత్రం తీరాన్ని తాకే అవకాశాలున్నాయని తెలిపింది. దీని ప్రభావంతో గంటకు 125 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. 'కచ్, ద్వారక, జామ్‌నగర్, పోరుబందర్‌ జిల్లాల్లో ఈనెల 13– 15 తేదీల మధ్య అత్యంత భారీగా 20 నుంచి 25 సెంటీమీటర్ల మేర కుంభవృష్టి కురియవచ్చు. తీవ్ర ఉధృతితో కూడిన ఈదురు గాలులు, అతి భారీ వర్షాలు కచ్, ద్వారక, జామ్‌నగర్‌ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలను వరదలు ముంచెత్తి, తీవ్ర నష్టం కలిగించవచ్చు'అని ఐఎండీ హెచ్చరించింది. 'రాజ్‌కోట్, మోర్బి, జునాగఢ్‌ల్లో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ ప్రాంతాల్లో ఈ నెల 15 వరకు గరిష్టంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. ఈ కారణంగా పంటలు, నివాసాలు, రహదారులు, విద్యుత్, సమాచార వ్యవస్థలు దెబ్బతింటాయి. సముద్రంలో ఆరు మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడే అలలు సౌరాష్ట్ర, కచ్‌ తీరాల్లోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తవచ్చు'అని ఐఎండీ డైరెక్టర్‌ జనరల్‌ మృత్యుంజయ మహాపాత్ర మీడియాకు తెలిపారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున చమురు అన్వేషణ, నౌకల సంచారం, చేపల వేట వంటివాటిని ఈ నెల 16 వరకు నిలిపివేయాలని ఐఎండీ తెలిపింది. తీరాన్ని దాటిన తుపాను బలహీనపడి, తన గమనాన్ని దక్షిణ రాజస్తాన్‌ వైపు మార్చుకుంటుందని ఐఎండీ అంచనా వేసింది. దీని ప్రభావంతో ఈనెల 15–17 తేదీల్లో ఉత్తర గుజరాత్‌లో భారీ వర్షాలకు కురుస్తాయని తెలిపింది. అరేబియా సముద్రంలో ఈ సీజన్‌లో ఏర్పడిన మొట్టమొదటి తుపాను బిపర్‌జోయ్‌..సముద్ర జలాల అసాధారణ వేడి వల్లే ఎన్నడూ లేనంత సుదీర్ఘకాలం పాటు తుపాను కొనసాగిందని ఐఎండీ వివరించింది. ఈ నెల 6న ఏర్పడిన ఈ తుపాను మంగళవారం నాటికి 8 రోజుల 9 గంటలపాటు కొనసాగిందని తెలిపింది.

30 వేల మంది తరలింపు

బిపర్‌జోయ్‌ ప్రభావిత జిల్లాలకు చెందిన 30 వేల మందిని తాత్కాలిక షెల్టర్లలోకి తరలించినట్లు గుజరాత్‌ ప్రభుత్వం తెలిపింది.తుపాను సంబంధిత ఘటనల్లో ఇప్పటి వరకు ఒకరు చనిపోయినట్లు తెలిపింది. ముందు జాగ్రత్తగా మూడు రైళ్లను రద్దు చేయడంతోపాటు 55 రైళ్ల ప్రయాణ మార్గాన్ని కుదించినట్లు పశ్చిమ రైల్వే తెలిపింది. సముద్రంలో ఓ ఆయిల్‌ రిగ్‌పై పనిచేస్తున్న 50 మంది సిబ్బందిని సోమవారం రాత్రి బయటకు తీసుకువచ్చారు. కాండ్లా పోర్టును మూసివేశారు. అక్కడ పనిచేసే 3 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మన్సుఖ్‌ మాండవీయ సహా ఐదుగురు కేంద్ర మంత్రులు సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు.

రాహుల్‌ ట్రక్కు జర్నీ..ఈసారి అమెరికాలో!



న్యూఢిల్లీ: కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీ మరోసారి ట్రక్కులో సవారీ చేశారు. తాజాగా అమెరికాలో ట్రక్కులో ప్రయాణించిన ఆయన భారతీయ అమెరికన్‌ డ్రైవర్లతో ముచ్చటించారు. వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఇటీవలి అమెరికా పర్యటన సమయంలో రాహుల్‌ గాంధీ..వాషింగ్టన్‌ నుంచి న్యూయార్క్‌ వరకు 190 కిలోమీటర్ల మేర ట్రక్కులో ప్రయాణించారు. ఈ జర్నీలో ట్రక్కు డ్రైవర్‌ తల్జీందర్‌ సింగ్‌ వికీ గిల్, సహ డ్రైవర్‌ రంజీత్‌ సింగ్‌ బనిపాల్‌లను వేతనాలు, సౌకర్యాలు, వృత్తి పరంగా భారతీయ అమెరికన్‌ ట్రక్కు డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి హోటల్‌లో భోజనం చేశారని కాంగ్రెస్‌ పార్టీ తాజాగా తెలిపింది. రాహుల్‌ గత నెలలో ఢిల్లీ నుంచి చండీగఢ్‌ వరకు ట్రక్కు ప్రయాణం చేశారు. ఆ సమయంలో ట్రక్కు డ్రైవర్ల సమస్యలను తెలుసుకున్న విషయాన్ని గుర్తు చేసింది. అమెరికాలో డ్రైవర్ల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకునే ట్రక్కులను రూపొందిస్తారని రాహుల్‌ గాంధీ తెలిపారు. ఇలాంటివి ఏర్పాట్లు భారత్‌లో ఉండవని రాహుల్‌ చెప్పారు. భారత్‌లో డ్రైవర్లు అరకొర జీతాలు, సౌకర్యాలతో ఇబ్బందులు పడుతుండగా, అమెరికాలో సరిపోను వేతనాలు, గౌరవప్రదమైన జీవితం ఉంటుందని రాహుల్‌ తెలుసుకున్నారు. మన రవాణా వ్యవస్థకు ఎంతో కీలకమైన ట్రక్కు డ్రైవర్లకు గౌరవప్రదమైన జీవితం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారని కాంగ్రెస్‌ తెలిపింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
బుధవారం । 14 । జూన్ । 2023

నటుడు కజన్‌ఖాన్ కన్నుమూత



తమిళసినిమా: నటుడు కజన్‌ఖాన్ సోమవారం కేరళలో కన్నుమూశారు. మలయాళీ కుటుంబానికి చెందిన ఈయన మాతృభాషతో పాటు, తమిళం, కన్నడంలో 50కి పైగా చిత్రాల్లో నటించారు. 1992లో సెంతమిళ్ పాట్టు చిత్రంతో పరిచయమయ్యారు. ఆ తర్వాత వరుసగా కలైంజర్ వేడన్, సేతుపతి ఐపీఎస్, సింధూనది, ఎస్ ఆసై మచ్చాన్, వల్లరసు, డ్యూయెట్ చిత్రాలతో గుర్తింపు పొందారు. ఆయన నటుడు విజయ్‌తో కలిసి బద్రి, ప్రియమానవళే చిత్రాల్లో నటించారు. కజన్ ఖాన్ మలయాళంలో చివరిగా నటించిన చిత్రం లైలా ఓ లైలా 2014 ఆ తర్వాత బిజినెస్‌పై దృష్టి సారించారు. కజన్‌ఖాన్ సోమవారం గుండెపోటుతో కేరళలో కన్నుమూశారు. ఈ విషయాన్ని మలయాళ నిర్మాత ఎన్ఎం.బాదుషా తన ట్విట్టర్ ద్వారా తెలిపారు. పలువురు సినీ ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

20న తిరువారూర్‌కు బిహార్ సీఎం

సాక్షి, చెన్నై: బిహార్ సీఎం నితీశ్‌కుమార్, డెప్యూటీ సీఎం తేజశ్వీయాదవ్ ఈనెల 20న తిరువారూర్‌కు రానున్నారు. ఇక్కడ జరిగే డీఎంకే దివంగత నేత కరుణానిధి స్మారకకోట్టంను ప్రారంభించనున్నారు. కరుణానిధి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన పుట్టి నగడ్డ తిరువారూర్‌లో రూ.12 కోట్లతో కలైంజ్ఞర్ కోట్టంను నిర్మించారు. ఇక్కడ పేదల కోసం రెండు కల్యాణ వేదికలు, కరుణ విగ్రహం, గ్రంథాలయం నిర్మాణాలతో కలైంజ్ఞర్ కోట్టంను తిరువారూర్ రథంను తలపించే విధంగా బ్రహ్మాండంగా తీర్చిదిద్దారు. వీటి ప్రారంభోత్సవానికి బీహార్ సీఎం నితీశ్‌కుమార్, డెప్యూటీ సీఎం తేజశ్వీయాదవ్‌లను సీఎం స్టాలిన్ ఆహ్వానించారు. అలాగే, చెన్నైలో కరుణానిధి స్మారకంగా నిర్మించిన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని రాష్ట్రపతి ద్రౌపదిముర్మ చేతుల మీదుగా ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఆమె రెండు సార్లు తన పర్యటనను వాయిదా వేసుకోవడంతో సీఎం స్టాలిన్ ఈనెల 15న ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు.

సెలవుల్లో పెరిగిన ప్రయాణాలు

సాక్షి, చెన్నై: సెలవులు దొరికితే చాలు ప్రయాణాలు చేసే వారి సంఖ్య పెరిగినట్టు థామస్ కుక్ ఇండియా సర్వేలో తేలింది. మంగళవారం స్థానికంగా ఈ సర్వే వివరాలను ఆ సంస్థ హెడ్ రాజీవ్ కాలే, ఎస్ఓటీసీ ట్రావెల్ హెడ్ డేనియల్ డిసౌజా వెల్లడించారు. ఓమ్నీ చానల్ ట్రావెల్ సర్వీసెస్‌తో కలిసి 3,500 మంది వద్ద ఈ సర్వే వివరాలను సేకరించామని ఈ సందర్భంగా తెలిపారు. దేశంలో కోయంబత్తూరు, తిరుచ్చి, మదురై, జైపూర్, ఇండోర్, పుణె, లక్నో, మైసూర్, విశాఖ పట్నం నగరాలలో సర్వే చేసి ఇండియా హాలీడే రిపోర్టు-2023ను తయారు చేశామని ఈ సందర్భంగా వివరించారు. సెలవులు, ప్రయాణాలు, వినియోగదారుల ప్రవర్తన, సానుకూలత, ప్రయాణాలలో ఆప్యాయతలు, పలకరింపులు వాటిని ప్రతిబింబిస్తూ చేసిన సర్వేలో సెలవులు దొరికితే చాలు ప్రయాణాలు అధికం చేసే వాళ్లే ఉన్నట్టు తేలిందని ఆయన పేర్కొన్నారు. అత్యంత సానుకూలంగా ఉండే వినియోగదారులే అధికంగా ఉన్నారని, ఇలాంటి వారి జీవిత కాల జ్ఞాపకాలు పదిలంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

విమానాశ్రయంలో ఎంఆర్ఓ కేంద్రం

సాక్షి, చెన్నై: చెన్నై విమానాశ్రయంలో ఎంఆర్ఓ కేంద్రం ఏర్పాటు కానుంది. తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన 32 వేల చదరపు అడుగుల స్థలంలో విమానాలకు మరమ్మతులు, పర్యవేక్షణ నిమిత్తం ఈ కేంద్రం ఏర్పాటు కానుంది. చెన్నై మీనంబాక్కం విమానాశ్రయం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక్కడ పెరుగుతున్న విమానాల రాకపోకలు, ప్రయాణికుల సంఖ్యతో ప్రత్యామ్నాయంగా మరో విమానాశ్రయంపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి. అదే సమయంలో ఈ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ హంగులతో అత్యాధునికంగా తీర్చిదిద్దారు. ఇక్కడ విమానాల రాకపోకలు, పార్కింగ్‌కు అవకాశాలు ఉన్నా, ఏదేని మరమ్మతులు చేయాల్సిన పక్షంలో, సాంకేతికంగా విమానాలను క్షుణ్ణంగా పరిశోధించి టేకాఫ్‌కు అనుమతించాల్సి వచ్చినా అందుకు తగ్గ వసతులు తక్కువే. మరమ్మతులు చేయడం కోసం ఇక్కడ ప్రత్యేకంగా ఎలాంటి కేంద్రం లేదు. దీంతో రన్‌వేకు తూర్పుభాగంలోని కౌల్ బజారు సమీపంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 32 వేల 300 చదరపు అడుగుల స్థలాన్ని విమానయానశాఖ గతంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. కోరిన వెంటనే ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కూడా ఇచ్చింది. అయితే, ఏడాది తర్వాత ఈ స్థలంలో నిర్వహణ, రిపేర్స్, ఆపరేషన్(ఎంఆర్ఓ) కేంద్రాన్ని ఏర్పాటుకు విమానాయాన శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన పనులకు ఒప్పందాలు ఢిల్లీలో మంగళవారం జరిగాయి.

వేదారణ్యేశ్వర ఆలయభూమి 2122.10 ఎకరాలు

- దేవస్థానం పేరుతోనే పట్టా
- హిందూ ధార్మికశాఖ మంత్రి శేఖర్‌బాబు ప్రకటన

కొరుక్కుపేట: ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన మే 7, 2021 నుంచి మే 31, 2023 వరకు, ఆలయాలకు చెందిన రూ.4,505 కోట్ల విలువైన 4,802 ఎకరాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద 1771.17 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్ రద్దు కాగా, 2541.26 ఎకరాల భూములు కంప్యూటరైజ్డ్ చిత్ర ప్రిపరేషన్ బిల్లులో తప్పుగా వర్గీకరించి అప్పీల్ ద్వారా రికవరీ చేశారు. అలాగే ఆలయ భూసేకరణ పనుల్లో 1,16,886 ఎకరాల భూమిని కొలిచి సరిహద్దు రాళ్లు వేసి సంరక్షించామని ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శేఖర్ బాబు వెల్లడించారు. వేదారణేశ్వర ఆలయానికి చెందిన 2122.10 ఎకరాల భూమికి సంబంధించి ఆలయం పేరుతోనే పట్టాను ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

తెగదెంపులకు పట్టు

- పళనిస్వామిపై ఒత్తిడి
- అన్నామలైకు వ్యతిరేకంగా అన్నాడీఎంకేలో తీర్మానం
- కూటమిపై పునఃపరిశీలనకు సిద్ధమని సంకేతం
- అన్నామలై రూపంలో ఇరకాటంలో రాష్ట్ర బీజేపీ



సమావేశంలో పళనిస్వామి, నేతలు

సాక్షి, చెన్నై: తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్యలు అన్నాడీఎంకే వర్గాల్లో ఆక్రోశాన్ని రగిల్చాయి. తమ అమ్మ జయలలితను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలను మంగళవారం జరిగిన అన్నాడీఎంకే జిల్లాల కార్యదర్శుల సమావేశం తీవ్రంగా పరిగణించింది. బీజేపీతో తెగదెంపులు చేసుకుందామని పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామిపై జిల్లాల కార్యదర్శులు ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. చివరకు ఆగ్రహాన్ని అన్నామలైకు వ్యతిరేకంగా ఖండన తీర్మానం రూపంలో తెలియజేశారు. ఈ తీర్మానాన్ని మీడియా ముందు వివరించే క్రమంలో పళనిస్వామి ఆక్రోశంతో వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

మొదటి నుంచి అన్నామలై అన్నాడీఎంకే నేతలను ఉద్దేశించి తరచూ నోరు జారుతున్నారు. పలు మార్లు ఆయన్ను అన్నాడీఎంకే నేతలు హెచ్చరించారు. ఒకే కూటమిలో ఉంటూ మిత్రపక్షాన్ని కించపరచడం భావ్యం కాదని హితవు పలికారు. అయితే అన్నామలై ఈసారి మరో అడుగుముందుకు వేసి జయలలితను టార్గెట్ చేయడం వివాదానికి దారి తీసింది. ఓ ఆంగ్ల మీడియా ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు రచ్చకెక్కాయి. అన్నాడీఎంకే నేతలు ఆక్రోశాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాల కార్యదర్శుల భేటీలో చర్చ..

లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం అవుతూ, జిల్లాల వారీగా పార్టీ పరిస్థితులు, బలోపేతం, లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌ల నియామకం అంశాలపై చర్చించేందుకు మంగళవారం అన్నాడీఎంకే జిల్లాల కార్యదర్శులు సమావేశమయ్యారు. చెన్నై రాయపేటలోని ఎంజీఆర్ మాలిగైలో పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి నేతృత్వంలో ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పార్టీ జిల్లాల కార్యదర్శులు, మాజీ మంత్రులు ముందుగా అన్నామలైకు వ్యతిరేకంగా సమావేశంలో తమ గళాన్ని వినిపించారు. తమ దయతోనే రెండు దశాబ్దాల అనంతరం రాష్ట్ర అసెంబ్లీలోకి బీజేపీ ప్రతినిధులు అడుగు పెట్టగలిగారన్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఇక వారిని భుజాన మోయాల్సిన అవసరం/లేదని, తెగతెంపులు చేసుకుందామని మెజారిటీ శాతం నేతలు పట్టుబట్టినట్టు తెలిసింది. ఈ సందర్భంగా పళనిస్వామి నేతలను బుజ్జగించే క్రమంలో తీవ్రంగానే స్పందించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. తమ నిరసనను బీజేపీ జాతీయ అధిష్టానం దృష్టికి తీసుకెళ్దామని, రెండు మూడు రోజుల్లో వారి నుంచి వచ్చే స్పందనకు అనుగుణంగా నిర్ణయం తీసుకుందామని బుజ్జగించారు. మాజీ మంత్రి జయకుమార్ కూటమి విషయంగా పునఃపరిశీలన చేద్దామని సూచించడం గమనార్హం. చివరగా అన్నామలైకు వ్యతిరేకంగా నిరసనను తెలియజేద్దామని తీర్మానం చేశారు. దీనిని స్వయంగా మీడియా ముందు పళని స్వామి వివరించడం గమనార్హం.

అన్నామలైకు ఖండన..

తీర్మానంలోని అంశాలను మీడియా ముందు వివరించే క్రమంలో ఆక్రోశంతో పళనివ్యాఖ్యలు చేశారు. జయలలితకు వ్యతిరేకంగా అన్నామలై చేసిన వ్యాఖ్యలపై ఖండన తీర్మానం చేశామని వివరించారు. బీజేపీ జాతీయ నేతలు దివంగత వాజ్ పేయ్, అద్వాని, ప్రధాని నరేంద్ర మోదీ లాంటి వారే కాకుండా, జాతీయ స్థాయి పార్టీలకు చెందిన ముఖ్య నేతలు జయలలితకు మర్యాద, గౌరవం ఇస్తున్నారని గుర్తు చేశారు. అయితే, ఎలాంటి రాజకీయ అనుభవం, అర్హత లేని అన్నామలై జయలలితను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలపై అన్నాడీఎంకేలో కోటిన్నర మంది కార్యకర్తలు మనో వేదనలో ఉన్నారని పేర్కొన్నారు. అన్నామలై తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 20 ఏళ్ల అనంతరం బీజేపీ ప్రతినిధులు అసెంబ్లీలో అడుగు పెట్టడంలో కీలక పాత్ర పోషించిన మిత్ర పక్షం అన్నాడీఎంకేను, అన్నామలై చేస్తున్న వ్యాఖ్యలను ఇక సహించబోమని హెచ్చరించారు. మాజీ మంత్రి, ఎంపీ సీవీ షణ్ముగం స్పందిస్తూ అన్నామలైను వదలి పెట్టబోమన్నారు. మాజీ మంత్రులు ఆర్‌బీ ఉదయకుమార్, ఓఎస్ మణియన్, సెల్లూరు రాజు స్పందిస్తూ అన్నామలైను వదలి పెట్టమన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్సుగా ప్రస్తుతం బీజేపీ మారిందని, అందుకే కర్ణాటకలో ఘోరంగా ఓటమి పాలైందన్నారు. ముందుగా అన్నామలైకు వ్యతిరేకంగా నినదిస్తూ, అన్నాడీఎంకే వర్గాలు పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. మాజీ సీఎం పన్నీరుసెల్వం, మద్దతుదారులు సైతం అన్నామలై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్ కూడా ఖండించారు. బీజేపీ నేతలు కరునాగరాజన్, అమర ప్రసాద్‌రెడ్డి, నారాయణన్ స్పందిస్తూ, అన్నామలైకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడాన్ని మానుకోవాలన్నారు.



పార్టీ కార్యాలయం వద్ద ఉత్కంఠ

నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు.

ఇంటర్వ్యూలోని తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని, తనకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే వర్గాలు తీవ్ర వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్యలు చేశారు. తానేదో పెద్ద వ్యాఖ్యలు చేసినట్టుగా విరుచుకుపడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. కూటమి ధర్మం గురించి తనకు ఎవరూ నేర్పించాల్సిన అవసరం గానీ హితబోధ చేయాల్సిన పని లేదన్న వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

మద్యంలో సైనైడ్

- ఇద్దరు మృతి
- కల్తీ మద్యంగా ప్రచారం
- మైలాడుతురైలో ఉద్రిక్తత



మృతులు (ఫైల్)

సాక్షి, చెన్నై : మద్యం తాగిన ఇద్దరు వ్యక్తులు మైలాడుతురైలో మృతిచెందారు. వీరి తాగిన మద్యంలో సైనైడ్ కలిపి ఉండడంతో అనుమానాలు నెలకొన్నాయి. అయితే, కల్తీ మద్యం అమ్మడమే కాకుండా, సైనైడ్ కలిపినట్టుగా కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని బాధిత కుటుంబాలు మంగళవారం ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. విల్లుపురం, చెంగల్పట్టులో గత నెల కల్తీ సారా తాగి 23 మంది మరణించిన ఘటన గురించి తెలిసిందే. ఆ తర్వాత తూత్తుకుడిలో టాస్మాక్ బార్‌లో మద్యం తాగిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. కల్తీ మద్యం, సారా విక్రయదారుల భరతం పట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో మైలాడుతురైలో టాస్మాక్ మద్యం తాగి ఇద్దరు మరణించడం మందుబాబుల్లో కలకలం రేపింది.

మద్యంతో మృతి..

మైలాడుతురై జిల్లా కుత్తాలం తాలుకా తత్తంకుడి గ్రామానికి చెందిన పళణి గురునాథన్(50) మంగైనల్లూరులో ఇనుము కరిగించే పట్టరైను నడుపుతున్నారు. ఇక్కడ అదే ప్రాంతానికి చెందిన పురాస్వామి(65) పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఈ ఇద్దరు పట్టరైలో మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీనిని గుర్తించిన ఆ పరిసరవాసులు తిరువారూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఇద్దరు మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో కల్తీ మద్యం తాగి ఇద్దరు మరణించినట్టు తేలడంతో బంధువులు, కుటుంబీకులు న్యాయం కోసం మంగళవారం ఉదయం రోడ్డెక్కారు. మృతదేహాలను తీసుకునేందుకు నిరాకరించారు. తిరువారూర్ – తంజావూరు మార్గంలో బైటాయించి ఆందోళనకు దిగారు. అదే సమయంలో వారు తాగిన మద్యంలో సైనైడ్ కలిసి ఉన్నట్టు పరీక్షల్లో తేలింది. అయితే, కల్తీ మద్యాన్ని పక్కదారి పట్టించేందుకు సైనైడ్‌ను పోలీసులు తెరపైకి తెస్తున్నారని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనను కొనసాగిస్తున్నారు.

బీజేపీ ఎమ్మెల్యే ఆఫీసులోకి అగంతకుడు

- బయటకు గెంటేసిన సిబ్బంది
- ఉదయాన్నే అగంతకుడి మరణం
- పోలీసుల విచారణ

సాక్షి, చెన్నై: కోయంబత్తూరు దక్షిణం నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ కార్యాలయంలోకి గుర్తుతెలియని అగంతకుడు చొరబడ్డాడు. అతన్ని అక్కడున్న సిబ్బంది బలవంతంగా బయటకు గెంటేశారు. అయితే, మంగళవారం ఉదయం ఆ అగంతకుడు మృతదేహంగా తేలాడు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. కోయంబత్తూరు, హొసూరు రోడ్డులో బీజేపీ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ కార్యాలయం ఉంది. సోమవారం సాయంత్రం ఆరుగంటల సమయంలో ఆ కార్యాలయంలోకి ఓ అగంతకుడు చొరబడ్డాడు. లోనికి రాగానే గడియ పెట్టే ప్రయత్నంచేశాడు.



వానతీ శ్రీనివాసన్

దీనిని గుర్తించిన అక్కడి సిబ్బంది విజయ్ అతడిని పట్టుకున్నాడు. బలవంతంగా బయటకు తీసుకొచ్చి రోడ్డులో తోసేశాడు. ఈ అగంతకుడి చొరబాటుపై రేస్‌కోర్సు పోలీసులకు విజయ్ ఫిర్యాదు చేశాడు. ఈ పరిస్థితులలో మంగళవారం ఉదయం అదే అగంతకుడు మృతదేహంగా తేలాడు. అన్నాసాలై సిగ్నల్ వద్ద అతడి మృతదేహం బయట పడింది. గుర్తుతెలియని వాహనం ఏదేని ఢీకొట్టి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఇదే వ్యక్తి వానతీ శ్రీనివాసన్ కార్యాలయంలోకి చొరబడిన దృష్ట్యా విచారణను వేగవంతం చేశారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ మీడియాతో మాట్లాడుతూ, ఆ వ్యక్తి ఎవరో పోలీసులు తేల్చాల్సి ఉందన్నారు. తన కార్యాలయంలోకి ఎందుకు చొరబడ్డాడో పోలీసులే తేల్చాలన్నారు. అతడు పూర్తిగా మత్తులో ఉన్నట్టు తన సిబ్బంది పేర్కొన్నారని, పోలీసులకు తాము అప్పుడే ఫిర్యాదు కూడా చేశామన్నారు. ఈ అగంతకుడి వివరాలు తెలియక పోలీసులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి. అతడి మృతదేహంపై ఉన్న ఆనవాళ్ల ఆధారంగా వివరాలను సేకరిస్తున్నారు.

సమాచార కమిషనర్‌గా షకీల్ అక్తర్

- మరో నలుగురు కమిషనర్లు
- ఉత్తర్వుల జారీ

సాక్షి, చెన్నై: రాష్ట్ర సమాచార కమిషనర్‌గా మాజీ ఐపీఎస్ అధికారి షకీల్ అక్తర్‌ను ప్రభుత్వం నియమించింది. మరో నలుగురు కమిషనర్లను కూడా నియమించారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర సమాచార కమిషనర్ రాజగోపాల్ పదవీకాలం కొన్ని నెలల క్రితం ముగిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ పదవీ ఖాళీగా ఉంటోంది. ఈ పదవికి కమిషనర్ ఎంపిక నిమిత్తం గత 17న సీఎం స్టాలిన్ నేతృత్వంలోని మంత్రులు, అధికారుల కమిటీ సమావేశమయ్యారు. సమావేశంలో చర్చించిన అంశాల మేరకు పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. ఇందులో షకీల్ అక్తర్‌ను ఆ పదవికి ఎంపిక చేసినట్టు సమాచారం. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను మంగళవారం ప్రభుత్వం జారీ చేసింది. సమాచార కమిషనర్‌గా షకీల్ అక్తర్, కమిషనర్లుగా మాజీ ఏడీజీపీ తామరై కన్ను, న్యాయవాది ప్రియాకుమార్, ఐసీఎల్ఎస్ మాజీ అధికారి తిరుమలై ముత్తు, డాక్టర్ సెల్వరాజ్‌లను నియమించారు. బిహార్‌కు చెందిన షకీల్ అక్తర్ 1989 తమిళనాడు ఐపీఎస్ బ్యాచ్ అధికారిగా రాష్ట్రంలో అడుగుపెట్టారు. తొలుత ధర్మపురి ఏఎస్పీగా పనిచేశారు. డీఎంకే అధికారంలో ఉన్న సమయాల్లో ఆయనకు కీలక పదవులు దక్కాయి. చెన్నై కమిషనర్‌గా కూడా పనిచేశారు. గత ఏడాది నవంబర్‌లో ఆయన సీబీసీఐడీ డీజీపీగా పదవీ విరమణ పొందారు. ఈ పదవిలో షకీల్ అక్తర్‌తో పాటు మిగిలిన వారు మూడేళ్లు కొనసాగుతారు.



రూ.125 కోట్లతో సేవల విస్తరణ

సాక్షి, చెన్నై: వాహన నిర్వహణ ఒప్పందం, ఇన్‌వాయిస్, ఇంధన ఫైనాన్సింగ్ సహా వివిధ సౌకర్యాలకు రూ.125 కోట్లను కేటాయించి తమ సేవలను విస్తరిస్తున్నామని సీజే డార్క్స్ లాజిస్టిక్స్ ఎండీ క్రిషన్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. ఇందులో భాగంగా టాటా మోటార్స్ ఫైనాన్స్, సీజే డార్క్ లాజిస్టిక్ లిమిటెడ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలు మంగళవారం స్థానికంగా జరిగాయి. ఈ వివరాలను క్రిషన్‌కుమార్ అగర్వాల్ పేర్కొంటూ, టాటా మోటార్స్ సహకారంతో బలోపేతానికి అవసరమైన వనరులను సిద్ధం చేశామన్నారు. ఈ భాగస్వామ్యం ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడానికి, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు దోహదకరంగా ఉంటాయన్నారు. టాటా మోటార్స్ ఫైనాన్స్ ఎండీ సామ్రాట్ గుప్తా పాల్గొన్నారు.

అడవుల్లో గస్తీ కోసం వాహనాలు



వాహనాలకు జెండా ఊపుతున్న సీఎం స్టాలిన్

- జెండా ఊపిన సీఎం స్టాలిన్
- అటవీ శాఖ సిబ్బందికి అప్పగింత

సాక్షి, చెన్నై : అడవుల్లో వన్యప్రాణులను సంరక్షించడం, పర్యవేక్షణ, వేటగాళ్లు, అజ్ఞాత వ్యక్తులను పట్టుకునేందుకు వీలుగా అటవీ శాఖ సిబ్బందికి గస్తీ వాహనాలను కొనుగోలు చేశారు. వీటిని సీఎం స్టాలిన్ మంగళవారం జెండా ఊపి అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు.

ఇందులో అటవీశాఖ ఫీల్డ్ వర్కర్ల వినియోగానికి రూ.2.42 కోట్లతో 200 ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలు, రూ.4.63 కోట్లతో 50 బొలెరో జీపులు, రూ.5.25 కోట్లతో 35 రెస్క్యూ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాల్లో అన్ని రకాల పరికరాలను పొందుపరిచారు. అలాగే, జపాన్ ఇంటర్నేషనల్ కో- ఆపరేషన్ ఏజెన్సీతో కలిసి తమిళనాడు ప్రభుత్వం వాతావరణ మార్పులపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టనుంది. ఇందుకోసం రూ.920.52 కోట్లు కేటాయించారు. తమిళనాడు జీవవైవిధ్య పరిరక్షణ- హరితహారం కార్యక్రమాలు విస్తృతం కానున్నాయి. కార్యక్రమంలో అటవీశాఖమంత్రి మదివేందన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరైఅన్బు పాల్గొన్నారు. అనంతరం హోసూరు పారిశ్రామిక వాడలో రూ.187 కోట్లతో ఏర్పాటు చేయనున్న టీటీఆర్ఓ ప్లాంట్ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే, పర్యావరణం, వాతావరణ మార్పులకు సంబంధించి చెన్నై క్లైమెట్ యాక్షన్ ప్లాన్ మ్యాన్యువల్‌ను ఈసందర్భంగా సీఎం స్టాలిన్ విడుదల చేశారు. అనంతరం కేంద్రానికి సీఎం స్టాలిన్ లేఖ రాశారు. వైద్య కోర్సుల కౌన్సెలింగ్ జాతీయ స్థాయిలో కేంద్రం తన గుప్పెట్లోకి తెచ్చుకునే ప్రయత్నాలను ఇందులో ప్రస్తావించారు. ఈ ప్రయత్నాన్ని వీడాలని జాతీయ వైద్య అర్హత పరీక్షను రద్దు చేయాలని సీఎం కోరారు.

నిన్న ఐటీ.. నేడు ఈడీ

- టార్గెట్ మంత్రి సెంథిల్ బాలాజీ
- విస్తృతంగా సోదాలు
- వివాదంగా సచివాలయంలో సోదాలు
- దొడ్డిదారిన దాడి చేస్తున్నారని సీఎం విమర్శ

సాక్షి, చెన్నై : రాష్ట్ర ఎక్సైజ్, విద్యుత్‌శాఖా మంత్రి సెంథిల్ బాలాజీని టార్గెట్ చేసి గత నెల ఐటీ సోదాలు హోరెత్తాయి. మంగళవారం ఏకంగా ఈడీ రంగంలోకి దిగింది. మంత్రి సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోకన్‌తో పాటు సన్నిహితుల నివాసాలు, కార్యాలయాల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. అయితే, సచివాలయంలో ఎలాంటి అనుమతి లేకుండా మంత్రి చాంబర్‌లోకి ఈడీ ప్రవేశించి తనిఖీలలో నిమగ్నం కావడం వివాదానికి దారి తీసింది. తాను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేక...దొడ్డి దారిన వచ్చి మరీ దాడిచేస్తున్నారని సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఈరోడ్‌లో నిఘా నీడలో ఈడీ సోదాలు

మంత్రి సెంథిల్ బాలాజీని టార్గెట్‌చేస్తూ, ఆయన సోదరుడు, మిత్రులు, సన్నిహితులు, ఎక్సైజ్, విద్యుత్ శాఖల కాంట్రాక్టర్లపై గత నెల ఐటీ అధికారులు గురి పెట్టిన విషయం తెలిసిందే. చెన్నై, కోయంబత్తూరు,కరూర్, ఈరోడ్‌లలోని 40 చోట్ల నాలుగైదు రోజులుగా సోదాలు జరిగాయి. ఈ సోదాల సమయంలో డీఎంకే వర్గాలు, సెంథిల్ బాలాజీ మద్దతుదారులు తిరగబడడంతో ఐటీ అధికారులు బెంబేలెత్తిపోయారు. అయితే, అన్ని చోట్ల సోదాలు జరిగినా, మంత్రి నివాసాన్ని మాత్రం ఐటీ వర్గాలు వదలిపెట్టాయి. ఈసోదాలు ముగిసిన పది రోజుల తర్వాత మంగళవారం సెంథిల్‌బాలాజీని ఈడీ అధికారులు టార్గెట్ చేశారు.

మంత్రి నివాసంలోనూ..

చెన్నైలోని మంత్రి ప్రభుత్వ క్వార్టర్స్, అభిరామపురం రాజాఅన్నామలైపురంలోని నివాసాలలో ఉదయాన్నే మూడు బృందాలుగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఈడీ వర్గాలు కేంద్ర బలగాల భద్రతతో అడుగు పెట్టారు. సీఆర్‌పీఎఫ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు(ఆర్‌పీఎఫ్) అంటూ ఆయుధాల భద్రత నడుమ సోదాలకు వెళ్లారు. ఈడీ అధికారులు తన ఇంట్లోకి సోదాలకు వచ్చిన సమాచారంతో వాకింగ్‌ను మధ్యలో ఆపేసి మంత్రి ఇంటికి వెళ్లారు. వెళ్తూ..వెళ్తూ సోదాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని మీడియాకు చెప్పి మరీ వెళ్లారు. కరూర్‌లోని మంత్రి సోదరుడు అశోకన్, సన్నిహితుల నివాసాలు, కోయంబత్తూరులోని సన్నిహితులు, ఈరోడ్‌లోని టాస్మాక్ కాంట్రాక్టర్ సచ్చిదానందం నివాసాలలో సోదాలు జరుగుతున్నాయి. పదిహేను చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. వాకింగ్‌ను సగంలో ముగించుకుని ఇంట్లోకి వెళ్లినానంతరం మంత్రి సెంథిల్ బాలాజీకి సంబంధించిన సమాచారం బయటకు రాలేదు. దీంతో డీఎంకేకు చెందిన సీనియర్ న్యాయవాదులు ఆర్ఎస్ భారతి మంత్రి నివాసానికి వెళ్లారు. తాము మంత్రి పరిస్థితిని చూసి వెళ్లిపోతామని ఈడీ అధికారులకు సూచించినా, వారు ఖాతరు చేయలేదు. ఈవిషయంగా ఆర్ఎస్ భారతి మీడియాతో మాట్లాడుతూ పది నిమిషాలలో మంత్రి సమాచారం తెలియజేస్తామని చెప్పి అరగంటైనా పట్టించుకోలేదని మండిపడ్డారు. సేలం వేదికగా సీఎం స్టాలిన్ కేంద్రమంత్రి అమిత్‌షా ముందు అనేక ప్రశ్నలు ఉంచారని, వాటన్నింటికి సమాధానాలు ఇవ్వలేక ఈడీని ఉసిగొల్పినట్టుందని ధ్వజమెత్తారు. సెంథిల్ బాలాజీకి సంబంధించిన ఈ కేసు గత అన్నాడీఎంకే హయంలో ఆయన మంత్రిగా ఉన్నప్పటిదని, అయితే, ఇప్పుడు ఆ కేసులో అధికారులు ఉత్సాహం చూపించడం గమనించదగ్గ విషయంగా పేర్కొన్నారు.

సచివాలయంలోనూ..

సీఎం స్టాలిన్ సచివాలయం నుంచి మధ్యాహ్నం 12.30గంటల సమయంలో ఇంటికి బయలు దేరి వెళ్లారు. ఆయన కాన్వాయ్ అటు వెళ్లగానే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. నేరుగా సెంథిల్‌బాలాజీ చాంబర్‌లోకి ప్రవేశించి సోదాలలలో నిమగ్నమయ్యారు. ఈ అధికారులతో పాటుగా ఓ బ్యాంక్‌కు చెందిన మరో ఇద్దరు అధికారులు ఈ సోదాలలో ఉండడం గమనార్హం. సచివాలయంలోని ఈ చాంబర్‌కు సమీపంలోని సమావేశ మందిరంలో మంత్రులు, సీఎస్, డీజీపీ అధికారులతో పోక్సో కేసులకు సంబంధించిన సమీక్ష జరుగుతున్నా, వాటితో సంబంధంలేకుండా సోదాల్లో నిమగ్నయ్యారు. అదే సమయంలో సచివాలయంలోకి వచ్చి కనీసం సీఎస్ అనుమతి కూడా పొందకుండా కేంద్ర సంస్థ సోదాల్లో నిమగ్నంకావడం వివాదానికి దారి తీసింది. ఈ వ్యవహారాన్ని సీఎం స్టాలిన్ తీవ్రంగా పరిగణించారు. బుధవారం మంత్రి వర్గసమావేశానికి పిలుపు నిచ్చారు. ఈ వ్యవహారంపై చర్చించి కీలక నిర్ణయం తీసుకోబోతున్నారు. అదేసమయంలో సచివాలయంలో సోదాలపై సీఎం స్టాలిన్ స్పందిస్తూ, తమను రాజకీయంగా ఎదురెదురుగా నిలబడి ఢీకొట్ట లేక, దొడ్డి దారిన ప్రవేశించి దాడులు చేయడం హేయమైన చర్యగా కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



సెంథిల్ బాలాజీ

క్లుప్తంగా

జమాబందీలో 13 మందికి న్యాయం



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మధుసూదన్

పళ్లిపట్టు: ఆర్కేపేట తాలూకా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జమాబందీ ముగింపు కార్యక్రమంలో 13 మందికి సత్వర న్యాయం చేశారు. తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట తహసీల్దార్ కార్యాలయంలో జూన్ 6న రెవెన్యూ సమస్యల పరిష్కారం (జమాబందీ) కార్యక్రమం ప్రారంభమైంది. జమాబందీ అధికారి జిల్లా సహాయ కలెక్టర్ మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన శిబిరంలో ఐదవ రోజు మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వినతిపత్రాలపై తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించి అర్హులైన 13 మంది అర్హులకు సర్టిఫికెట్లు అందజేశారు. జమాబందీ మేనేజర్ శివకుమార్, డీఆర్ఎస్ తహసీల్దార్ రాజేశ్వరి పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ కోతలొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరువళ్లూరు: గ్రామాల్లో అర్ధరాత్రి అప్రకటిత కోతలు విధిస్తున్న నేపథ్యంలో ఫిర్యాదులు వస్తుండడంతో సమస్యను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ అధికారులను ఆదేశించారు. తిరువళ్లూరు జిల్లాలోని గ్రామాల్లో అర్ధరాత్రి అప్రకటిత కోతలు ఎక్కువగా వుండడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. దీంతో పాటు ప్రజలు సమస్యను పరిష్కరించాలని రాస్తారోకో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ సమస్య కారణంగా గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉండడంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్

- ప్రారంభించిన మంత్రి ఉదయనిధి



కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

కొరుక్కుపేట: చెన్నై కొట్టూరుపురంలోని రిజ్జార్ అన్నా సెంటినరీ లైబ్రరీలో నాన్ ముదలవన్ పథకం కింద రైల్వే, బ్యాంక్ పరీక్షల కోసం ఉచిత ఇంటిగ్రేటెడ్ కోచింగ్ తరగతులను రాష్ట్ర క్రీడలు, యువజన సంక్షేమ మంత్రి ఉదయనిధి స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషల్ ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ విభాగం సెక్రటరీ సుగందీప్‌సింగ్, తమిళనాడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇన్నోసెంట్ దివ్య, ఉపాధి, శిక్షణ కమిషనర్ వీరరాఘవరావు ఉన్నారు. నాన్ ముదలవన్ పథకం కింద పోటీ పరీక్షల విభాగాన్ని మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఈ ఏడాది మార్చి 7న ప్రారంభించారు. దీనికి కొనసాగింపుగా రైల్వే, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్ పరీక్షలకు సంబంధించిన ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఆన్‌లైన్‌లో తరగతులకు 26వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. మే 29న శిక్షణ తరగతులు జిల్లాల్లో ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో చెన్నైలోని కొట్టూరుపురంలోని అన్నాలైబ్రరీలో శిక్షణ కేంద్రాన్ని ఉదయనిధి స్టాలిన్ మంగళవారం ఉచిత శిక్షణ ప్రారంభించారు. మంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు పెరిగే వాతావరణం ఉంది. ఒకప్పుడు యూపీఎస్సీ పోటీ పరీక్షల ద్వారా 25–30 శాతం మంది కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందేవారు. ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో తమిళనాడుకు చెందిన వారి సంఖ్య తగ్గిపోవడంతో ఉత్తరాదికి చెందిన ఆయా ప్రాంతాల్లో, గ్రామాల్లోని బ్యాంకుల్లో ఉద్యోగాల్లో చేరుతున్నారు. కేంద్రప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో తమిళనాడుకు చెందిన యువత పాల్గొని విజయం సాధించాలన్న సంకల్పంతో తాను తొలి ప్రాజెక్టుగా ఈ శిక్షణ తరగతులను ప్రారంభించానని తెలిపారు. ఈ కేంద్రాన్ని యువత సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

భాగస్వామ్య ఒప్పందాలపై ఐఎంజీసీ దృష్టి

సాక్షి, చెన్నై: సొంతింటి కలను సులభతరం చేయడం, భాగస్వామ్యాల బలోపేతం దిశగా విస్తరణ కార్యక్రమాలపై దృష్టి పెట్టామని ఇండియా మార్ట్‌గేజ్ గ్యారెంటీ కార్పొరేషన్(ఐఎంజీసీ) సీఈఓ మహేశ్ మిశ్రా తెలిపారు. ఎఫ్‌వై 24లో ఐఎంజీసీ పోర్ట్‌పోలియోను రూ.30వేల కోట్లకు తీసుకెళ్లేందుకు చేపట్టనున్న కొత్త ప్రణాళికను స్థానికంగా మంగళవారం ఆయన వివరించారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలతో మొదలైన తమ సేవలు 400 కన్నా ఎక్కువ ప్రదేశాలలో కొనసాగుతున్నట్టు తెలిపారు. ఎఫ్‌వై 22–23లో 18 వేల కుటుంబాలకు రుణ సహకారంతో గృహ నిర్మాణాల కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులలో చురుగ్గా దూసుకెళ్తున్నామని, అలాగే, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) వంటి పథకాల కింద అర్హత సాధించి నిబద్ధతతో ముందుకెళ్తున్నామన్నారు.

తిరుత్తణిలో అన్నాడీఎంకే శ్రేణుల ధర్నా



ధర్నా చేస్తున్న అన్నాడీఎంకే శ్రేణులు

తిరుత్తణి: జయలలిత పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై తీరుకు నిరసనగా తిరుత్తణిలో అన్నాడీఎంకే శ్రేణులు ధర్నా చేశారు. స్థానిక చిత్తూరు రోడ్డు జంక్షన్‌లో తిరువళ్లూరు జిల్లా యువజన విభాగ ఉప కార్యదర్శి జయశేఖర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆ పార్టీ మాజీ నియోజకవర్గ కార్యదర్శి కవిచంద్రన్ పాల్గొని ధర్నాలో ప్రసంగించారు. అమ్మ జయలలితపై అనుచిత వ్యాఖ్యలు అన్నామలై రాష్ట్రంలో తిరగనివ్వమని హెచ్చరించారు. నేతలు వేలంజేరి పళని, కేబుల్ సురేష్, కన్నయ్య, కేజీ.కండ్రిగ తంగవేలు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తున్నారని వ్యక్తి హల్‌చల్



నిరసన వ్యక్తం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరువళ్లూరు: పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని కలెక్టరేట్ వద్ద నగ్నంగా హల్‌చల్ చేసిన వ్యక్తిని సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. తిరువళ్లూరు జిల్లా పుట్లూరు గ్రామానికి చెందిన కార్తీక్ అలియాస్ నీలగండన్(33). ఇతను తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఇతను గతంలో విల్లివాక్కంలో వున్న సమయంలో ఇతడి స్నేహితులు ఓ యువకుడిని హత్య చేసి పరారైయ్యారు. పరారీలో వున్న నిందితుల ఆచూకీ తెలపాలని కోరుతూ తరచూ కార్తీక్‌ను విల్లివాక్కం పోలీసులు వేధిస్తున్నట్టు పలుమార్లు అధికారులకు వినతి పత్రం అందజేశాడు. అయితే ఇంతవరకు న్యాయం జరగకపోగా వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన కార్తీక్ అలియాస్ నీలకంఠన్, భార్యతో కలిసి సోమవారం రాత్రి 10 గంటలకు కలెక్టరేట్ వద్ద నగ్నంగా నిరసనకు దిగారు. స్థానికులు టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి నగ్నంగా ఉన్న నీలకంఠన్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రైల్వే బ్రిడ్జి కోసం స్థలం



స్థలాన్ని రిజిస్టర్ చేసి ఇస్తున్న రాజేందర్

- స్థలాన్ని రిజిస్టర్ చేసిన నటుడు రాజేందర్

వేలూరు: వేలూరు నుంచి బెంగళూరు రోడ్డుకు అడ్డంగా వేలూరు టౌన్ రైల్వేస్టేషన్ ఉంది. ఈ రైల్వేమార్గంలో గేట్లు మూసి వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రయత్నాలు చేశారు. వేలూరు కోట నుంచి 300 మీటర్ల దూరం బ్రిడ్జి నిర్మించాల్సి ఉండగా ఇందుకు ఆర్కలాజికల్ అధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో రైల్వేవేరే ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణ పనులను చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో వేలూరు మామిడి కాయల మండీ నుంచి పశు సంవర్ధక శాఖ కార్యాలయం వరకు రైల్వే బ్రిడ్జి నిర్మించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే బ్రిడ్జి నిర్మాణ పనులకు అడ్డుగా ఉన్న స్థల యజమానులకు నోటీసులు అందజేశారు. ఈ మధ్యలో బ్రిడ్జి నిర్మించే స్థలంలో నటుడు టి. రాజేందర్‌కు చెందిన సినిమా థియేటర్ ఉంది. రాజేందర్‌కు సొంతమైన 527 చదరపు మీటర్ల స్థలం కోసం నోటీసులు ఇవ్వడంతో రాజేందర్ మంగళవారం ఉదయం వేలూరు రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని 527 చదరపు అడుగుల స్థలాన్ని బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం ఇచ్చాడు. ఇందుకు ప్రభుత్వం రాజేందర్‌కు రూ.8.15 కోట్లు నగదును నష్టపరిహారంగా చెల్లించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

తిరువళ్లూరు: కంపెనీ నుంచి తొలగించిన ఒప్పంద కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నేమం వద్ద ఉన్న చాక్లెట్ కంపెనీకి చెందిన కార్మికులు మంగళవారం ఉదయం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా నేమం వద్ద చాక్లెట్ల తయారీ కంపెనీ వుంది. కంపెనీలో 60 మంది శాశ్వత ఉద్యోగులు, మరో 20 మంది ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ఉద్యోగులకు, కాంట్రాక్టర్ కార్మికులకు మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణతో ఐదుగురు ఒప్పంద కార్మికులను రెండు నెలల క్రితం కంపెనీ నుంచి తొలగించారు.

తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మికులు పలుమార్లు ఆందోళన చేశారు. అయితే ఇంతవరకు న్యాయం జరగకపోవడంతో మంగళవారం ఉదయం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలిసి పోలీసులు కార్మికులతో చర్చలు జరిపి ఆందోళనను విరమింపజేశారు.

నచ్చిన నిర్మాత ఎవరని అడగండి!



చార్లెస్ ఎంటర్‌ప్రైజెస్ చిత్ర యూనిట్

తమిళసినిమా: సీనియర్ నటి ఊర్వశి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం చార్లెస్ ఎంటర్‌ప్రైజెస్ నటుడు బాలు వర్గీస్, కలైయరసన్, గురుసోమసుందరం, సుజిత్ శంకర్, అభిజ శివకళ, మణికంఠన్, ఆచారిను, మృదుల మాధవ్, సుధీర్ పరవూర్ ముఖ్యపాత్రలు పోషించారు. సుభాష్ లలిత సుబ్రమణ్యంను దర్శకుడుగా పరిచయం చేస్తూ జాయ్ మూవీ ప్రొడక్షన్స్ పతాకంపై డాక్టర్ అజిత్ జాయ్ తమిళం, మలయాళం భాషల్లో నిర్మించిన చిత్రం ఇది. కె.వి.సుబ్రమణ్యం అశోక్ పొన్నప్పన్ కలిసి సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి స్వరూప్ పిలిప్ ఛాయాగ్రహణం అందించారు. మలయాళంలో ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న ఈ చిత్రాన్ని తమిళంలో ఈనెల 23న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఊర్వశి మాట్లాడుతూ సాధారణంగా తమలాంటి నటీనటులను పత్రికల వాళ్లు నీకు ఇష్టమైన నటీనటులు ఎవరు, నచ్చిన పాత్ర ఏమిటి, దర్శకుడు ఎవరు? లాంటి ప్రశ్నలు వేస్తుంటారన్నారు. అయితే చిత్రానికి బలం నిర్మాతేనన్నారు. ఇకపై నీకు నచ్చిన నిర్మాత ఎవరు అని అడగండి అన్నారు. అలా ఈ చిత్రం నిర్మాత తనకు చాలా ఇష్టమని చెప్పారు. కొందరు నిర్మాతలపై ఫిర్యాదు కూడా చేసే అవకాశం ఉందని అన్నారు. చిత్ర కథ బాగుందా? అన్ని వర్గాల వారిని అలరించే విధంగా ఉందా? వ్యాపారపరంగానూ లాభసాటిగా ఉందా అంటూ ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి నిర్మాత అజిత్ జాయ్ ఈ చిత్రాన్ని నిర్మించారని చెప్పారు. ఇకపోతే చిన్న చిత్రమైనా పెద్ద చిత్రమైనా శ్రమ ఒకటేనని, అయితే తన చిత్రాలకు తగిన ప్రచారం లభించడం లేదని అన్నారు. ఈ చిత్రానికి మీడియా సహకారం అవసరం అని ఊర్వశి పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్

తాన్యా హీరోయిన్‌గా బీపీ180

బీపీ 180 చిత్ర ప్రారంభోత్సవం



తమిళసినిమా: తాత రవిచంద్రన్ వారసురాలిగా సినీ రంగప్రవేశం చేసిన నటి తాన్యా రవిచంద్రన్. ఇప్పటికే కొన్ని చిత్రాలలో కథానాయకిగా నటించి గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ తాజాగా బీపీ 180 పేరుతో రూపొందుతున్న హీరోయిన్ ఓరియెంటెడ్ కథా చిత్రంలో నటిస్తున్నారు. దర్శకుడు మిష్కిన్ శిష్యుడు జేపీ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని అతుల్ ఇండియా మూవీస్ పతాకంపై అతుల్ ఎం.బోస్మియా నిర్మిస్తున్నారు. దర్శకుడు కె.భాగ్యరాజ్ కీలక పాత్రను పోషిస్తున్న ఇందులో డేనియల్ బాలాజి అరుల్‌దాస్, నటి నైనీసావి ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఉదయం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో పూజాకార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇందులో పాల్గొన్న దర్శకుడు, నటుడు కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ గుజరాత్‌కు చెందిన నిర్మాత తొలిసారిగా తమిళంలో చిత్రాన్ని నిర్మించడానికి వచ్చారని, ఈ చిత్రం ద్వారా జేపీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారని ఈ చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు ఆయన పేర్కొన్నారు. ఈ చిత్ర నిర్మాత పలుమార్లు చెన్నైకు వచ్చి 40కి పైగా కథలను చివరికి జేపీ చెప్పిన కథ నచ్చడంతో బీపీ 180 చిత్ర కథను నిర్మించ తలపెట్టినట్లు తెలిసిందన్నారు. ఈ చిత్రంలో తాన్యా రవిచంద్రన్, డేనియల్ బాలాజి, సంగీత దర్శకుడు జిబ్రాన్‌లకే ఎక్కువ పని అని అన్నారు.

దర్శకుడు కథ చెప్పినప్పుడే చాలా థ్రిల్లింగ్‌గా ఉందనిపించిందన్నారు. దీనికి ముందుగా వేరే పేరును అనుకున్నారని, అయితే ఇప్పుడు నిర్ణయించిన పేరే కరెక్ట్‌గా ఉందని చెప్పారు. దర్శకుడు జేపీ మాట్లాడుతూ తాను గురువు మిష్కిన్ పేరును కాపాడేలా ఈ చిత్రానికి బాధ్యతగా పని చేస్తానని చెప్పారు.

ధనుష్ చిత్రంలో అపర్ణా బాలమురళి



తమిళసినిమా: ధనుష్ ప్రస్తుతం కెప్టెన్ మిల్లర్ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్ర షూటింగ్ చివరి దశకు చేరుకుంది. దీంతో ధనుష్ తర్వాత చిత్రానికి సిద్ధమవుతున్నారు. ఇది ఆయన 50వ చిత్రం కావడం గమనార్హం. ఈ చిత్రానికి ఆయనే దర్శకత్వం నిర్వహించనుండడం విశేషం. ధనుష్ చాలా కాలం క్రితం పా.పాండి అనే చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన విషయం తెలిసిందే. ఆ చిత్రం మంచి విజయం సాధించింది. దీంతో ఆయన ద్వితీయ ప్రయత్నానికి సిద్ధమయ్యారు. ఇది కమర్షియల్ అంశాలతో కూడిన కుటుంబ కథా చిత్రంగా ఉంటుందని సమాచారం. అన్నదమ్ముల అనుబంధాలను ఆవిష్కరించే ఈ చిత్రంలో భారీ తారాగణం నటించనున్నారు. ఇప్పటికే త్రిష కథానాయకిగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా దుషారా విజయన్, సుధీప్ కిషన్, విష్ణువిశాల్, కాళిదాస్ జయరాం కీలకపాత్రలకు ఎంపికైనట్లు తెలుస్తోంది. తాజాగా సూరరై పోట్రు చిత్రం ఫేమ్ అపర్ణా బాలమురళి నటించబోతున్నట్లు సమాచారం. ఈమె చిత్రంలో సుదీప్ కిషన్‌కు జంటగా నటించనున్నట్లు తెలిసింది. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహ్మాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. జులై 1న ఈ చిత్ర షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తాజా సమాచారం. మరో విషయం ఏమిటంటే ఈ చిత్రం కోసం చెన్నై, వీసీఆర్ రోడ్డులో 500 ఇళ్లతో కూడిన భారీ సెట్ రెడీ అవుతున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందన్నది గమనార్హం

అపర్ణా బాలమురళి

మళ్లీ ప్రియాభవాని శంకర్‌తోనే..

తమిళసినిమా: నటుడు, దర్శకుడు ఎస్‌జే సూర్య హీరోగా నటించి, నిర్మించిన చిత్రం బొమ్మై. నటి ప్రియా భవానిశంకర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి రాధామోహన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. యువన్ శంకర్‌రాజా సంగీతాన్ని అందించిన ఈ చిత్ర నిర్మాణ కార్యక్రమాలను పూర్తిచేసుకుని ఈనెల 16న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సోమవారం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్‌జే సూర్య మాట్లాడుతూ దర్శకుడు రాధామోహన్ చెప్పిన కథ నచ్చడంతో తాను చిత్రాన్ని నిర్మిస్తానని చెప్పానన్నారు. అలా మొదలైన ఈ చిత్రం చాలా సంతృప్తిగా వచ్చిందన్నారు. మాన్‌స్టర్ చిత్రంలో తనకు జంటగా నటించిన ప్రియాభవానిశంకర్‌నే ఈ చిత్రంలోనూ నాయకిగా ఎంచుకోవడానికి కారణం ఏమిటని అడుగుతున్నారని, తన అక్క కూతురికి ఇంచుమించు ప్రియాభవాని శంకర్ ఛాయాలు ఉంటాయన్నారు. నటి సిమ్రాన్‌కు, త్రిషకు అలాంటి ఫేస్ కట్ ఉంటుందన్నారు. అలా ముఖంలో ఓకే కట్ ఉన్న ఒకరికి, మరొకరికి మధ్య సారుప్యత ఉంటుందన్నారు. నటుడు షారూక్‌ఖాన్‌కు, నటి కాజోల్ అలాంటిదే ఉందన్నారు. కారణం ఏమిటన్నది చెప్పలేమన్నారు. అలా తనకు, ప్రియాభవాని శంకర్‌కు ఒక మ్యాథమేటిక్స్ ఫ్యూచర్స్ సెట్ అవుతుందన్నారు. ఇది ఒక కారణం కావచ్చునన్నారు. చాప్టర్‌ను మలరుమ్ పాటలో తాను, సిమ్రాన్ మాదిరిగానే ప్రియాభవాని శంకర్ ఉన్నారని చెప్పారు. ఇకపోతే ప్రియాభవాని శంకర్, తాను మాన్‌స్టర్ చిత్రంలో నటించారని అది మంచి హిట్ కావడం కూడా ఈ చిత్రంలో తాము మళ్లీ కలిసి నటించడానికి కారణం కావచ్చునని ఎస్.జె.సూర్య పేర్కొన్నారు.



బొమ్మై చిత్రంలో ఓ సన్నివేశం

సంగీత దర్శకురాలిగా రెహ్మాన్ వారసురాలు

తమిళసినిమా: సంగీతాన్ని శ్వాసించేది ఏఆర్ రెహ్మాన్ కుటుంబం. రెహ్మాన్ తండ్రి నుంచి సోదరి, కుమారుడు ఈ రంగంలోనే కొనసాగుతున్నారు. తాజాగా ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ కూతురు ఖతిజా రెహ్మాన్ అదే బాటలో పయనిస్తున్నారు. ఈమె ఇప్పటికే సినీ గాయకురాలిగా మంచి పేరు తెచ్చుకున్నారు. తాజాగా సంగీత దర్శకురాలిగా అవతారమెత్తారు. మిన్ మిని అనే చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇంతకుముందు పూవాసల్ పీపీ, సిల్లు కరుపట్టి, ఏలే వంటి వైవిధ్య భరిత కథా చిత్రాలను తెరకెక్కించిన హలితా షమీమ్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ఇది. మనోజ్ పరమహంస ఛాయాగ్రహణం అందిస్తూ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఎస్తేర్ అనిల్ ప్రవీణ్ కిశోర్, గౌరవ్ కాళై, ప్రవీణ్, గౌరవ్ ప్రధాన పాత్రలు పోషించారు. స్నేహం ఇతివృత్తంతో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుందని యూనిట్ వర్గాలు తెలిపాయి. నటీనటులు యదార్థ వయసును, నడవడికను, తెరపై ఆవిష్కరించాలని భావించిన దర్శకురాలు ఈ చిత్రం ద్వారా నెరవేరిందనే సంతోషాన్ని వ్యక్తం చేశారు. చిత్రాన్ని త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.



హలితా షమీమ్‌తో సంగీత దర్శకురాలు ఖతిజా రెహ్మాన్

క్లుప్తంగా

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్


అరెస్టయిన తిరుమలై

తిరువళ్లూరు: శ్మశానంలో ఇసుక దోపిడీపై అధికారులకు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై ఇనుపరాడ్‌తో దాడి చేసిన వ్యవహారంలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువళ్లూరు జిల్లా తన్నీర్‌కుళం అంబేడ్కర్ వీధికి చెందిన రంజిత్‌కుమార్(28). ఇతను సమీపంలోని ప్రభుత్వ హాస్టల్‌లో వార్డెన్‌గా పని చేస్తున్నాడు. ఇతడి ఇంటికి సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో కొందరు ట్రాక్టర్ ద్వారా ఇసుక రవాణా చేస్తున్నట్టు రంజిత్‌కుమార్ సెవ్వాపేట పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహించిన ఇసుక మాఫియాకు చెందిన కొందరు అడ్డగించి రంజిత్ కుమార్‌పై దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారణ చేపట్టారు. విచారణలో ఇసుక మాఫియాకు మద్దతుగా ఫిర్యాదు దారుడిపై ఇనుపరాడ్‌తో దాడి చేసిన వ్యక్తి ఐసీఎఫ్ ఉద్యోగి తిరుమలై(27), వెంకటేష్(21)గా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళ కడుపులో 36 కిలోల కణితి

• శస్త్ర చికిత్సతో తొలగించిన కోవై వైద్యులు

సేలం: కోవై ప్రైవేటు ఆస్పత్రిలో 4.30 గంటల సమయం శస్త్ర చికిత్స నిర్వహించి మహిళ కడుపు నుంచి 36 కిలోల కణితిని వైద్యులు తొలగించారు. నీలగిరి జిల్లాకు చెందిన తమిళ్ సెల్వి (45). ఈమె గత ఐదేళ్లుగా కడుపు వాపు, నొప్పితో బాధపడుతూ వచ్చింది. తమిళ్ సెల్వి పొత్తి కడుపులో చిన్నదిగా ఉన్న కణితి పెరుగుతూ వచ్చింది. ఒక సందర్భంలో తమిళ్ సెల్వికి శ్వాస తీసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆమె కోవై ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అక్కడ వైద్యులు కృపా శంకర్ బృందం తమిళ్ సెల్వికి చికిత్స అందించారు. ఆమెకు స్కాన్ చేసి చూడగా కడుపులో పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించారు. ఈ మెరకు తమిళ్ సెల్వికి వైద్యులు 4.30 గంటల సమయం శస్త్ర చికిత్స చేసి ఆమె కడుపులో ఉన్న 36 కిలోల కణితిని తొలగించారు.

విద్యార్థిపై కత్తితో దాడి

• ముగ్గురు అరెస్ట్

తిరువళ్లూరు: తిరువళ్లూరు సమీపంలో పదవ తరగతి విద్యార్థిపై దాడి చేసిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. తిరువళ్లూరు జిల్లా కోవిల్‌పదాగై ప్రాంతానికి చెందిన బాలుడు అదే ప్రాంతంలోని పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. ఈ నేపత్యంలో శనివారం రాత్రి ఆవడిలోని సినిమా థియేటర్‌లో సినిమా చూసిన తరువాత ఇంటికి బయలుదేరాడు. కోవిల్‌పతాకై సమీపంలోని కలైంజర్ నగర్ వద్ద వెళుతుండగా రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఏడుగురు యువకులు బాలుడిపై కత్తితో దాడి చేసి ద్విచక్ర వాహనంలో కిడ్నాప్ చేసి సమీపంలోని చెరువు కరకట్ట వద్దకు తీసుకెళ్లి వేధించి అనంతరం బాలుడ్ని అక్కడే వదిలేసి పరారయ్యారు. స్థానిక పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి బాలుడ్ని రక్షించి ఆస్పత్రికి తరలించారు. పాటు కోవిల్‌పథాకై ప్రాంతానికి చెందిన జయరామన్(26), రంజిత్(28) స్టీఫెన్(23) ముగ్గురిని అరెస్టు చేసి పరారైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

బురదలో చిక్కుకుని విద్యార్థి మృతి

అన్నానగర్: పుళల్‌లో మెట్రో వాటర్ పంపింగ్ స్టేషన్‌లో మంగళవారం మధ్యాహ్నం స్నానానికి వెళ్లిన 14 ఏళ్ల బాలుడు బురదలో చిక్కుకుని మృతిచెందాడు. పుళల్ సమీపంలో కావాంగరై ప్రాంతానికి చెందిన తిరునీలకంఠన్ ట్యాక్సీడ్రైవర్. ఇతని కుమారుడు మణికంఠన్ (14). పుళల్ క్యాంపు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం పుళల్ సరస్సు నుంచి శుద్ధి చేసేందుకు నీటిని తీసుకునే పంపింగ్ స్టేషన్ వద్ద స్నేహితులతో కలిసి స్నానం చేస్తుండగా బురదలో చిక్కుకుని గల్లంతయ్యాడు. విషయం తెలిసి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మణికంఠన్ కోసం గంటపాటు వెతికి మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం పుళల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పడి దంపతులకు తీవ్రగాయాలు

తిరువొత్తియూరు: చెన్నై వెప్పేరి వద్ద చెట్టుపడి బైకుపై వెళుతున్న దంపతులకు గాయాలయ్యాయి. చెన్నై కొరుక్కుపేట పోలీస్‌స్టేషన్‌లో లా అండ్ ఆర్డర్ లేడీ కానిస్టేబుల్‌గా సుప్రియ. మంగళవారం ఉదయం సుప్రియ భర్త కానిస్టేబుల్ ఆనందరాజ్‌తో కలిసి బైక్‌లో పోలీస్‌స్టేషన్‌కు వెళుతోంది. ఈవీఆర్ సాలైలో పెట్రోల్ బంకు వద్ద వెళుతుండగా రోడ్డు పక్కన ఉన్న చెట్టు అకస్మాత్తుగా బైక్‌పై విరిగిపడింది. ఈ ఘటనలో కానిస్టేబుల్ ఆనందరాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. సుప్రియకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన దంపతులను ట్రాఫిక్ పోలీసులు రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎగ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 79,087 మంది స్వామివారిని దర్శించుకోగా.. 35,640 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.41 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యాయం కోసం వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యకు యత్నిస్తున్న వృద్ధురాలిని అడ్డుకుంటున్న పోలీసులు


వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఆర్డీఓ దీప

తిరుత్తణి: తిరుత్తణి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వృద్ధురాలు పెట్రోల్ బాటిల్‌తో వచ్చి ఆత్మహత్యకు యత్నించింది. మంగళవారం తిరుత్తణి తహసీల్దార్ కార్యాలయంలో జూన్ 6 నుంచి రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు పాల్గొని వినతిపత్రాలు అందజేశారు. ఆ సమయంలో ఓ వృద్ధురాలు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పెట్రోల్ బాటిల్‌తో వచ్చి ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే విధుల్లో వున్న పోలీసులు గుర్తించి వృద్ధురాలి నుంచి పెట్రోల్ క్యాన్ లాక్కుని ఆర్డీఓ వద్దకు తీసుకెళ్లారు. ఆర్డీఓ దిప వృద్ధురాలితో మాట్లాడారు. మండూరు గ్రామానికి చెందిన వళ్లియమ్మాల్ తనకు సొంతమైన సర్వే నంబర్ 157/8 లో 50 ఏళ్లుగా ఇల్లు కట్టుకుని నివాశముంటున్నట్లు, తన ఆస్తి ప్రస్తుతం చందిరమ్మ పేరిట పట్టా మారినట్లు రెవెన్యూ రికార్డుల్లో చోటుచేసుకున్న తప్పునకు సంబంధించి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రెండేళ్ల నుంచి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని దీంతో ఆత్మహత్యకు యత్నించినట్లు చెప్పింది. న్యాయం చేయాలని ఇచ్చిన వినతిపత్రం మేరకు రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

• చెన్నైలో అంతర్జాతీయ పోటీలు


చెన్నై వేదికగా అంతర్జాతీయ స్థాయి స్క్వాష్ టోర్నమెంట్ -2023 పోటీలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. ప్రపంచ దేశాల నుంచి స్క్వాష్ క్రీడాకారులు చెన్నైకు తరలివచ్చారు. మంగళవారం నుంచి క్రీడాకారుల మధ్య పోటీలు మొదలయ్యాయి. చిత్రంలో వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులను మంత్రి ఉదయ నిధి స్టాలిన్‌కు పరిచయం చేశారు. - సాక్షి, చెన్నై

చోరీకి గురైన పోలీస్ జీప్ పట్టివేత


వందవాసిలో పట్టుబడిన చిత్తూరు పోలీస్ జీప్

వేలూరు: ఆంధ్ర రాష్ట్రం చిత్తూరులో సోమవారం సాయంత్రం హైవే పెట్రోలింగ్ పోలీసులు వాహన తనఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ఓయువకుడు పోలీసుజీప్‌ను చోరీ చేసి తమిళనాడులోని వేలూరు జిల్లా మీదుగా వెళ్లాడు. దీంతో సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు తిరువణ్ణామలై జిల్లా వైపు వెళుతున్నట్లు గుర్తించారు. దీంతో చిత్తూరు పోలీసులు తిరువణ్ణామలై ఎస్పీ కార్యాలయానికి సమాచారం అందజేశారు. దీంతో అప్రమత్తమైన తిరువణ్ణామలై పోలీసులు జిల్లా వ్యాప్తంగా అప్రమత్తం చేశారు. సోమవారం సాయంత్రం తిరువణ్ణామలై జిల్లా వందవాసి సమీపంలో పోలీసులు గాలిస్తుండగా చిత్తూరుకు చెందిన పోలీస్ జీపును ఒక యువకుడు నడుపుతూ వచ్చాడు. బజారు రోడ్డులో ట్రాఫిక్ అధికంగా ఉండడంతో జీపు మెల్లగా వెళ్లడంతో పోలీసులు జీపును అడ్డుకుని యువకుడిని పట్టుకున్నారు. అనంతరం పోలీస్‌జీప్‌ను స్వాధీనం చేసుకుని వందవాసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ జరిపారు. విచారణలో యువకుడు చిత్తూరుకు చెందిన సూర్య(24) అని తెలిసింది. యువకుడితో పాటు పోలీస్ జీపును చిత్తూరు పోలీసులకు అప్పగించినట్లు వందవాసి డీఎస్పీ కార్తిక్ తెలిపారు.

తల్లీకుమారుడు ఆత్మహత్య

వేలూరు: తిరువణ్ణామలైలో ఓ తల్లీకుమారుడు వేరు వేరుగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానిక హౌసింగ్ బోర్డు ప్రాంతానికి చెందిన జ్యోతి(48). ఈమె కుమారుడు విజయ్(25). ఇతను చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా గత ఏడాది విజయ్ తిరువణ్ణామలైకి వచ్చాడు. అక్కడ మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురైన విజయ్ సోమవారం రాత్రి ఇంటి మిద్దెపైన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తల్లి జ్యోతికి తెలియలేదు. అయితే కుమారుడు మద్యానికి బానిసయ్యాడని, అతన్ని మందలించానని మనస్తాపం చెంది తల్లి జ్యోతి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో స్థానికులు తిరువణ్ణామలై పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా తల్లీ, కుమారుడు మృతిచెంది ఉండడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్య చేసుకోగా కుమారుడిని తిట్టానని తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆ ప్రాంతంలో విషాదం రేపింది.

కొత్త బస్సుల కొనుగోలుకు శ్రీకారం

• టెండర్‌లకు రవాణాశాఖ ఆహ్వానం

కొరుక్కుపేట: రాష్ట్ర ప్రభుత్వ రవాణాశాఖ పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి 150 లోఫ్లోర్ బస్సులు సహా 600 కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు కోరింది. తమిళనాడులో 21 వేల బస్సులు నడుస్తుండగా 10 వేల బస్సులు 15 ఏళ్లు దాటాయి.15 ఏళ్లుగా వాడుతున్న బస్సులను నడపరాదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో తమిళనాడు ప్రభుత్వ రవాణా శాఖ పాత బస్సుల స్థానంలో కొత్త బస్సుల కొనుగోలుకు నిర్ణయించింది. అసెంబ్లీలో గత బడ్జెట్‌లో 1000 కొత్త బస్సులు కొనుగోలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో మొదటి దశలో 600 బస్సులు కొనుగోలు చేయాల్సి ఉంది. దీనికోసం ప్రభుత్వం టెండర్లు కోరింది. ఇందులో 150 బస్సులను ఫుల్ ఫ్లోర్ బస్సులుగా కొనుగోలు చేస్తున్నారు. బస్ బాడీ నిర్మాణానికి సంబంధించిన టెండర్‌లో ప్రముఖ బస్ బాడీ బిల్డర్లు కూడా పాల్గొనవచ్చని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన, సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించేందుకు అధికారులు కొత్త బస్సుల కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నారు.

ఎస్‌ఐ సస్పెన్షన్

అన్నానగర్: కళ్లకురిచ్చి జిల్లాలో మద్యపానాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు జిల్లా ఎస్పీ మోహన్‌రాజ్ నేతృత్వంలో పలు చర్యలు చేపడుతున్నారు. అలాగే కల్తీ మద్యం తయారీదారులు, విక్రయదారులతో సంబంధం వున్న పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కళ్లకురిచ్చి సమీపంలోని కరియలూరు పోలీసుస్టేషన్‌లో స్పెషల్ డివిజన్ స్పెషల్ ఎస్‌ఐగా పనిచేస్తూ ప్రస్తుతం హైవే పెట్రోలింగ్–2లో పని చేస్తున్న రామలింగంకు మద్యం వ్యాపారులతో సంబంధాలున్నట్లు తేలింది. దీంతో ఎస్పీ, రామలింగంను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అనుమతి లేకుండా టేకుచెట్ల నరికివేత

• ఆర్డీఓకు గ్రామీణుల ఫిర్యాదు


నరికేసిన టేకుచెట్లు

పళ్లిపట్టు: పోరంబోకు కాలువ వద్ద టేకుచెట్ల నరికి వేతపై గ్రామీణులు తిరుత్తణి ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. పళ్లిపట్టు యూనియన్ నొచ్చిలి పంచాయతీ సర్పంచ్ సమీప బంధువు పేరిట విజయమాంబాపురం గ్రామానికి సమీపంలోని వారి పొలానికి సమీపంలో పోరంబోకు కాలువ వద్ద 200 టేకుచెట్లు ఉన్నాయి. ఆ చెట్లను అనుమతి లేకుండా వారు నరికి విక్రయించేందుకు సిద్ధం కాగా గుర్తించిన గ్రామీణులు వీర్వోకు ఫిర్యాదు చేశారు. గ్రామ నిర్వహణాధికారి నరికివేతకు గురైన టేకుచెట్లను పరిశీలించి అటవీశాఖ, రెవెన్యూ శాఖ అనుమతి లేకుండా నరికిన చెట్ల విక్రయానికి అనుమతి లేదని, ఆర్ఐ విచారణ చేపట్టాలని అంతవరకు నరికిన చెట్లు తరలించరాదని ఆదేశించారు. అయితే ఆర్ఐ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ విజయమాంబాపురం గ్రామస్తులు తిరుత్తణిలో ఆర్డీఓ దీపను కలిసి ఫిర్యాదు చేశారు.

సంగీత పోషకురాలు వసంత ఇకలేరు


వసంత(ఫైల్)

కొరుక్కుపేట: శాస్త్రీయ సంగీతాన్ని పరిపోషిస్తున్న శర్వాణీ సంగీత సభ ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్.వసంత (96) ఇక లేరు. వయోభారంతో సోమవారం రాత్రి 10.30 గంటలకు చెన్నై టీనగర్‌లోని ఆమె నివాసంలో మృతిచెందారు. ఈమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె. కుమార్తె అమెరికాలో కరోనా కారణంగా చనిపోగా, భర్త 2014 సంవత్సరంలో చనిపోయారు. శాస్త్రీయ సంగీతాన్ని ప్రోత్సహించే విధంగా కొంతమంది మహిళలతో కలసి వసుంధర శర్వాణీ సంగీత సభను 1986లో స్థాపించారు. మొదటి వార్షికోత్సవ వేడుకలకు సంగీత కళానిధి డీకే పట్టమ్మాల్ పాల్గొని ఆశీర్వదించారు. మూడు దశాబ్దాలుగా నిరాటంకంగా సంగీత సేవతోపాటు ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలతో నగరంలోని ప్రముఖ సంస్థలలో ఒకటిగా పేరుప్రఖ్యాతలు సంపాదించారు. మహిళలచే నిర్వహిస్తున్న ఏకైక సభ కావడం దీనికి అన్నీ తానై వసుంధర చక్కని కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. శర్వాణీ సంగీత సభ ద్వారా ఆణిముత్యాలాంటి ప్రతిభను కనబరుస్తున్న సంగీతకారులను ప్రోత్సహిస్తూ అగ్రగామి కళాకారులుగా తయారుకావడంలో ప్రధాన భూమిక పోషించారు. 12 నుంచి 18 ఏళ్లలోపు సంగీత చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా అఖండం పేరుతో చేపట్టిన కార్యక్రమంతో ఆమెకు మరింత పేరును తెచ్చిపెట్టాయి. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో టీనగర్‌లోని కన్నమ్మపేట శ్మశాన వాటికలో ఎస్.వసుంధర అంత్యక్రియలు ముగిశాయి. ప్రముఖులు భువనచంద్ర, ప్రియా సిస్టర్స్, సుధీర్ వారియర్, వీఎల్ సుదర్శన్, అలగప్ప గ్రూప్ చైర్మన్ అలగప్ప, సంగీతకారిణి అరుణా ,శ్రీవిలాస్ , పలువురు తెలుగు ప్రముఖులు పాల్గొని ఆమె భౌతికాయానికి నివాళులర్పించారు.

కలెక్టరేట్ ఎదుట కారు దగ్ధం


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేలూరు: ఆంధ్ర రాష్ట్రం అనంతపురానికి చెందిన తరుణ్‌కుమార్(30) బెంగళూరులోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతని భార్యకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆమెను తీసుకుని వేలూరులోని సీఎంసీ ఆస్పత్రికి కారులో వచ్చారు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు అక్కడే ఉండి చికిత్స పొందాలని తెలిపారు. దీంతో తరుణ్‌కుమార్ సత్‌వచ్చారి సీఎంసీ కాలనీలోని అద్దె ఇంట్లో ఉంటూ భార్యకు చికిత్స తీసుకుంటున్నాడు. ఈ నేపత్యంలో మంగళవారం మధ్యాహ్నం ఇంటికి అవసరమైన నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు తరుణ్‌కుమార్ కారులో బయలుదేరాడు. కారు వేలూరు కలెక్టరేట్ ఎదుట వెళుతుండగా కారు వెనుక పొగ వచ్చాయి. గమనించిన తరుణ్‌కుమార్ వెంటనే కారు నుంచి బయటకు దిగేశాడు. అప్పటికే కారుకు మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, సత్‌వచ్చారి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. సత్‌వచ్చారి పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

15, 16 తేదీల్లో జీ-20 సమ్మిట్

• చెన్నైలో నాలుగు రోజులు డ్రోన్లు నిషేధం

కొరుక్కుపేట: చెన్నైలోని మహాబలిపురంలో ఈనెల 15, 16 తేదీల్లో రెండు రోజులు జీ–20 మహిళా సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు విదేశాల నుంచి ప్రముఖ ప్రతినిధులు హాజరవుతున్నారు. రక్షణ నిమిత్తం ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు డ్రోన్లపై నిషేధం విధించారు. విదేశీ ప్రతినిధులు సందర్శించే, బస చేసే ప్రదేశాలు, చెన్నై మెట్రోపాలిటిన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రతినిధులు ప్రయాణించే మార్గాలను రెడ్ జోన్‌లుగా ప్రకటించి, డ్రోన్‌లు, ఇతర మానవ రహిత వైమానిక వాహనాలను ఆ ప్రాంతాల్లో ఎగరడం నిషేధించారు. ఎవరైనా ఈ నిషేధాన్ని ఉల్లంఘించి డ్రోన్లు, ఇతర వైమానిక పరికరాలను ఉపయోగిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసులు హెచ్చరించారు.

శయనించు తల్లీ!



శయనసేవలో పవళించిన చెంగాళమ్మ తల్లి, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

• శయనసేవలో పవళించిన అమ్మవారు

సూళ్లూరుపేట: శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారికి శయనోత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. శనివారం రాత్రి మహిషాసురమర్దనంలో మహిషాసురుడితో యుద్ధం చేసిన అమ్మవారు సోమవారం రాత్రి తెప్పోత్సవంలో తరించారు. తర్వాత అమ్మవారికి విశ్రాంతి అవసరం కాబట్టి మంగళవారం రాత్రి శయనోత్సవాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో దీన్నే శయనసేవగా పిలుస్తుంటారు. అదేవిధంగా శయనసేవపై పవళించిన అమ్మవారు గ్రామోత్సవంలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చెంగాళమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు పుష్పపల్లకీ సేవ

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున బుధవారం పుష్పపల్లకీ సేవ నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. గ్రామోత్సవం కూడా శయనసేవతో ముగుస్తుంది. బుధవారం రాత్రి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో ''వీరసింహారెడ్డి'' సినిమా హీరోయిన్ హనీరోజ్ విచ్చేసి అలరించనున్నారు.

చెన్నై ఐఐటీలో బీఫ్ వివాదం

• హైకోర్టు చర్యలు

తిరువొత్తియూరు: చెన్నై ఐఐటీలో బీఫ్ అంశంపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థిని వేసిన కేసుపై పరిష్కరించాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. చెన్నై ఐఐటీలో బీఫ్‌తినే కార్యక్రమం ఏర్పాటు చేసిన విద్యార్థులపై ఏబీవీపీ సంఘం దాడి చేసింది. ఈ నేపథ్యంలో రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులపై పోలీసులు దాడి చేశారు. కాగా, విద్యార్థులపై దాడికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ దితి మేథ్యూ అనే విద్యార్థిని హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును న్యాయమూర్తులు విచారించగా, ఈ విషయమై ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేశామని, విద్యార్థుల చర్యలను ఖండిస్తున్నామని ఐఐటీ తరఫున తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆరు కేసులు నమోదు కాగా, అవి కోర్టు విచారణలో ఉన్నాయని ప్రభుత్వం వివరించింది. విద్యార్థులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని న్యామూర్తులు పేర్కొంటూ, కేసు కోర్టులో ఉన్నందున ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయనక్కరలేదని కేసును ముగించారు.

హిప్ సర్జరీ కేంద్రం ప్రారంభం

కొరుక్కుపేట: చెన్నై వడపళనిలోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (సిమ్స్) ఆస్పత్రిలోని ఏషియన్ ఆర్థోపెడిక్ ఇన్‌స్టిట్యూట్ (ఏఓఐ)ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా 360 డిగ్రీ హిప్ సర్జరీ (తుంటి ఎముక చికిత్స) కేంద్రాన్ని మంగళవారం ఎస్ఆర్ఎం గ్రూప్ చైర్మన్ డాక్టర్ రవి పచ్చముత్తు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓఐ ఇన్‌చార్జి, సిమ్స్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జరీ డైరెక్టర్ డాక్టర్ పి. సూర్యనారాయణ, సిమ్స్ ఆస్పత్రి ప్రెసిడెంట్ బాలమురుగన్, వైద్య నిపుణులు డాక్టర్ విజయ్ సి బోస్, డాక్టర్ ప్రసాద్ గొరినేని, డాక్టర్ కేతన్ పాల్గొన్నారు.

వైభవంగా వకుళమాత ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు


విద్యుత్ కాంతుల్లో వకుళమాత ఆలయం


అమ్మకు బంగారు కానుకలను పంపించిన కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, పేరూరు బండ (పాతకాల్వ)పై నిర్మించిన శ్రీ వకుళమాత ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం పుణ్యాహవచనం, కలశ స్థాపన, కలశ పూజ, విశ్వక్సేనారాధన జరిపారు. అనంతరం సంకల్ప పూజ, అగ్ని ప్రతిష్ట, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, అష్టోత్తర శత కలశ స్నపనం నిర్వహించారు. ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, సీతారామాచార్యులు నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్ దంపతులు, జేఈఓ వీరబ్రహ్మం, ఆర్‌డీఓ కనక నరసారెడ్డి, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డెప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

అమ్మకు వెంకన్న కానుక ..

వకుళ మాత ఆలయ తొలి వార్షికోత్సవం సందర్భంగా తిరుమల నుంచి ఆమె కుమారుడు వేంకటేశ్వర స్వామి 160 గ్రాముల బరువైన రెండు బంగారు హారాలు కానుకగా పంపారు. శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం ఈ ఆభరణాలను తీసుకొచ్చి జేఈఓ వీరబ్రహ్మంకు అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా జేఈఓ ఈ ఆభరణాలను ఆలయానికి అందించారు. మంత్రి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రామచంద్రారెడ్డి వకుళ మాత చిత్రపటాలను ఆవిష్కరించారు.

విద్యార్థిని ఆత్మహత్య కేసులో మహిళ అరెస్ట్

అన్నానగర్: కోయంబత్తూరులో లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుసులో ఉపాధ్యాయుడి భార్యను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కోయంబత్తూరు ఉక్కడం కోడ్ సమయానుకూలమైన పెరుమాళ్ ఆలయ వీధికి చెందిన మకుడేశ్వరన్. ఇతని 17 ఏళ్ల కుమార్తె ఆర్ఎస్ పురంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో 11వ తరగతి చదువుతోంది. నవంబర్ 11, 2021న విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్కూల్ టీచర్ మిథున్ చక్రవర్తి విద్యార్థినిని లైంగికంగా వేధించాడని తేలింది. దీంతో మిథున్ చక్రవర్తిని అరెస్టు చేసి కోయంబత్తూరు జైలుకు తరలించారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులపై చర్యలు తీసుకోని స్కూల్ ప్రిన్సిపల్ మీరా జాక్సన్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేసి జైలుకు తరలించారు. విద్యార్థిని లైంగికంగా భర్త వేధిస్తున్నాడని తెలిసి కూడా అతనిపై ఫిర్యాదు చేయలేదని మిథున్ చక్రవర్తి భార్య అర్చనను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

క్లుప్తంగా...

నేడు ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల విడుదల

సాక్షి, అమరావతి/అనంతపురం: రాష్ట్రంలోని ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఈఏపీ సెట్–2023 ఫలితాలను బుధవారం ఉదయం 10.30 గంటలకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేయనున్నారు. గత నెల 15 నుంచి 23 వరకు జరిగిన ప్రవేశ పరీక్షలకు మొత్తం 3,38,739 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 3,15,297 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో ఎంపీసీ స్ట్రీమ్‌లో 2,38,180 మందికి గాను 2,24,724 మంది, బైపీసీ స్ట్రీమ్‌లో 1,00,559 మందికి గాను 90,573 మంది పరీక్ష రాశారు. కోవిడ్ సమయంలో తొలగించిన ఇంటర్మీడియెట్ వెయిటేజ్ మార్కులను ఈసారి పరిగణలోకి తీసుకుని ఫలితాలను ప్రకటించనున్నారు.

ఇంటర్ బోర్డు ఎగ్జామ్స్ కంట్రోలర్ బదిలీ

సాక్షి, అమరావతి: ఏపీ ఇంటర్మీడియట్ బోర్డులో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచేస్తున్న ఆదూరి శ్రీనివాసులు బదిలీ అయ్యారు. మంగళవారం ఇంటర్ బోర్డు కార్యదర్శి శేషగిరిబాబుకు బాధ్యతలు అప్పగించిన ఆయన నెల్లూరు పట్టణంలోని దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా చేరనున్నారు. 2022 నవంబర్‌లో జాయింట్ డైరెక్టర్ హోదాలో బదిలీపై ఇంటర్ బోర్డుకు వచ్చి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ప్రిన్సిపల్‌గా పనిచేసిన కళాశాలకే ఆయన తిరిగి వెళుతున్నారు.

బాబు, లోకేశ్ ఇద్దరూ అబద్ధాలకోరులే

- కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి



కడప కార్పొరేషన్ : చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ ఇద్దరూ అబద్ధాల కోరులేనని వైఎస్సార్ జిల్లా కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి విమర్శించారు. కడప నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలతో కలిసి మంగళవారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాశ్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను విమర్శించడానికే లోకేశ్ పాదయాత్ర చేస్తున్నట్లుందన్నారు. అబద్ధాలు ఆడటంలో లోకేశ్ తండ్రిని మించిపోయాడన్నారు. ఏమాత్రం చిత్తశుద్ధి, కనీస అవగాహన లేకుండా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని అవినాశ్ మండిపడ్డారు. ఆయన రాయలసీమ వాసినన్న విషయం లోకేశ్‌కు పాదయాత్రలోనే గుర్తుకొచ్చినట్లుందని ఎద్దేవా చేశారు. ఇలా అసత్యాలు మాట్లాడే తండ్రీకొడుకులను రాష్ట్ర ప్రజలెవరూ నమ్మబోరని అవినాశ్ తెలిపారు.

నెల్లూరు జిల్లాలోకి లోకేశ్ పాదయాత్ర

ఆత్మకూరు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర మంగళవారం వైఎస్సార్ జిల్లాలో ముగియగా.. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించింది. మర్రిపాడు మండలంలో కదిరినాయుడుపల్లి సరిహద్దు వద్ద సాయంత్రం 5.30 సమయంలో జిల్లాలోకి ప్రవేశించిన లోకేశ్‌కు ఆనం రామనారాయణరెడ్డితోపాటు టీడీపీ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, కురుగుండ్ల రామకృష్ణ, కొమ్మి లక్ష్మయ్య నాయుడు, ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి స్వాగతం పలికారు. కదిరినాయుడుపల్లి సరిహద్దు నుంచి ప్రారంభమైన పాదయాత్ర పడమటినాయుడుపల్లి వద్దకు చేరుకుంది. రాత్రి అక్కడే బస చేశారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలు విరమించుకోవాలి

పది వామపక్ష పార్టీల సమావేశం నిర్ణయం

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలు విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని పది వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. మంగళవారం పది వామపక్ష పార్టీల నేతలు నిర్వహించిన సమావేశ నిర్ణయాలను నేతలు వెల్లడించారు.విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. విశాఖ ఉక్కుకు చెందిన 25 ఎకరాల్లోని 588 క్వార్టర్స్, 84 ఇళ్లను అమ్మకానికి పెడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంపై వామపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ ఆలోచనను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంటు సభ్యులకు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు వామపక్షాల ఆధ్వర్యంలో ప్రతినిధివర్గం ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించాయి. రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఈ నెల 18న విజయవాడలో సదస్సు నిర్వహించాలని నిర్ణయించాయి. వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు వి.శ్రీనివాసరావు (సీపీఎం), కె.రామకృష్ణ (సీపీఐ), పోలారి (సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), ఎస్.మూర్తి (సీపీఐఎంఎల్ లిబరేషన్), కాటం నాగభూషణం (ఎంసీపీఐయు), జాస్తి కిషోర్ బాబు (సీపీఐఎంఎల్), రామకృష్ణ(సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), సుధీర్ (ఎస్‌యుసీఐసీ) పాల్గొన్నారు. సమావేశం తొలుత ఇటీవల మరణించిన ప్రముఖ రచయిత, కవి కేతు విశ్వనాథరెడ్డికి, రైలు ప్రమాదంలో మరణించిన వందలాది మంది ప్రజలకు సంతాపం ప్రకటించింది.

నీట్‌లో ఏపీ విజయకేతనం

▶ మొదటి పేజీ తరువాయి

నిలిచాడు. ఈ విద్యార్థికి కూడా 99.99 పర్సంటైల్ వచ్చింది. మొత్తం మీద నీట్‌లో ఏపీ విద్యార్థులు అధికంగా ర్యాంకులను కొల్లగొట్టారని ఫలితాల సరళిని బట్టి తెలుస్తోంది. రాష్ట్రానికి చెందిన వైఎల్ ప్రవర్ధన్‌రెడ్డి అఖిల భారత స్థాయిలో 25వ ర్యాంక్ సాధించి ఈడబ్ల్యూఎస్ విభాగంలో దేశంలోనే తొలి స్థానంలో నిలిచాడు. ఆల్ ఇండియా 40వ ర్యాంక్‌తో ఎస్సీ విభాగంలో ఏపీకి చెందిన కె.యశశ్రీ రెండో స్థానం దక్కించుకుంది. అలాగే 119వ ర్యాంక్ సాధించిన ఏపీ విద్యార్థి ఎం.జ్యోతిలాల్ చావన్ ఎస్టీ విభాగంలో దేశంలో మొదటి ర్యాంకును కొల్లగొట్టాడు. ఈ మేరకు 2023–24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ–2023 ఫలితాలు మంగళవారం రాత్రి వెలువడ్డాయి. నీట్ యూజీ పరీక్షను దేశవ్యాప్తంగా గత నెలలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా దేశవ్యాప్తంగా ఈ ఏడాది 20,87,462 మంది విద్యార్థులు నీట్‌కు దరఖాస్తు చేసుకోగా 20,38,596 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 11,45,976 మంది (56.21 శాతం) నీట్‌లో అర్హత సాధించారు. అర్హత పొందిన వారిలో 4,90,374 మంది అబ్బాయిలు, 6,55,599 మంది అమ్మాయిలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారు. కాగా, తమిళనాడుకు చెందిన కౌస్తవ్ బౌరి 716 మార్కులతో మూడో ర్యాంక్, పంజాబ్‌కు చెందిన ప్రాంజల్ అగర్వాల్ 715 మార్కులతో నాలుగో ర్యాంక్, కర్ణాటకకు చెందిన ధ్రువ్ అద్వానీ ఐదో ర్యాంక్ కైవసం చేసుకున్నారు. ఆల్ ఇండియా టాప్ 50 ర్యాంకుల్లో ఏడుగురు తెలుగు విద్యార్థులు ఉండగా.. ఇందులో ఐదుగురు ఏపీ విద్యార్థులే కావడం విశేషం. మరో ఇద్దరు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు.

ఏపీ నుంచి 42,836 మంది

కాగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ ఏడాది 69,690 మంది నీట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 68,578 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 62.46 శాతం అంటే 42,836 మంది అర్హత సాధించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి అర్హత శాతం కొంత మేర పెరిగింది. 2022లో 65,305 మంది పరీక్ష రాయగా 61.77 శాతం 40,344 మంది అర్హత సాధించారు. తెలంగాణలో 72,842 మంది పరీక్ష రాశారు. వీరిలో 58.55 శాతం అంటే 42,654 మంది అర్హత సాధించారు. కాగా ఆల్ ఇండియా కోటాలో 15 శాతం సీట్లకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీసీఏ) కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. డీజీసీఏ సూచనల మేరకు అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మిగిలిన సీట్లకు రాష్ట్రాల్లో భర్తీ చేపడతారు.

నీట్ జాతీయ టాప్ 15 ర్యాంకర్లు వీరే

పేరు	మార్కులు	ర్యాంకు	రాష్ట్రం
1. బోర వరుణ్ చక్రవర్తి	720	1	ఆంధ్రప్రదేశ్
2. ప్రభంజన్	720	1	తమిళనాడు
3. కౌస్తవ్ బౌరి	716	3	తమిళనాడు
4. ప్రాంజల్ అగర్వాల్	715	4	పంజాబ్
5. ధ్రువ్ అద్వానీ	715	5	కర్ణాటక
6. సూర్య సిద్ధార్థన్	715	6	తమిళనాడు
7. శ్రీనికేత్ రవి	715	7	మహారాష్ట్ర
8. స్వయంశక్తి త్రిపాఠి	715	8	ఒడిశా
9. వరుణ్ ఎస్	715	9	తమిళనాడు
10. పార్థ్ ఖండేల్‌వాల్	715	10	రాజస్థాన్
11. అశిక అగర్వాల్	715	11	పంజాబ్
12. సయన్ ప్రధాన్	715	12	పశ్చిమ బెంగాల్
13. హర్షిత్ బన్సల్	715	13	ఢిల్లీ
14. శశాంక్ కుమార్	715	14	బిహార్
15. కంచాని రఘురామ్‌రెడ్డి	715	15	తెలంగాణ

కటాఫ్ వివరాలు ఇలా..

కేటగిరీ	పర్సంటైల్	స్కోర్
అన్ రిజర్వ్డ్ /ఈడబ్ల్యూఎస్	50	720-137
ఓబీసీ	40	136-107
ఎస్సీ	40	136-107
ఎస్టీ	40	136-107

ఆల్ ఇండియా 50 లోపు ర్యాంకులు సాధించిన తెలుగు విద్యార్థులు

పేరు	రాష్ట్రం	ర్యాంక్
బోర వరుణ్ చక్రవర్తి	ఏపీ	01
కె.జయంత్ రఘురామ్ రెడ్డి	తెలంగాణ	15
వై. లక్ష్మీ ప్రవర్ధన్ రెడ్డి	ఏపీ	25
వి. హర్షిల్ సాయి	ఏపీ	35
కె. యశశ్రీ	ఏపీ	40
కల్వకుంట్ల ప్రణతిరెడ్డి	ఏపీ	45
జాగృతి బోడెద్దుల	తెలంగాణ	49

ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేస్తా

మాది పోలాకి మండలం తోటాడ గ్రామం. నాన్న బోర రాజేంద్ర నాయుడు నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, అమ్మ రాజ్యలక్ష్మి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. నీట్‌లో మంచి ర్యాంకు వస్తుందనుకున్నా. అయితే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంటానని అనుకోలేదు. ఇంటర్మీడియెట్‌లో 987 మార్కులు వచ్చాయి. న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదువుతా.

–బోర వరుణ్ చక్రవర్తి, నీట్ ఆలిండియా ఫస్ట్ ర్యాంకర్

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సప్లిమెంటరీ పరీక్షలకు 2,51,653 మంది హాజరు

- మార్చి, మే పరీక్షల్లో ద్వితీయ సంవత్సరంలో 84.35 శాతం ఉత్తీర్ణత
- ఈ నెల 23 వరకు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు అవకాశం

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు ఫలితాలు విడుదల చేశారు. ఈ ఏడాది సప్లిమెంటరీకి 2,51,653 మంది జనరల్ అభ్యర్థులు, ఒకేషనల్ కోర్సులకు 26,735 మంది, మరో 38,666 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరైనట్టు వివరించారు. మొదటి సంవత్సరం 1,69,347 మంది బెటర్‌మెంట్ రాశారన్నారు. కాగా, ఈ ఏడాది మార్చి, మే నెలల్లో నిర్వహించిన పరీక్షల్లో మొత్తం 84.35 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మొదటి సంవత్సరం రెండు దశల్లోను 4,16,639 మంది పరీక్షకు హాజరు కాగా మార్చిలో 2,66,326 మంది, అడ్వాన్స్ సప్లిమెంటరీలో 56,767 (77.54 శాతం) మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం మార్చి, అడ్వాన్స్ సప్లమెంటరీకి 3,73,341 మంది హాజరవగా, మార్చిలో 2,72,001, సప్లిమెంటరీలో 42,931 (84.35 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు ఈ నెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మొదటి సంవత్సరం బెటర్‌మెంట్‌కు హాజరైన 1,69,347 మందిలో 1,41,733 (83.69 శాతం) మంది ఇంప్రూవ్‌మెంట్ సాధించారు. మార్చిలో ఫెయిలైన 1,50,313 మంది సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కాగా 56,767 మంది (37.77 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

- ▲ మార్చిలో ద్వితీయ సంవత్సరం ఫెయిలైన 1,01,340 మంది విద్యార్థులు అడ్వాన్స్ సప్లిమెంటరీకి హాజరవగా 42,931 (42.36 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు విద్యార్థులు 38,666 మందిలో 14,395 (37.22 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మార్చి, అడ్వాన్స్ సప్లిమెంటరీలో ద్వితీయ ఇంటర్‌లో బాలికలు 86.46 శాతం, బాలురు 81.99 శాతం ఉత్తీర్ణత సాధించగా, మొదటి సంవత్సరం ఫలితాల్లో బాలికలు 80.56 శాతం, బాలురు 74.34 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- ▲ జిల్లాల వారీగా మొదటి సంవత్సరం ఫలితాల్లో కృష్ణా జిల్లా (88.38 శాతం) మొదటి స్థానంలో, వైఎస్సార్ జిల్లా (63.32 శాతం) చివరి స్థానంలో నిలిచాయి. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పశ్చిమ గోదావరి (97.32 శాతం) మొదటి స్థానంలో, వైఎస్సార్ జిల్లా (75.95 శాతం) చివరి స్థానంలో ఉన్నాయి.
- ▲ ఒకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థులు 78.53 శాతం, ద్వితీయ సంవత్సరంలో 84.69 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.
- ▲ ఫలితాలను www. bie. ap. gov. in వెబ్‌సైట్‌లో చూడవచ్చని శేషగిరిబాబు తెలిపారు.

నేడు ఏపీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

ఏయూ క్యాంపస్: ఏపీ ఎడ్‌సెట్–2023 ప్రవేశ పరీక్ష బుధవారం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 36 నగరాలలో 77 కేంద్రాలలో పరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,672 మంది దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసిన వారు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా పరీక్షకు హాజరు కావాలని సూచించారు. హాల్‌టికెట్, తమ గుర్తింపు కార్డును తీసుకురావాలని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 7.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. పరీక్షకు నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

పోలవరం గైడ్‌బండ్ పరిశీలనకు సీడబ్ల్యూసీ కమిటీ

- నేడు రాజమండ్రికి నిపుణుల బృందం.. రేపు క్షేత్రస్థాయిలో పరిశీలన
- 16న జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష
- ఆ కమిటీ నివేదిక ఆధారంగా గైడ్ బండ్ జారిన ప్రాంతంలో చర్యలు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు గైడ్ బండ్ కొద్దిగా జారడానికి దారితీసిన కారణాలు అన్వేషించడానికి కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ బుధవారం రాత్రి రాజమహేంద్రవరానికి చేరుకోనుంది. గురువారం ప్రాజెక్టు గైడ్ బండ్‌ను పరిశీలించనుంది. శుక్రవారం జలవనరుల శాఖ అధికారులు, కాంట్రాక్టు సంస్థతో సమావేశం నిర్వహించి.. గైడ్ బండ్‌లో కొంత భాగం జారడానికి గల కారణాలను తేల్చనుంది. జారిన ప్రాంతాన్ని సరిదిద్ది.. గైడ్ బండ్‌ను పటిష్టం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇవ్వనుంది. ఆ నివేదిక ఆధారంగా గైడ్ బండ్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ చక్కదిద్దనుంది.

డిజైన్‌కు తగ్గట్టుగానే గైడ్ బండ్..

సీడబ్ల్యూసీ ఖరారు చేసిన పోలవరం ప్రాజెక్టు డిజైన్ మేరకు పుణెలోని సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్)లో ఆ సంస్థ నమూనా పోలవరం ప్రాజెక్టును నిర్మించి పరిశోధనలు చేసింది. ఆ పరిశోధనల్లో వెల్లడైన అంశాల ఆధారంగా.. గోదావరి అప్రోచ్ చానల్ ప్రారంభంలో 550 మీటర్ల వెడల్పుతో మొదలుపెట్టి స్పిల్ వే వద్దకు వచ్చే సరికి 1,100 మీటర్ల వెడల్పుతో తవ్వాలని సూచించింది. అప్రోచ్ చానల్‌లోని ప్రవాహంలో ఉండే మార్పులతో సుడిగుండాలు ఏర్పడతాయని పేర్కొంది. ఇది స్పిల్ వేపై ఒత్తిడి పెంచుతుందని తేల్చింది. సుడిగుండాలను నియంత్రించడం, స్పిల్ వేపై ఒత్తిడిని తగ్గించడంతో పాటు వరద సులభంగా దిగువకు వెళ్లడానికి వీలుగా స్పిల్ వేకు ఎగువన ఎడమ గట్టు కొండకు సమాంతరంగా 500 మీటర్ల పొడవుతో గైడ్ బండ్ నిర్మించాలని సూచించింది. సీడబ్ల్యూపీఆర్‌ఎస్ పరిశోధనలోని అంశాల ఆధారంగా మేఘా సంస్థ రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్ డిజైన్‌ను రూపొందించి జలవనరుల శాఖకు పంపింది. దాన్ని పీపీఏ ద్వారా డీడీఆర్పీకి, అక్కడి నుంచి సీడబ్ల్యూసీకి పంపింది. సీడబ్ల్యూసీ దాన్ని పరిశీలించి ఖరారు చేసింది. ఆ డిజైన్ మేరకు రిటైనింగ్ వాల్ కమ్ గైడ్ బండ్‌ను నిర్మించారు.

సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకెళ్లిన ప్రభుత్వం

సీడబ్ల్యూసీనే ఖరారు చేసిన డిజైన్‌కు తగ్గట్టుగా నిర్మించిన గైడ్ బండ్‌లో కాస్త జారడాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఈనెల 5న సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా వర్చువల్‌గా రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో సమీక్షించారు. గైడ్ బండ్‌లో చిన్న సమస్య తలెత్తడానికి గల కారణాలను అన్వేషించేందుకు సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏబీ పాండ్య అధ్యక్షతన సీడబ్ల్యూసీ డైరెక్టర్ ఎస్కే సిబాల్, సీఎస్ఎంఆర్‌ఎస్(సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్) డైరెక్టర్ చిత్ర, పీపీఏ సీఈవో శివనందన్‌కుమార్ సభ్యులుగా నిపుణుల కమిటీని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా నియమించారు.

కుమారుడు పట్టించుకోవడం లేదని ‘జగనన్నకు చెబుదాం’లో ఫిర్యాదు

న్యాయం చేస్తామని పోలీసు అధికారుల భరోసా

రావికమతం: వృద్ధాప్యానికి చేరిన తమను కుమారుడు చూడటం లేదని.. కనీసం ఆదరించడం లేదని అనకాపల్లి జిల్లా రావికమతం మండలం తోటకూరపాలెం గ్రామానికి చెందిన లాలం పైడితల్లి, రాజులమ్మ అనే వృద్ధ దంపతులు ‘జగనన్నకు చెబుదాం’ టోల్ ఫ్రీ నంబర్ 1902కు మంగళవారం ఫోన్ చేసి ఫిర్యాదు ఇచ్చారు. వెంటనే అనకాపల్లి ఎస్పీకి సమాచారం అందడంతో ఆయన తక్షణం స్పందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావుతో కలిసి తోటకూరపాలెం వెళ్లారు. పైడితల్లి, రాజులమ్మను కలిశారు. వారు నీరసంగా ఉండటంతో పండ్లు, రొట్టెలు ఇచ్చి ఓదార్చారు. ఆపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన వద్దు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. పైడితల్లి, రాజులమ్మకు కుమారుడు తాతబాబు కాగా, కుమార్తెలకు గతంలోనే



పైడితల్లికి పండ్లు అందిస్తూ భరోసా ఇస్తున్న సీఐ మహమ్మద్

వివాహాలు జరిగాయి. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని సైతం తాతబాబు అనుభవిస్తూ ఏ పనీ చేసుకోలేని దుస్థితిలో ఉన్న తల్లిదండ్రులను కనీసం పట్టించుకోవడం లేదని తెలుసుకున్నారు. గ్రామస్తులు సైతం పలుమార్లు తాతబాబును హెచ్చరించినా అతని తీరు మారలేదు. దీంతో ఆ వృద్ధ దంపతులు విధి లేక ‘జగనన్నకు చెబుదాం’లో ఫిర్యాదు చేశారు. తాతబాబుకు పోలీసు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రుల్ని సరిగా చూసుకోని పక్షంలో చట్టాలు కఠినంగా శిక్షిస్తాయని హెచ్చరించారు.

దివ్యాంగులు నేరుగా కౌన్సెలింగ్‌కు రావొచ్చు


- సచివాలయాల ఉద్యోగులకు ప్రత్యేక వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయకపోయినా బదిలీలకు అవకాశం
- రేపు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చు
- ఉత్తర్వులు జారీచేసిన గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీశ

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో దివ్యాంగ ఉద్యోగులు, మానసిక వైకల్యం గల పిల్లలు ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. బదిలీ కోసం ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోకపోయినా... ఈ నెల 15వ తేదీన అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న బదిలీల కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరుకావొచ్చని ప్రభుత్వం తెలిపింది. నేరుగా కౌన్సెలింగ్‌కు వచ్చేవారు బదిలీ దరఖాస్తుపత్రం, నిర్ణీత ధ్రువీకరణపత్రాలతోపాటు ఉద్యోగ నియామక సమయంలో పొందిన ర్యాంకు కార్డులను తీసుకురావాలని సూచించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ లక్ష్మీశ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల కోసం ఈ నెల 15వ తేదీన ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు–గ్రేడ్ 5, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సర్వే అసిస్టెంట్లు, వీఆర్వో, వార్డు రెవెన్యూ సెక్రటరీలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలకు ఆయా జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు ఆయా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ కౌన్సెలింగ్‌లో పోస్టింగ్‌లకు సంబంధించి దివ్యాంగులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తారు. ఆ తర్వాత వరుసగా మెడికల్ సంబంధిత కేటగిరీ ఉద్యోగులు, ఒంటరి మహిళలు, వితంతువులు, భార్యాభర్తలు వేర్వేరుచోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు, పరస్పర అంగీకార బదిలీలు, ఇతర కేటగిరీలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయ శాఖ జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది.

చంద్రబాబుకు విశ్వసనీయత లేదు

- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలుచేసిన చరిత్ర కూడా లేదు
- మహానాడులో ఆయన విడుదల చేసింది ఓ మాయాఫెస్టో
- కానీ, ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం జగన్ అమలుచేశారు
- దీంతో జగన్‌పై ప్రజల్లో రెట్టింపైన నమ్మకం
- 2024లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం
- మీడియాతో వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి : విశ్వసనీయత లేని టీడీపీ అధినేత చంద్రబాబును ప్రజలు ఎప్పటికీ నమ్మరని వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత ఎంపీ వి.విజయసాయిరెడ్డి స్పష్టంచేశారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో పార్ట్–1ను ప్రజలు విశ్వసించరని చెప్పారు. 2014 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క దానిని



ఆయన అమలుచేయకుండా ప్రజల్ని మోసం చేశారని.. దీనిని వారు ఎప్పటికీ మరిచిపోరన్నారు. కానీ, ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలుచేసిన సీఎం జగన్‌పై ప్రజల్లో నమ్మకం రెట్టింపైందని.. 2024లో ప్రజాబలంతో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం ఖాయమని విజయసాయిరెడ్డి తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

అభివృద్ధి పథంలో అగ్రగామిగా..

సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో లంచాలకు తావులేకుండా.. పారదర్శకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల ఖాతాల్లో రూ.2.16 లక్షల కోట్లను సీఎం జగన్ జమచేశారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనైనా ఈ స్థాయిలో సంక్షేమ పథకాలను అమలుచేశారా? విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అగ్రగామిగా ముఖ్యమంత్రి జగన్ నిలిపారు. ఇది ప్రజల్లో ఆయనపై విశ్వసనీయతను మరింతగా పెంచింది.

మేనిఫెస్టో కాదు మాయాఫెస్టో..

కర్ణాటక ఎన్నికలు ముగియగానే అక్కడి కాంగ్రెస్ మేనిఫెస్టోలో కొన్ని.. సీఎం వైఎస్ జగన్ అమలుచేస్తున్న పథకాలను కలిపి కిచిడి తయారుచేసి మహానాడులో మేనిఫెస్టో పార్ట్–1ను చంద్రబాబు విడుదల చేశారు. డిసెంబర్‌లో జరిగే తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం ఎన్నికల తర్వాత అక్కడ పార్టీలు పెట్టిన మేనిఫెస్టోను కాపీకొట్టి మేనిఫెస్టో పార్ట్–2ను ఆయన విడుదల చేస్తారేమో? అసలు చంద్రబాబు విడుదల చేసింది మేనిఫెస్టో కాదు.. అది ఓ మాయాఫెస్టో.

అవినీతికి ఒక్క ఆధారమైన చూపగలిగారా?

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతున్నట్లు బీజేపీ జాతీయ నేతలు ఇటీవల చేసిన ఆరోపణలకు ఒక్క ఆధారమైన చూపగలిగారా? రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సత్సంబంధాలు నెరుపుతుంది. విభజన చట్టం ప్రకారం రెవెన్యూలోటు కింద ఇవ్వాల్సిన నిధులను సీఎం జగన్ పదేపదే కోరడంతోనే కేంద్రం స్పందించి రూ.10,460 కోట్లను విడుదల చేసింది. వచ్చే ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కట్టకట్టుకుని పోటీచేసినా ప్రజాబలంతో వైఎస్సార్‌సీపీనే విజయం సాధిస్తుంది.

రాష్ట్రంలో రాజకీయ వేట మొదలైంది

- బీజేపీ వైఖరిని అమిత్‌షా స్పష్టం చేశారు
- బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

సాక్షి, విశాఖపట్నం: రాబోయే ఎన్నికలకు రాష్ట్రంలో రాజకీయ వేట మొదలైందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తున్నారని చెప్పారు. మంగళవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనపై పలు పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అందుకే ‘పార్టీల అసత్య ప్రచారం.. కేంద్ర సహకారం’ పేరుతో తమ పార్టీ ఇటీవల పుస్తకాన్ని ముద్రించిందని.. దీనిని అప్‌డేట్ చేసి త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. ఈ పుస్తకంతో ఇంటింటికీ వెళ్లి వాస్తవాలను వివరిస్తామన్నారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులకు కూడా ఈ పుస్తకంలో సమాధానం దొరుకుతుందన్నారు. విశాఖలో భూ కుంభకోణాలపై గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు వేసిన సిట్ నివేదికలను బహిర్గతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీతో సహా ఏ పార్టీకి కూడా బీజేపీ అండగా లేదని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై సీబీఐ లేదా సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాల్సిన అవసరముందన్నారు. దీనిపై ఎవరైనా కోర్టుకెళ్లి విచారణకు అభ్యర్థించవచ్చని.. ఇందులో కేంద్రం గానీ, బీజేపీ గానీ జోక్యం చేసుకోబోదన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ.. మార్గదర్శిపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. సమావేశంలో బీజేపీ నాయకుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల హామీలను నెరవేర్చని సీఎం జగన్

- ‘ప్రజా చార్జిషీట్ ’ విడుదల చేసిన మాజీ ఎంపీ హరిరామజోగయ్య

అన్నవరం: గత ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన హామీలను నిలబెట్టుకోలేకపోయారని మాజీ ఎంపీ.. కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య విమర్శించారు. మంగళవారం ఆయన కాకినాడ జిల్లా అన్నవరంలో ప్రజాచార్జిషీట్ పేరుతో 55 అంశాలతో కూడిన ఓ పత్రాన్ని విడుదల చేశారు. మట్టి, ఇసుక, క్వారీ తదితర రంగాల్లో అవినీతి చోటు చేసుకుందని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. గత నాలుగు సంవత్సరాల్లో అరాచకపాలన కొనసాగించారని విమర్శించారు. బొలిశెట్టి సత్యనారాయణ, మల్లినీడి తిరుమలరావు, కరణం కళావతి తదితరులు పాల్గొన్నారు.

‘వైద్య’ నివేదికలను ధ్వంసం చేయట్లేదు

- రఘురామకృష్ణరాజువి నిరాధార ఆరోపణలు
- నివేదికలు భద్రపరచాలని సూపరింటెండెంట్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుకు నిర్వహించిన వైద్య పరీక్షలకు సంబంధించిన నివేదికలను భద్రపరచాలని మంగళవారం గుంటూరు జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు తనకు గుంటూరు జనరల్ ఆస్పత్రి గతంలో నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను భద్రపరిచేలా ఆదేశాలివ్వాలంటూ రఘురామ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ రామకృష్ణప్రసాద్ మంగళవారం విచారణ జరిపారు. ప్రభుత్వ న్యాయవాది బి.శశిభూషణ్‌రావు వాదనలు వినిపిస్తూ, 1980 నుంచి ఇప్పటివరకు రికార్డులన్నీ భద్రంగా ఉన్నాయన్నారు. రికార్డుల ధ్వంసం విషయంలో పిటిషనర్‌వి నిరాధార ఆరోపణలని తెలిపారు. రికార్డులను ధ్వంసం చేయడమనే ప్రశ్నే తలెత్తదన్నారు. ప్రాథమిక వివరాలతో కౌంటర్ దాఖలు చేశామన్నారు. రఘురామరాజు తరఫు న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ స్పందిస్తూ, మెడికల్ బోర్డు ఇచ్చిన నివేదిక ధ్వంసంపై తమకు ఆందోళన లేదన్నారు. వివిధ విభాగాల వైద్యులు ఇచ్చిన నివేదికలను ధ్వంసం చేయబోతున్నారన్నదే తమ ఆందోళన అని తెలిపారు. కౌంటర్‌ను పరిశీలించిన న్యాయమూర్తి.. ఇందులో వైద్యుల నివేదికల గురించిన ప్రస్తావన లేదన్నారు. కోర్టు ఆదేశిస్తే రికార్డులన్నీ ముందుంచుతామని, అందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని శశిభూషణ్ తెలిపారు. రఘురామ లేవనెత్తిన అభ్యంతరాలపై అదనపు వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని సూపరింటెండెంట్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

నేడు వరల్డ్ బ్లడ్ డోనార్ డే

రక్తపు బొట్టు... ప్రాణాన్ని నిలబెడుతుంది.
ఆ రక్తం సమయానికి అందకపోతే...
ప్రాణాన్ని నిలపగలిగే డాక్టర్ కూడా అచేతనం కావాల్సిందే.
శిబి చక్రవర్తిలా దేహాన్ని కోసి ఇవ్వాల్సిన పనిలేదు.
కొంత రక్తాన్ని పంచి మరొక ప్రాణాన్ని నిలబెట్టవచ్చు.
రక్తదానానికి మగవాళ్లతోపాటు మహిళలూ ముందుకొస్తున్నారు.
మహిళలు రక్తదానం చేయరాదనే అపోహను తుడిచేస్తున్నారు.
రక్తదానం చేస్తూ... సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ ఉన్న
ఓ మెడికో... ఓ సోషల్ యాక్టివిస్ట్‌ల పరిచయం ఇది.



నాన్న మాట...

యాభై సార్లు రక్తదానం చేయాలనే సంకల్పం కూడా మా నాన్న చెప్పిన మాటే. రక్తదానం చేయగలిగింది ఇరవై నుంచి అరవై ఏళ్ల మధ్య లోనే. అరవై తర్వాత రక్తదానం చేయడానికి ఆరోగ్యరీత్యా నిబంధనలు ఒప్పుకోవు. వీటికి తోడు ఆడవాళ్లకు ప్రసవాలు, పిల్లల పెంపకంలో మరో పదేళ్లు గడిచిపోతాయి. 35 నుంచి విధిగా రక్తదానం చేస్తూ యాభై సార్లు రక్తం ఇవ్వాలనే నియమాన్ని పెట్టుకోవాలనేవారు. ఆ లక్ష్యంతోనే యాభై రక్తదానాలు పూర్తి చేశాను. ఆ తర్వాత మా అమ్మకోసం మా తమ్ముడితోపాటు నేనూ రక్తం ఇచ్చాను కానీ దానిని ఈ లెక్కలో చెప్ప కోను. అమ్మరుణం ఏమిచ్చినా తీరేది కాదు.

– గొట్టిపాటి నిర్మలమ్మ, రక్తదాత

ప్రాణం నిలిపే రక్తపు బొట్టు

మా పుట్టిల్లు నెల్లూరు నగరం (ఆంధ్రప్రదేశ్). మా చిన్నాన్న జయరామనాయుడు డాక్టర్. 'రక్తం అంది ఉంటే ప్రాణాన్ని కాపాడగలిగేవాళ్లం' అని అనేకసార్లు ఆవేదన చెందేవారు. ఇంట్లో అందరినీ రక్తదానం పట్ల చైతన్యవంతం చేశారాయన. దాంతో మా నాన్న నెల్లూరులో రెడ్‌క్రాస్, బ్లడ్‌బ్యాంకు స్థాపించారు. ఇంట్లో అందరం రక్తదానం చేశాం. అలా నేను తొలి సారి బ్లడ్ డొనేట్ చేసినప్పటికి నా వయసు 20.

■ మామగారి ప్రోత్సాహం

పెళ్లికి ముందు నెల్లూరులో మొదలైన రక్త దాన ఉద్యమాన్ని పెళ్లయి అత్తగారింటికి నెల్లూరు జిల్లా, కావలి పట్టణానికి వెళ్లిన తర్వాత కూడా కొనసాగించాను. నలభై ఏళ్ల కిందట కావలి రక్తదాతల్లో మహిళలు దాదాపు పదిహేను మంది ఉండేవారు. రెడ్‌క్రాస్ సమావేశాలు మా ఇంట్లోనే జరిగేవి. అనేక క్యాంపులు కూడా నిర్వహించేవాళ్లం. కాలేజ్ స్టూడెంట్స్ ఉత్సాహంగా ముందుకు వచ్చేవాళ్లు. కానీ అలా ముందుకొచ్చిన అమ్మాయిల్లో బ్లడ్ తగినంత ఉంటే కదా! వందమంది ఆడపిల్లలు వస్తే రక్తదానం చేయగలిగిన ఎలిజిబులిటీ ఉన్న వాళ్లు ఆరేడుకు మించేవాళ్లు కాదు. అండర్ వెయిట్, హిమోగ్లోబిన్ శాతం తగినంత లేకపోవడం ఎక్కువగా కనిపించేది. అరుదైన గ్రూపుల వాళ్ల నుంచి కూడా బ్లడ్ క్యాంపుల్లో సేకరించేవాళ్లం కాదు. వాళ్లకు పరీక్షలు చేసి లిస్ట్ తయారు చేసుకుని ఎమర్జెన్సీ కండిషన్‌లో పిలుస్తామని చెప్పేవాళ్లం.

■ అప్పట్లో బ్యాంకుల్లేవు

నా వయసు 63. ఈ వయసులో కూడా ఇంత చురుగ్గా, ఆరోగ్యంగా ఉండగలుగుతున్నానంటే అందుకు రక్తదానమే కారణం. ఇప్పుడు బ్లడ్ డొనేషన్‌కు సౌకర్యాలు బాగున్నాయి. కానీ మొదట్లో బ్యాంకులు ఉండేవి కాదు. మా మామగారు మాజీ ఎమ్మెల్యే సుబ్బానాయుడు ప్రోత్సాహంతో మా బంధువులు ముందుకొచ్చి కావలి హాస్పిటల్‌లో రక్త దానం కోసం ఒక గది కట్టించారు. యాక్సిడెంట్ కేస్ రాగానే హాస్పిటల్ నుంచి మాకు ఫోన్ వచ్చేది. అప్పటికప్పుడు మా డోనర్స్‌లో పేషెంట్ బ్లడ్ గ్రూపుతో మ్యాచ్ అయ్యే డోనర్ ఎవరు అందుబాటులో ఉంటే వాళ్లు వెళ్లి రక్తం ఇచ్చేవాళ్లం. బ్లడ్ డోనర్స్ అంతా ఆరోగ్యంగా, అంటువ్యాధుల పట్ల విచక్షణతో ఉండాలి. చిన్నపాటి అనారోగ్యాలు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలన్నీ చేయించుకుని రక్త దానం చేయడానికి సిద్ధంగా ఉండాలి. అవసరాన్ని బట్టి ఏడాదికి మూడు–నాలుగుసార్లు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. మా అమ్మాయి దగ్గరకు యూఎస్‌కి వెళ్లినప్పుడు అక్కడ కూడా ఓ సారి బ్లడ్ డొనేట్ చేశాను. అది అత్యవసర స్థితి కాదు, కేవలం యూఎస్‌లోనూ రక్తమిచ్చాననే సరదా కోసం చేసిన పని. మొత్తానికి అరవై ఏళ్లు నిండేలోపు యాభై సార్లు రక్తం ఇచ్చి మా నాన్న మాటను నెగ్గించాను. ఈ క్రమంలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన మహిళగా గుర్తింపు వచ్చింది.

■ గవర్నర్ అభినందించారు

అప్పటి గవర్నర్ రంగరాజన్, ఆయన సతీమణి హరిప్రియా రంగరాజన్ దంపతులు 2000వ సంవత్సరంలో కావలికి వచ్చారు. ఆమె రెడ్‌క్రాస్‌లో చురుకైన సభ్యురాలు కూడా. రాజ్‌భవన్‌లో జరిగిన రెడ్‌క్రాస్ కార్యక్రమాల్లో కూడా నేను పాల్గొన్నాను. నన్ను కావలిలో చూసి 'ఈ పురస్కారం అందుకుంటున్న నిర్మలవి నువ్వేనా' అని ఆత్మీయంగా పలకరించారు. మహిళలకు మార్గదర్శి అంటూ గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ జ్ఞాపకాలన్నీ నా మనసులో ఉన్నాయి కానీ జ్ఞాపికలుగా దాచుకోవాలనే ఆలోచన కూడా ఉండేది కాదు. నా జీవితం అంతా ఎదురీతలోనే గడిచింది. ఆ ఎదురీతల్లో ఇవేవీ ప్రాధాన్యతాంశాలుగా కనిపించలేదప్పట్లో. మొత్తానికి మా చిన్నాన్న, నాన్న, మామగారు అందరూ బ్లడ్ డొనేషన్ పట్ల చైతన్యవంతంగా ఉండడంతో నాకు ఇంత కాలం ఈ సర్వీస్‌లో కొనసాగడం సాధ్యమైంది. ఇది నాకు సంతోషాన్నిచ్చే కార్యక్రమం కావడంతో ఇంట్లో ఎవరూ అడ్డుచెప్పేవాళ్లు కాదు'' అని తన రక్తదాన ప్రస్థానాన్ని వివరించారు సోషల్ యాక్టివిస్ట్ నిర్మలమ్మ.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

నేను పద్దెనిమిదేళ్ల వయసు నుంచి బ్లడ్ డొనేట్ చేస్తున్నాను. నా హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించుకుంటూ మూడు – నాలుగు నెలలకోసారి ఇచ్చేటట్లు చూసుకుంటున్నాను. ఈ మధ్య హెపటైటిస్ వ్యాక్సిన్ కారణంగా కొంత విరామం వచ్చింది.

మా నాన్న సంపత్‌కుమార్ బ్లడ్ డోనర్ కావడంతో నాకు చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉండేది. రక్తదానానికి మహిళలు, మగవాళ్లు అనే తేడా పాటించక్కర్లేదు. అయితే భారతీయ మహిళల్లో రక్తహీనత ఎక్కువ

రక్తదానం చేద్దాం!

– శృతి కోట, రక్తదాత, వైద్యవిద్యార్థిని

మందిలో ఉంటోంది కాబట్టి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటూ రక్తదానం చేయవచ్చు. హిమోగ్లోబిన్ పన్నెండు శాతానికి తగ్గకూడదు. డయాబెటిస్, పీసీఓడీ, థైరాయిడ్ సమస్యలతోపాటు లాస్ట్ పీరియడ్‌లో రక్త స్రావం స్థాయిలను దృష్టిలో ఉంచుకుని రక్త దానం చేయవచ్చు. పాలిచ్చే తల్లులు రక్త దానం చేయకూడదు. మెనోపాజ్ దశలో ఉన్న వాళ్లు డాక్టర్ సూచన మేరకు ఇవ్వవచ్చు. ఇక మహిళలు, మగవాళ్లు అందరూ రక్తదానం చేయడానికి ముందు చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరించుకోవాలి. ఎయిడ్స్, హెపటైటిస్, మలేరియా, సమీప గతంలో ఏవైనా ఇన్‌ఫెక్షన్‌లకు గురవడం, వ్యాక్సిన్‌లు వేయించుకోవడం, ఇతర అనారోగ్య సమస్యలకు మందులు వాడుతూ ఉండడం వంటి కండిషన్స్‌కు స్క్రీనింగ్ జరిగిన తర్వాత మాత్రమే రక్తాన్ని సేకరిస్తారు. రక్తం ఇవ్వాలనే ఉత్సాహం ఉన్నప్పటికీ తమ దేహ సామర్థ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. బ్లడ్ డోనార్స్ మంచి ఆహారం, తగినంత నీరు తీసుకోవడంతో



పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం కూడా చేస్తుండాలి. రక్తదానం చేస్తుంటే ఎప్పటికప్పుడు కొత్త కణాలు పుట్టుకొస్తూ దేహం ఆరోగ్యంగా ఉంటుంది.

'రక్తాన్ని ఇవ్వండి, ప్రాణాన్ని కాపాడండి' అనేదే మెడికోగా నా సందేశం. ప్రమాదంలో గాయపడిన తొలి గంటను గోల్డెన్ అవర్ అంటాం. ఆ గంటలో వైద్య చికిత్స జరగడం ఎంత అవసరమో వైద్యానికి రక్తం అందుబాటులో ఉండడమూ అంతే అవసరం.



తల్లితో ఇన్షా

న్యూస్ మేకర్

నిరాశ పారిపోయింది

పెల్లెట్ గన్‌లో నుంచి పెల్లెట్స్ గంటకి 1100 కి.మీ వేగంతో ఇన్షా రెండు కళ్లలోకి దూసుకెళ్లాయి. అప్పడా అమ్మాయి 9 చదువుతోంది. 2016లో కశ్మీర్‌లో గుంపును అదుపు చేయడానికి వాడిన పెల్లెట్ గన్స్ అమాయకులకు కూడా శాపంగా మారాయి. ఇన్షా ఓడిపోలేదు. నిరాశ పడలేదు. అంచెలంచెలుగా శ్రమ చేసి చదువుకుంది. మొన్న సీనియర్ ఇంటర్ పరీక్షలలో 500కి 315 మార్కులు సాధించింది. 'నేను ఐ.ఏ.ఎస్ అవుతాను. అంధులకు ఆత్మవిశ్వాసం ఇస్తాను' అంటోంది. అంధులేంటి... ఓటమి భయంతో ఉన్నవారందరూ ఆత్మవిశ్వాసం పొందగలరు ఇన్షాను చూస్తే.

2016.

దక్షిణ కశ్మీర్‌లోని షోపియన్ ప్రాంతంలో సెడొ అనే చిన్న పల్లె. వేసవి కాలం. అల్లర్లు చెలరేగాయి. భద్రతా దళాలు వారిని అదుపు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇంట్లో మొదటి అంతస్తు కిటికీలో నుంచి ఏం జరుగుతున్నదో చూద్దామని 16 ఏళ్ల ఇన్షా ముష్టాక్ కిటికీ తెరిచింది. ఆ తర్వాత ఏమైంది అర్థం కాలేదు. క్షణపాటులో ఆమె రెండు కళ్ల నుంచి రక్తం ధారగా తీసింది. విపరీతమైన నొప్పితో ఇన్షా ఆర్తనాదాలు చేసింది. 2016, 2017... రెండు సంవత్సరాల పాటు భద్రతాదళాలు కశ్మీర్‌లో ప్రయోగించిన పెల్లెట్ గన్స్ వల్ల శాశ్వతంగా అంధులైన వారు 139 మంది. వారిలో ఇన్షా ఒకమ్మాయి.

విఫలమైన డాక్టర్లు

పెల్లెట్లు కళ్లల్లోకి దూసుకెళ్లగానే ఇన్షా చూపు పోయింది. కాని మానవీయ సంస్థలు, ప్రభుత్వం కూడా ఇన్షా చికిత్స కోసం ముందుకు వచ్చింది. ఢిల్లీ ఎయిమ్స్‌లో డాక్టర్లు కూడా ప్రయత్నించి ఆమెకు ఎప్పటికీ చూపు రాదని తేల్చారు. పెల్లెట్లు జీవితాంతం శరీరంలో ఉండిపోతాయి. అవి చాలా ప్రమాదం. 'అయితే అంతకన్నా ప్రమాదం నిరాశలో కూరుకుపోవడం అని నాకు తెలుసు. నేను చదువుకోవాలనుకున్నాను. నా కంటే ముందు మా అమ్మ అఫ్రోజా, డ్రైవర్‌గా జీవితం గడిపే మా నాన్న ముష్టాక్ అహ్మద్ లోన్ నేను చదువుకోవాలని భావించారు. మరో రెండేళ్ల తర్వాత ఒక లేఖకుని సహాయంతో నేను టెన్త్ పాసయ్యాను' అని తెలిపింది ఇన్షా.



ఇన్షా

బ్రెయిలీ నేర్చుకుని...

అయితే ఇంటర్ మాత్రం బ్రెయిలీ నేర్చుకుని పరీక్షలు రాసి పాసవ్వాలని నిశ్చయించుకుంది ఇన్షా. ఇందు కోసం శ్రీనగర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జాయిన్ అయ్యింది. ఇంటర్‌తో పాటు కంప్యూటర్ కోర్సు, ఇంగ్లిష్ స్పీకింగ్ కోర్సు కూడా నేర్చుకుంది. బ్రెయిలీ ద్వారా పాఠాలు నేర్చుకుని పరీక్షలు రాయడం చాలా కష్టమయ్యేది. అయినా సరే ఇన్షా ఆగలేదు. 2011లో ఫస్ట్ ఇయర్ ఇంటర్ పూర్తి చేసింది. ఈ సంవత్సరం సెకండ్ ఇయర్ ఇంటర్ ఏ గ్రేడ్‌లో పాసయ్యింది. 'చదువు ఒక్కటే నాకు స్వేచ్ఛ, స్వతంత్రం ఇవ్వగలదు. అది నాకు తెలుసు. ఐ.ఏ.ఎస్ చేయాలనుకుంటున్నాను. అంధులకు మన దేశంలో తగినన్ని ప్రత్యేకమైన స్కూల్స్ లేవు. ఆ విషయంలో నేను కృషి చేస్తాను' అని తెలిపింది ఇన్షా.

సానుభూతి ఇష్టపడదు

ఇంటర్ పాసయ్యిందని తెలిశాక ఆమె తల్లిదండ్రులు ఉద్వేగంతో కన్నీరు కార్చారు. తండ్రి, తల్లి తమ కూతురి పట్టుదలకు గర్వపడ్డారు. ఇన్షా కూడా తన విజయంతో సంతోషంగా ఉంది. జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, హోమ్ మినిస్ట్రీ అధికారులు ఆమెను మెచ్చుకున్నారు. మంచి కాలేజీలో చదువు కొనసాగడానికి హామీలు దొరికాయి. ఉత్సాహపరిచే వాళ్లను తప్ప సానుభూతి చూపించేవాళ్లను ఇన్షా ఇష్టపడదు. 'నేను అందరితో సమానంగా జీవించగలను. నాకు సానుభూతి చూపకండి. వీలైతే నా ప్రయాణంలో తోడు నిలవండి' అంటోందామె.

కాళ్లు లేకపోయినా రెక్కలున్నాయ్!



నేహ

ప్రమాదంలో కాలు పోగొట్టుకొని, తల్లిదండ్రులకు భారమై, లోకమంతా శూన్యంలా అనిపించిన రోజుల నుంచి తేరుకొని, అహ్మదాబాద్‌లో 'ఆంప్ టీ నేహా' పేరుతో టీ స్టాల్ ప్రారంభించి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది నేహ. మోటివేషనల్ స్పీకర్‌గానూ తన జీవన అనుభవాలను చెబుతోంది. ఆంప్ టీ కి దేశవ్యాప్త గుర్తింపు తేవడానికి కృషి చేస్తోంది. ఓడిపోయిన రోజుల నుంచి ఒంటికాలితో గెలవడానికి చేస్తున్న ప్రయత్నాలను ఏ మాత్రం వెనకడుగు వేయకుండా వివరిస్తుంది నేహ.

''మాది ఉమ్మడి కుటుంబం. అమ్మ,నాన్న, ఇద్దరు అన్నదమ్ములు. నాన్న ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. గుజరాత్‌లోని భవానీ నగర్‌లో పుట్టి పెరిగాను. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కాలేజీ చదువు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. ఓ చిన్న ప్రైమరీ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం వెతుక్కొని, కొన్నాళ్లు గడిపాను. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం ఉండేది. కానీ, ఇంటి ఆర్థిక పరిస్థితుల కారణంగా కాలక్రమంలో అన్ని ఇష్టాలను వదులుకుంటూ రావాల్సి వచ్చింది. ఇలాగే ఉంటే నా కలల రెక్కలు విప్పుకోలేననిపించింది. ఉద్యోగంతో పాటు కాలేజీలో చదువుకోవడానికి అడ్మిషన్ తీసుకున్నాను. ఉదయం టీచర్‌గా చేస్తూ, సాయంత్రం కాలేజీలో చదువుకునేదాన్ని. స్కూల్లో పాఠాలు చెబుతూనే నా బలహీనతల గురించి కూడా తెలుసుకున్నాను. నేను ముందుకు వెళ్లాలంటే నా బలహీనతలపై పనిచేయడం నేర్చుకోవాలి అని అనుకున్నాను. కొంత కాలం అంతా బాగానే జరిగింది. కానీ, కాలంతో పాటు డబ్బు అవసరం కూడా పెరగడం మొదలైంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి అహ్మదాబాద్ వెళ్లాలని నిర్ణయించుకున్నాను. 2012లో అహ్మదాబాద్ వచ్చి, కాల్‌సెంటర్‌లో పనిచేశాను. ఎన్నో ప్రయత్నాల తర్వాత మళ్లీ టీచర్ జాబ్ సంపాదించుకున్నాను. ఎక్కువ మొత్తంలోనే నెల జీతం వచ్చేది.

■ కల చెరిపిన ప్రమాదం

అంతా బాగుంది అనుకున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాను. ట్రీట్‌మెంట్ తీసుకోవడంలో జాప్యం కావడంతో కాలు తీసేయాల్సి వచ్చింది. దాంతో తీవ్ర నిరాశతో డిప్రెషన్‌కు గురయ్యాను. దీని నుంచి కోలుకోవడానికి చాలా కాలం పట్టింది. కృత్రిమ కాలు ఏర్పాటయ్యాక నాలో మళ్లీ ఆశలు చిగురించాయి.

■ స్నేహితుల సహకారంతో..

ధైర్యం తెచ్చుకొని, ముందున్న జీవితం గురించి ఆలోచించాను. టీ అంటే నాకు చాలా ఇష్టం. దీంతో మా ఇంట్లో వాళ్లకి ఓ కేఫ్ తెరుస్తానని చెప్పాను. కానీ, నా ట్రీట్‌మెంట్‌కి అప్పటికే చాలా ఖర్చయింది. షాప్ అద్దెకు తీసుకునేంత డబ్బు నా దగ్గర లేదు. మా బంధువులు ఎవరూ సపోర్ట్ ఇచ్చేవారు లేరు. కానీ, నా స్నేహితుల సహకారంతో టీ స్టాల్ ప్రారంభించాను. టీ స్టాల్‌కు షార్ట్ మీదనే వెళ్లేదాన్ని. చాలా మంది నా డ్రెస్ గురించి కూడా తిట్టేవారు. 'కాలు లేదు, పైగా నలుగురు తిరిగే చోట ఇలా షార్ట్స్ వేసుకొని తిరుగుతావా? బుద్ధిలేదా' అనేవారు. ఈ వెక్కిరింపులు బాధ కలిగించేవి. కానీ, నాకు నేను బలంగా ఉన్నాను అని తెలుసు. వాస్తవికతను అంగీకరించాను. నేను ధరించిన డ్రెస్ నాకేమీ ఎబ్బెట్టుగా లేదు. పైగా అందరూ అంతగా తిట్టుకోవాల్సిన అవసరమూ లేదు. నా పని ద్వారానే సమాధానం చెబుతాను అనుకునేదాన్ని.

■ టీ స్టాల్ వైరల్

'కాళ్లు లేకపోయినా రెక్కలున్నాయి' అని నాకు నేనే చెప్పుకుంటూ 'ఆంప్ టీ నేహా' పేరుతో టీ స్టాల్ నడపడం మొదలుపెట్టాను. విజయం సాధిస్తానని కచ్చితంగా తెలుసు. కానీ, ప్రజల నుండి ఇంత ప్రేమను పొందుతానని తెలియదు. కేవలం పది రోజులలో నా టీ స్టాల్ వద్ద జనం గుమిగూడటం ప్రారంభించారు. ఫుడ్ బ్లాగర్లు నా గురించి రాసి, ప్రచారం చేశారు. నా టీ స్టాల్‌ను బ్రాండ్‌గా మార్చాలని పోరాడుతున్న వీడియో ఒకటి తెగ వైరల్ అయ్యింది. కొద్ది రోజుల తర్వాత కొందరు అధికారులు నా స్టాల్ దగ్గరకు వచ్చి, ఇది అక్రమమని, తొలగిస్తామన్నారు. నేను వారితో చాలా పోరాడాను. ఎవరో తీసిన ఆ వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఎంతోమంది తమ ప్రేమతో నాకు మద్దతు తెలిపారు. ఇక నేను వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేకుండా పోయింది. 'ఆంప్ టీ నేహా'ని మంచి బ్రాండ్‌గా మార్చి నాలాంటివారికి ఓ మార్గం చూపాలన్న నా కలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాను' అని చెబుతోంది నేహ.



టీ తయారుచేస్తున్న నేహ

కిచెన్‌టిప్


మిగిలిపోయిన చపాతీ, బ్రెడ్‌స్లైసులు గట్టిగా అయిపోయి తినడానికి పనికిరావు. వీటిని ప్లేటులో పెట్టి, ఈ ప్లేటులోనే అరగ్లాసు నీటిని కూడా ఉంచి, మైక్రోవేవ్‌లో పదినిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల నీళ్ల ఆవిరిగా మారి చపాతి, బ్రెడ్‌స్లైసులు మెత్తబడి, అప్పుడే చేసిన వాటిలా తాజాగా ఉండి, తినడానికి పనికొస్తాయి.



యూత్ పల్స్

యువతరంలో చాలామంది... తమ క్రియేటివ్ స్కిల్స్‌ను అభిరుచికి మాత్రమే పరిమితం చేసుకోవడం లేదు. ధైర్యంగా ఒక అడుగు ముందుకు వేసి ఆసక్తి, అభిరుచులనే కెరీర్ ఛాయిస్‌గా తీసుకుంటున్నారు. కాపీరైటర్ కావాలనే కల కూడా అందులో ఒకటి. 'మేకిట్ సింపుల్. మేకిట్ మెమొరబుల్' 'రైట్ వితౌట్ ఫియర్. ఎడిట్ వితౌట్ మెర్సీ'... లాంటి మాటలను గుండెలో పెట్టుకొని తమ కలల తీరం వైపు కదులుతున్నారు...

కమ్మని కాఫీలాంటి కళ



పశ్చిమ బెంగాల్‌లోని చిన్న పట్టణం నుంచి తన కలల తీరమైన ముంబైకి వచ్చింది అనూష బోస్. మాస్ కమ్యూనికేషన్‌లో పట్టా పుచ్చుకున్న అనూష ఒక అడ్వర్‌టైజింగ్ కంపెనీలో చేరింది. జింగిల్స్, డైలాగులు రాయడంలో తనదైన శైలిని సృష్టించుకుంది. మూడురోజుల్లో రాసే టైమ్ దొరికినా కేవలం 30 సెకండ్లలో మాత్రమే రాసే అవకాశం ఉన్నా... ఎక్కడా తడబాటు ఉండకూడదనేది తన ఫిలాసఫీ. 'ఇండస్ట్రీలో నేను కూడా ఒకరిని అనుకోవడం కాదు. మనలోని ప్రత్యేకత గురించి ఇండస్ట్రీ మాట్లాడుకునేలా క్రియేటివిటీకి సానబట్టాలి' అంటుంది సీనియర్ కాపీ రైటర్ అయిన అనూష బోస్.

ట్రైనీ కాపీరైటర్‌గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది ముంబైకి చెందిన ఆకృతి బన్సాల్. చిన్నప్పటి నుంచి తనకు టీవీలో వచ్చే యాడ్స్ అంటే ఇష్టం. ఆ ఇష్టమే తనని అడ్వర్‌టైజింగ్ ఫీల్డ్‌కు తీసుకువచ్చింది. అది ఏ వ్యాపారానికి సంబంధించినది అనేదానికంటే ఆ యాడ్ వెనుక ఉన్న ఐడియా తనకు బాగా నచ్చేది. 'హోం సైన్స్' చదువుకున్న ఆకృతికి 'ఎడ్వర్‌టైజింగ్ అండ్ పబ్లిక్‌రిలేషన్' ఒక సబ్జెక్ట్‌గా ఉండేది. ఆ సబ్జెక్ట్ ఇష్టంగా చదువుకున్న తరువాత 'ఈ రంగంలో నేను ప్రయత్నించవచ్చు' అనుకుంది. ఫీల్డ్‌కు వచ్చిన తరువాత ప్రతిరోజు, ప్రతి డెడ్‌లైన్‌ను ఒక సవాల్‌గా స్వీకరించింది. 'చాలెంజ్ ఉన్నప్పుడే మజా ఉంటుంది' అంటుంది ఆకృతి బన్సాల్. మరి ఆమె భవిష్యత్ లక్ష్యం ఏమిటి? 'ప్రతిష్ఠాత్మకమైన ఎడ్వర్‌టైజింగ్ అవార్డ్ తీసుకోవాలి లేదా నా తల్లిదండ్రులు రోడ్డు ప్రయాణం చేస్తున్నప్పుడు వారికి నచ్చిన యాడ్ హోర్డింగ్ నేను రాసినదై ఉండాలి' అంటుంది ఆకృతి బన్సాల్.

రాధిక నాగ్‌పాల్ టీనేజ్ నుంచి పుస్తకాల పురుగు. భాషలోని సొగసు అంటే ఇష్టం. రాధిక జర్నలిజం కోర్స్ చేసింది. అందులో ఒక సబ్జెక్ట్ అయిన ఎడ్వర్‌టైజింగ్ తనకు బాగా నచ్చింది.


రాధిక ఇప్పుడు 'సోషియోవాష్'లో సీనియర్ కాపీ రైటర్.

'యాడ్ ఏజెన్సీలో పనిగంటలు అంటూ ఉండవు. కాలంతో పరుగెత్తాల్సిందే. బ్రాండ్‌ను అర్థం చేసుకోవడంతో పాటు క్లయింట్ ఆశిస్తున్నది ఏమిటి? ఆడియెన్స్‌ను వేగంగా ఎలా చేరుకోవాలి? అనే దానిపై అవగాహన ఉండాలి. మనం చెప్పదల్చుకున్నది సింగిల్ లైన్‌లోనే క్యాచీగా చెప్పగలగాలి' అంటుంది రాధిక.

'విస్తృతంగా చదవాలి. గత అనుభవాల నుంచి రెఫరెన్స్ తీసుకోవడానికి ఎంతో ఉంది' అనేది ఔత్సాహిక కాపీరైటర్‌లకు రాధిక ఇచ్చే సలహా. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన అంజు న్యూస్‌పేపర్లలో వచ్చే ఎడ్వర్‌టైజింగ్‌లను ఫైల్ చేస్తుంటుంది. ఆమె ఎన్నోసార్లు చదివిన పుస్తకం క్లాడ్ సీ.హాప్‌కిన్స్ రాసిన సైంటిఫిక్ ఎడ్వర్‌టైజింగ్ (1923). ఈ పుస్తకంలోని సరళమైన భాష అంటే అంజుకు ఇష్టం. 'జస్ట్ సేల్స్‌మన్‌షిప్' 'ఆఫర్ సర్వీస్' 'హెడ్ లైన్స్' 'బీయింగ్ స్పెసిఫిక్' 'ఆర్ట్ ఇన్ ఎడ్వర్‌టైజింగ్' 'టెల్ యువర్ ఫుల్‌స్టోరీ' 'ఇన్‌ఫర్మేషన్' 'స్ట్రాటజీ' 'నెగెటివ్ రైటింగ్'... మొదలైన చాప్టర్ల గురించి అనర్గళంగా మాట్లాడగలదు.

అంజు భవిష్యత్ లక్ష్యం 'కాపీ రైటర్' అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు!

మన ప్రత్యేకతే మన శక్తి



ఇండస్ట్రీలో నేను కూడా ఒకరిని అనుకోవడం కాదు. మనలోని ప్రత్యేకత గురించి ఇండస్ట్రీ మాట్లాడుకునేలా క్రియేటివిటీకి సాన పట్టాలి.

– ఆకృతి బన్సాల్, కాపీ రైటర్

ఒక ఐడియా... వెయ్యి ఏనుగుల బలం



ఒక ఐడియా స్ట్రైక్ అయ్యేవరకు మనసులో భయంగా ఉంటుంది. తళుక్కుమని ఒక ఐడియా మెరిసిందా...ఇక అంతే. వెయ్యి ఏనుగుల బలం దరి చేరుతుంది! క్రియేటివ్ బ్లాక్స్ రాకుండా ఉండడానికి పుస్తకాలు చదువుతాను. నచ్చిన పుస్తకాలు మళ్లీ చదువుతాను.

– రాధిక నాగ్‌పాల్, సీనియర్ కాపీ రైటర్

వీరు కూడా...

ప్రముఖ సినీ నటి రాశీఖన్నా న్యూ ఢిల్లీ, లేడీ శ్రీరామ్ కాలేజీ స్టూడెంట్. కాలేజీ రోజుల నుంచి చదవడం రాయడం అంటే ఇష్టం. కాపీరైటర్ కావాలనేది తన కల. కలను నిజం చేసుకోవడానికి ముంబైకి వెళ్లింది. అయితే సినిమాల్లో అవకాశాలు రావడంతో తన రూట్ మారింది. కాపీరైటర్ కాబోయి యాక్టర్ అయిందన్నమాట! సినిమారంగంలో ఉన్నప్పటికీ గుడ్ కాపీరైటింగ్ కోసం వెదుకుతుంది. బాలీవుడ్ హీరో రణవీర్‌సింగ్ కాలేజీ చదువు పూర్తికాగానే ఒక యాడ్ ఏజెన్సీలో కాపీరైటర్‌గా కెరీర్ మొదలుపెట్టాడు. ఇప్పటికీ చిన్న చిన్న రచనలు చేస్తుంటాడు.



రణవీర్‌సింగ్



రాశీఖన్నా



అమెరికాలో శిక్షణకు మీరాబాయి చాను

ఆసియా క్రీడల సన్నాహాల్లో భాగంగా భారత స్టార్ మహిళా వెయిట్‌లిఫ్టర్లు మీరాబాయి చాను, బింద్యారాణి దేవి అమెరికాలో శిక్షణ తీసుకోనున్నారు. ఈ మేరకు వీరిద్దరికయ్యే ఖర్చులను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ భరిస్తుంది. 65 రోజులపాటు సెయింట్ లూయిస్‌లో మీరాబాయి, బింద్యారాణి శిక్షణ తీసుకుంటారు. వీరిద్దరి వెంట చీఫ్ కోచ్ విజయ్ శర్మ, ఫిజియోథెరపిస్ట్ తస్నీమ్ వెళతారు. మీరాబాయి టోక్యో ఒలింపిక్స్‌లో, బింద్యారాణి 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకాలు గెలిచారు.



భారత రెజ్లర్లకు పది పతకాలు

ఆసియా అండర్-17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు పది పతకాలతో అదరగొట్టారు. కిర్గిస్తాన్‌లో జరిగిన ఈ టోర్నీలో భారత్ టీమ్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. అంకుశ్ (55 కేజీలు) స్వర్ణ పతకం సాధించాడు. ధన్‌రాజ్ (45 కేజీలు), రూపేశ్ (48 కేజీలు), రోహిత్ (51 కేజీలు), సౌరభ్ యాదవ్ (80 కేజీలు) రజత పతకాలు నెగ్గారు. తుషార్ (60 కేజీలు), సౌరభ్ (65 కేజీలు), నరేందర్ (71 కేజీలు), వినయ్ (92 కేజీలు), జస్‌పూరణ్ (110 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు.

క్వార్టర్స్‌లో బోపన్న జోడీ



స్టుట్‌గార్ట్ (జర్మనీ): బాస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-0, 6-3తో రొమైన్ అర్నియోడో (మొనాకో)-గ్రెగొరి బరెరే (ఫ్రాన్స్) జోడీపై విజయం సాధించింది. కేవలం 40 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ ఆరు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

భారత్ ఘనవిజయం

చెన్నై: ప్రపంచకప్ స్క్వాష్ మిక్స్‌డ్ టీమ్ టోర్నమెంట్‌లో భారత్ భారీ విజయంతో బోణీ కొట్టింది. హాంకాంగ్ జట్టుతో మంగళవారం జరిగిన పూల్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-0తో గెలిచింది. తొలి మ్యాచ్‌లో అభయ్ సింగ్ 7-2, 7-3, 7-6తో చుంగ్ యాట్ లాంగ్‌ను ఓడించగా... రెండో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 7-1, 7-5, 7-6తో హేలీ ఫుంగ్‌పై నెగ్గడంతో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌లో సౌరవ్ ఘోషాల్ 5-7, 7-2, 7-5, 7-1తో టు యు లింగ్‌పై గెలవడంతో భారత విజయం ఖరారైంది. చివరిదైన నాలుగో మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 5-7, 6-7, 7-1, 7-4, 7-3తో సె యె లామ్ టోబీపై నెగ్గడంతో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో ఈజిప్ట్ 4-0తో ఆస్ట్రేలియాపై, జపాన్ 3-1తో దక్షిణాఫ్రికాపై గెలిచాయి.


జోష్నా

సింధు శుభారంభం

- 38 నిమిషాల్లో ఇండోనేసియా ప్లేయర్ మరిస్కాపై గెలుపు
- ప్రణయ్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి
- గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి నిరాశ



జకార్తా: థాయ్‌లాండ్ ఓపెన్, సింగపూర్ ఓపెన్ టోర్నీలలో తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు... ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో మాత్రం తొలి రౌండ్ అడ్డంకిని దాటింది. ఇండోనేసియా క్రీడాకారిణి, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్‌పై సింధు వరుస గేముల్లో గెలిచింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ సింధు 21-19, 21-15తో మరిస్కాను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. 38 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధుకు తొలి గేమ్‌లో గట్టిపోటీ లభించింది. ఆధిక్యం పలుమార్లు ఇద్దరితో దోబూచులాడింది. అయితే కీలకదశలో సింధు పైచేయి సాధించి తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్ ఆరంభంలోనూ ఇద్దరూ ప్రతి పాయింట్‌కు హోరాహోరీగా పోరాడారు. సింధు స్కోరు 7-6 వద్ద మూడు పాయింట్లు నెగ్గి 10-6తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఒక పాయింట్ కోల్పోయిన సింధు మళ్లీ చెలరేగి ఈసారి వరుసగా ఆరు పాయింట్లు గెలుపొంది 16-7తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని సింధు విజయాన్ని ఖరారు చేసుకుంది. ఈ ఏడాది మరిస్కా చేతిలో స్పెయిన్ మాస్టర్స్, మలేసియా మాస్టర్స్ టోర్నీలలో ఓడిపోయిన సింధు ఆమెను ఈ సీజన్‌లో తొలిసారి ఓడించడం గమనార్హం. ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధుకు అగ్ని పరీక్ష ఎదురుకానుంది. ప్రపంచ మూడో ర్యాంకర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో సింధు తలపడనుంది. తై జు యింగ్‌తో ముఖాముఖి రికార్డులో సింధు 5-18తో వెనుకబడి ఉంది. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చివరిసారి తై జు యింగ్‌ను ఓడించిన సింధు ఆ తర్వాత ఈ చైనీస్ తైపీ ప్లేయర్‌తో ఆడిన ఎనిమిది వరుస మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో ప్రణయ్ 50 నిమిషాల్లో 21-16, 21-14తో కెంటా నిషిమోటో (జపాన్)పై గెలుపొందాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఎన్జీ కా లాంగ్ అంగస్ (హాంకాంగ్)తో ప్రణయ్ ఆడతాడు. ముఖాముఖి రికార్డులో ప్రణయ్, అంగస్ 5-5తో సమఉజ్జీగా ఉన్నారు.

సాత్విక్ జోడీ ముందంజ

డబుల్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా... పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రపంచ 16వ ర్యాంక్ జంట గాయత్రి-ట్రెసా జాలీ 22-20, 12-21, 16-21తో ప్రపంచ 18వ ర్యాంక్ జోడీ రిన్ ఇవనాగ-కి నకనిషి (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. క్రిస్టో పొపోవ్-తోమా పొపోవ్ (ఫ్రాన్స్)లతో జరిగిన మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి తొలి గేమ్‌ను 21-12తో నెగ్గి రెండో గేమ్‌లో 11-7తో ఆధిక్యంలో ఉన్న దశలో పొపోవ్ బ్రదర్స్ గాయం కారణంగా వైదొలిగారు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో ధ్రువ్ కపిల-ఎంఆర్ అర్జున్ (భారత్) ద్వయం 21-12, 6-21, 20-22తో ఎనిమిదో సీడ్ ఒన్గ్ యె సిన్-తియో ఈ యి (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

శ్రేయాంక 3-1-2-5

- భారత స్పిన్నర్ మాయాజాలం
- 9 వికెట్లతో టీమిండియా విజయం
- ఆసియా మహిళల ఎమర్జింగ్ కప్ టోర్నీ




మోంగ్‌కాక్ (హాంకాంగ్): ఆసియా మహిళల ఎమర్జింగ్ కప్ అండర్-23 టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత 'ఎ' జట్టు శుభారంభం చేసింది. శ్వేత సెహ్రావత్ కెప్టెన్సీలోని భారత జట్టు గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో హాంకాంగ్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్‌ను భారత ఆఫ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ దెబ్బ తీసింది. శ్రేయాంక మాయాజాలానికి హాంకాంగ్ 14 ఓవర్లలో 34 పరుగులకే కుప్పకూలింది. బెంగళూరుకు చెందిన 20 ఏళ్ల శ్రేయాంక 3 ఓవర్లు వేసి 2 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టింది. శ్రేయాంక వేసిన మూడు ఓవర్లలో ఒక మెయిడిన్ ఓవర్ కూడా ఉండటం విశేషం. హాంకాంగ్ జట్టులో ఓపెనర్ మరికో హిల్ (19 బంతుల్లో 14; 2 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. మిగత బ్యాటర్లెవరూ రెండంకెల స్కోరు దాటలేకపోయారు. నలుగురు బ్యాటర్లు ఖాతా తెరువలేదు. భారత స్పిన్నర్లలో మన్నత్ కశ్యప్ (2/2), పార్శవి చోప్రా (2/12) కూడా రాణించారు. అనంతరం భారత జట్టు 5.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 38 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ శ్వేత సెహ్రావత్ (2) తక్కువ స్కోరుకే అవుటవ్వగా... హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష (13 బంతుల్లో 19 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), ఉమా చెత్రీ (15 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు) మిగతా పనిని పూర్తి చేశారు. గురువారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో నేపాల్‌తో భారత్ ఆడుతుంది.

హారికకు ఆరో స్థానం



సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిర్న్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఆరో స్థానంలో నిలిచింది. తొమ్మిది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణల మధ్య ఎనిమిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హారిక మూడున్నర పాయింట్లు స్కోరు చేసింది. ఒకగేమ్‌లో నెగ్గిన హారిక, రెండు గేముల్లో ఓడిపోయి, మిగతా ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. బెలా ఖొటెనాష్‌విలి (జార్జియా)తో జరిగిన చివరి రౌండ్ గేమ్‌ను హారిక 35 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. అమెరికాకు చెందిన అనా జటోన్‌స్కీ ఆరు పాయింట్లతో చాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నీ పది మంది క్రీడాకారిణులతో మొదలైనా నాలుగో రౌండ్ తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి అస్వస్థత కారణంగా వైదొలిగింది. దాంతో హంపితో జరిగిన నాలుగు రౌండ్ల ఫలితాలను నిర్వాహకులు రద్దు చేసి తొమ్మిది మందితో టోర్నీని కొనసాగించారు. అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్; 5 పాయింట్లు) రన్నరప్‌గా నిలువగా... బెలా ఖొటెనాష్‌విలి మూడో స్థానంలో, ఇరీనా క్రష్ (అమెరికా) నాలుగో స్థానంలో, నానా జాగ్‌నిడ్జె (జార్జియా) ఐదో స్థానంలో నిలిచారు. విజేత అనా జటోన్‌స్కీకి 45 వేల డాలర్లు (రూ. 37 లక్షలు), ఆరో ర్యాంకర్ హారికకు 10 వేల డాలర్లు (రూ. 8 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

రణ్‌ధావా రాజీనామా



న్యూఢిల్లీ: భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) సెలెక్షన్ కమిటీ చైర్మన్ పదవికి గుర్‌బచన్ సింగ్ రణ్‌ధావా రాజీనామా చేశారు. గత 18 ఏళ్లుగా ఆయన ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వయసు భారం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు 84 ఏళ్ల రణ్‌ధావా వివరించారు. 1962 ఆసియా క్రీడల్లో డెకాథ్లాన్‌లో స్వర్ణ పతకం నెగ్గిన రణ్‌ధావా, 1964 టోక్యో ఒలింపిక్స్‌లో 110 మీటర్ల హర్డిల్స్‌లో ఐదో స్థానంలో నిలిచారు. 'వయసు పైబడటంతో వందశాతం నా బాధ్యతలు నిర్వహించలేకపోతున్నాను. అందుకే నా పదవికి రాజీనామా చేస్తున్నాను. భారత అథ్లెటిక్స్‌కు మంచి రోజులు వచ్చాయి. నీరజ్ చోప్రా రూపంలో మనకూ ఒక ఒలింపిక్ చాంపియన్ లభించాడు' అని రణ్‌ధావా పేర్కొన్నారు. 1964 టోక్యో ఒలింపిక్స్‌లో భారత బృందానికి పతాకధారిగా వ్యవహరించిన రణ్‌ధావాకు 1961లో 'అర్జున అవార్డు'... 2015లో 'పద్మశ్రీ' పురస్కారం లభించాయి.

వచ్చే నెల 6న భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు జూలై 6వ తేదీన నిర్వహిస్తారు. అదే రోజున ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం నియమించిన ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ మహేశ్ మిట్టల్ కుమార్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 23 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 28న వాటిని పరిశీలిస్తారు. జూలై 2న ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు.

సినిమా

ముల్లోక వీరుడు


చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్' ఆగస్టులో విడుదల కానుంది. ఈ చిత్రం తర్వాత చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుందని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందట. ఈ చిత్రానికి 'ముల్లోక వీరుడు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని భోగట్టా. అంతే కాదు.. ఈ చిత్రంలో ఆరుగురు కథానాయికలు ఉంటారని, ఊహాత్మక స్వర్గం నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. మరోవైపు దర్శకుడు కల్యాణ్ కృష్ణ కథకు చిరంజీవి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని టాక్.

నా ప్రపంచాన్ని అర్థం చేసుకున్నాడు

– తమన్నా


విజయ్ వర్మ


తమన్నా

నటుడు విజయ్ వర్మ, హీరోయిన్ తమన్నా ప్రేమలో ఉన్నారంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడారు. ''కో యాక్టర్‌తో కలిసి యాక్ట్ చేసినంత మాత్రాన అతనిపై ఆకర్షణ ఏర్పడుతుందంటే నేను నమ్మను. అలా అనుకుంటే నేను చాలామంది యాక్టర్స్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నాను. ఏదైనా మనం వ్యక్తిగతంగా ఫీలవ్వాలి. మన మనసుకు అనిపించాలి. ఇక విజయ్ వర్మతో నా బాండింగ్ చాలా సహజంగా మొదలైంది. ఇలాంటి వ్యక్తి కోసమే నేను ఎదురు చూశాను. జీవితంలో చాలా సాధించిన నాలాంటి వారికి ప్రతిదానికీ చాలా కష్టపడాలనే ఫీలింగ్ ఉంటుంది. అలాగే ఒక వ్యక్తి కోసం భారతీయ స్త్రీలు తమ జీవితం మొత్తం మార్చుకోవాలనే ఒక ఆలోచన ఉంటుంది. జీవిత భాగస్వామిని పొందాలంటే అతను ఉన్న చోటుకి వెళ్లాలి.. లేదా అతన్ని అర్థం చేసుకుని అందుకు తగ్గట్టుగా మసులుకోవాలి. కానీ నేను నాదైన ప్రపంచాన్ని సృష్టించుకున్నాను. నేనేం చేయకుండానే ఆ ప్రపంచాన్ని అర్థం చేసుకున్న వ్యక్తి (విజయ్ వర్మను ఉద్దేశించి).. చాలా కేర్ తీసుకునే వ్యక్తి. అతను ఉన్న చోటు నాకు ఆనందంగా ఉంటుంది'' అని చెప్పుకొచ్చారు తమన్నా. దీంతో విజయ్ వర్మతో ప్రేమను తమన్నా పరోక్షంగా కన్ఫార్మ్ చేశారని నెటిజన్లు అంటున్నారు. ఇక తమన్నా నటించిన లేటెస్ట్ వెబ్ ఆంథాలజీ 'లస్ట్ స్టోరీస్ 2'లో విజయ్ వర్మ నటించారు. ఈ ఆంథాలజీ షూటింగ్ సమయంలోనే విజయ్, తమన్నా ప్రేమలో పడి ఉంటారనే ఊహాగానాలు ఉన్నాయి.

మంగళవారం పూర్తి


పాయల్ రాజ్‌పుత్

'ఆర్‌ఎక్స్ 100' వంటి హిట్ మూవీ తర్వాత అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ నటించిన చిత్రం 'మంగళవారం'. స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా అజయ్ భూపతి మాట్లాడుతూ– ''గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. ఈ సినిమాలో మొత్తం 30 పాత్రలు ఉండగా, ప్రతి పాత్రకు ప్రాముఖ్యం ఉంటుంది'' అన్నారు. స్వాతి రెడ్డి గునుపాటి మాట్లాడుతూ–''ఇప్పటివరకు రానటువంటి కొత్త జానర్ కథతో 'మంగళవారం'ఉంటుంది. ఈ సినిమా షూటింగ్ 99 రోజులు చేస్తే.. అందులో 51 రోజులు రాత్రి వేళల్లో చిత్రీకరణ చేశాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రం విడుదల తేదీ, ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు.

జూలైలో బేబీ


ఆనంద్ దేవరకొండ, వైష్ణవి

ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. సాయి రాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని జూలై రెండోవారంలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓ వాస్తవ ఘటన ఆధారంగా రూపొందించిన ఈ చిత్రానికి సహనిర్మాత: ధీరజ్ మొగిలినేని, సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: బాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దాసరి వెంకట సతీష్.

మనుచరిత్ర పెద్ద హిట్ అవుతుంది

– హీరో విశ్వక్ సేన్


శివ కందుకూరి, మేఘా ఆకాష్, విశ్వక్ సేన్

''లవ్, యాక్షన్ నా ఫేవరెట్ జోనర్. 'మనుచరిత్ర' అదే జానర్‌లో రూపొందినట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. మంచి నటీనటులు, సాంకేతిక నిపుణులు పని చేసిన ఈ సినిమా కచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. శివ కందుకూరి హీరోగా, మేఘా ఆకాష్, ప్రియా వడ్లమాని, ప్రగతి శ్రీవాత్సవ్ కథానాయికలుగా నటించిన చిత్రం 'మనుచరిత్ర'. భరత్ పెదగాని దర్శకత్వంలో ఎన్. శ్రీనివాస రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న శ్రీ విజయ ఫిల్మ్స్ ద్వారా విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''రాజ్ కందుకూరిగారికి శివ ఎంతో.. నేనూ అంతే. శివ సినిమా హిట్ అయితే నా సినిమా హిట్ అయినంత ఆనందపడతాను'' అన్నారు. ''మా సినిమా ఎవర్నీ నిరాశ పరచదు'' అన్నారు శివ కందుకూరి. ''మా సినిమాకి ప్రేక్షకుల ఆదరణ కావాలి'' అన్నారు భరత్. ''మనుచరిత్ర'ని థియేటర్‌లో చూసి మమ్మల్ని ప్రోత్సహించాలి'' అన్నారు మేఘా ఆకాష్. ''మీ అందరికీ ఈ సినిమా నచ్చుతుంది'' అన్నారు నిర్మాత రాజ్ కందుకూరి.

విజయ్‌కి జోడీగా..?


మృణాల్

'సీతారామం' సినిమాలో మంచి నటనను కనబరిచి తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్. దీంతో ఈ బ్యూటీకి తెలుగులో వరుస అవకాశాలు లభిస్తున్నాయి. ప్రస్తుతం నాని హీరోగా నటిస్తున్న 'హాయ్ నాన్న' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో హీరోయిన్‌గా చేస్తున్నారు మృణాల్. తాజాగా విజయ్ దేవరకొండతో మృణాల్ ఠాకూర్ జోడి కట్టనున్నట్లు ఫిల్మ్‌నగర్ టాక్. 'గీత గోవిందం' (2018) సినిమా తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రకు మృణాల్ ఠాకూర్‌ను చిత్ర యూనిట్ సంప్రదించిందని టాక్.

పాన్ వరల్డ్ సినిమాలు నిర్మిస్తాం

– నిర్మాత టీజీ విశ్వప్రసాద్



''సినిమా అనేది ఓ ప్రయాణం. ఈ ప్రయాణంలో విజయాలు, అపజయాలు ఉంటాయి. అయితే అపజయాలు వచ్చినప్పుడు అవి పునరావృతం కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నేర్చుకుంటున్నాం'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. రామాయణం ఆధారంగా రూపొందిన తాజా పౌరాణిక చిత్రం 'ఆది పురుష్'. ఈ చిత్రంలో రాముడిగా ప్రభాస్, సీతగా కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, హనుమంతుడిగా దేవదత్తా, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. భూషణ్ కుమార్, క్రిషణ్‌కుమార్, ఓమ్ రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. కాగా తెలుగు సినిమా రిలీజ్ హక్కులను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''ఆదిపురుష్'ను తెలుగులో విడుదల చేయమని ప్రభాస్‌గారు చెప్పలేదు. అయితే ఈ అవకాశం గురించి ఆయనతో చర్చించిన తర్వాతే 'ఆదిపురుష్'ని తెలుగులో విడుదల చేస్తున్నాం. తెలుగు హక్కులను జీఎస్టీతో కలిపి రూ. 185 కోట్ల రూపాయలకు తీసుకున్నాం. టీ– సిరీస్ నిర్మాణ సంస్థ పాన్ ఇండియా సినిమాలను ప్రొడ్యూస్ చేస్తోంది. టీ సిరీస్ ప్రొడక్షన్‌లో ప్రభాస్ హీరోగా రానున్న మరో సినిమా 'స్పిరిట్'ని కూడా మేమే తెలుగులో విడుదల చేస్తాం. ఇక 'ఆదిపురుష్' సినిమా తెలుగు బుకింగ్స్ బుధవారం ఉదయం నుంచి ఓపెన్ అవుతాయి. ఓ సినిమా టికెట్ ధర పెంపుదల విషయం గురించి ప్రభుత్వాలతో చర్చించడం మాకిదే తొలిసారి. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పాజిటివ్‌గానే స్పందించాయి. ఏపీ సీఎం జగన్‌గారు అప్రూవ్ చేశారు. 'ఆదిపురుష్' సినిమా టికెట్ ధరలను యాభై రూపాయలు పెంచుకునే అనుమతులు రెండు తెలుగురాష్ట్రాల్లో లభించాయి. అయితే ఇది సింగిల్ స్క్రీన్స్‌లో మాత్రమే. మా నిర్మాణ సంస్థలో త్వరితగతిన వంద సినిమాలను పూర్తి చేయాలన్నది మేం రీసెంట్‌గా సెట్ చేసుకున్న గోల్. మా బ్యానర్‌లో పాతిక చిత్రాలు రావడానికి ఐదేళ్లకు పైనే పట్టింది. కానీ మా 50వ సినిమా మైలురాయిని వచ్చే ఏడాదే చేరుకోబోతున్నాం. నాలుగైదు సినిమాల షూటింగ్స్ పూర్తయ్యాయి. పదిహేను సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. థియేటర్స్ బిజినెస్‌కు తోడు ఓటీటీ రైట్స్ బిజినెస్ కూడా ఉపయోగపడుతోంది. అందుకే మేం ఎక్కువ సినిమాలు చేయగలుగుతున్నాం. మా బ్యానర్‌లో వచ్చిన పాన్ ఇండియా మూవీ 'కార్తికేయ 2' తర్వాత మరిన్ని పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ రాబోతున్నాయి. పాన్ వరల్డ్ స్థాయిలో సినిమాలను నిర్మించాలనేది మా లక్ష్యం. రాబోయే రెండు మూడేళ్లలో మేం హాలీవుడ్‌లో కూడా సినిమాలు నిర్మిస్తాం'' అని అన్నారు.

బాలరాజు చిందులు


సోహైల్, రామ్‌గోపాల్ వర్మ

''తాగుదాం.. తాగి ఊగుదాం..' అంటూ చిందేస్తున్నారు సోహైల్. శ్రీ కోనేటి దర్శకత్వంలో సోహైల్ హీరోగా, మేఘా లేఖ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. గ్లోబల్ ఫిల్మ్స్– కథ వేరుంటది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన 'బూట్‌కట్ బాలరాజు' లోని 'తాగుదాం.. తాగి ఊగుదాం..' పాటని దర్శకుడు రామ్ గోపాల్ వర్మ విడుదల చేసి, అభినందనలు తెలిపారు. అఫ్రోజ్ అలీ సాహిత్యం అందించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్, సాయి మాధవ్ పాడారు.

స్నేహం.. ప్రేమ


జెన్నీఫర్, సూర్య

సూర్య శ్రీనివాస్, శివ బొద్దురాజు, జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ఎవోల్' (ఎ లవ్‌స్టోరీ ఇన్ రివర్స్). స్వీయదర్శకత్వంలో రామ్ యోగి వెలగపూడి రూపొందించారు. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శక–నిర్మాత రామ్‌యోగి మాట్లాడుతూ– ''ఇద్దరు స్నేహితుల మధ్య అనుబంధం నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించిన చిత్రం ఇది. త్వరలో ఫస్ట్ లుక్, టీజర్‌ను విడుదల చేస్తాం'' అని అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
14-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	418	63,177
నిఫ్టీ ▲	115	18,716

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (భారత కాలమానం రాత్రి 11.30 గంటలకు)			
నాస్డాక్	13,576	▲	114
డోజోన్స్	34,259	▲	193
ఎఫ్టీఎస్ఈ 100	7,595	▲	24
డాక్స్	16,231	▲	133
షాంఘై	3,234	▽	5
నికాయ్	33,019	▲	585

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	59,856	▽	65
బంగారం (99.5 స్వచ్ఛత)	59616	▽	66
వెండి (కిలో)	73,169	▽	263



ఫోర్బ్స్ భారీ కంపెనీల్లో రిలయన్స్

- గ్లోబల్ 2000 లిస్టులో 45వ ర్యాంకు
- 8 స్థానాలు అప్
- జాబితాలో 55 దేశీ సంస్థలు

న్యూఢిల్లీ: దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా భారీ అంతర్జాతీయ సంస్థల జాబితాలో మరింత పై స్థానానికి చేరింది. 2023 సంవత్సరానికి గాను ఫోర్బ్స్ మ్యాగజైన్ రూపొందించిన గ్లోబల్ 2000 కంపెనీల లిస్టులో 8 స్థానాలు ఎగబాకి 45వ ర్యాంకు దక్కించుకుంది. జర్మనీకి చెందిన బీఎండబ్ల్యూ గ్రూప్, స్విట్జర్లాండ్ దిగ్గజం నెస్లే, చైనా సంస్థ ఆలీబాబా గ్రూప్ మొదలైన వాటిని కూడా అధిగమించింది. 109.43 బిలియన్ డాలర్ల ఆదాయం, 8.3 బిలియన్ డాలర్ల లాభాలు నమోదు చేయడంతో రిలయన్స్ ర్యాంకు మెరుగుపడింది. టాప్ 100 జాబితాలో రిలయన్స్‌తో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 77వ స్థానంలో నిల్చింది. 2000 కంపెనీల లిస్టులో మొత్తం మీద 55 భారతీయ సంస్థలు.. ర్యాంకులను దక్కించుకున్నాయి. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో దెబ్బతిన్నప్పటికీ అదానీ గ్రూప్‌నకు చెందిన 3 సంస్థలు లిస్టులో నిల్చాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ (1,062), అదానీ పవర్ (1,488), అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్స్ (1,598 ర్యాంకు) వీటిలో ఉన్నాయి. అమ్మకాలు, లాభాలు, అసెట్లు, మార్కెట్ విలువ అంశాల ప్రాతిపదికన ఫోర్బ్స్ ఈ ర్యాంకులు ఇచ్చింది.

జేపీమోర్గాన్ టాప్..


ఫోర్బ్స్ లిస్టులో 3.7 లక్షల కోట్ల డాలర్ల అసెట్స్‌తో జేపీమోర్గాన్ అగ్రస్థానం దక్కించుకుంది. సౌదీ చమురు సంస్థ ఆరామ్‌కో 2వ స్థానంలో, చైనాకు చెందిన మూడు భారీ ప్రభుత్వ రంగ బ్యాంకులు వరుసగా తర్వాత స్థానాల్లో ఉన్నాయి. గతేడాది టాప్ ర్యాంకులో ఉన్న బెర్క్‌షైర్ హాథ్‌వే ఈసారి 338వ స్థానానికి పడిపోయింది. పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో నష్టా ల్లో ఉండటమే ఇందుకు కారణం. ఈ ఏడాది మే 5 నాటికి అందుబాటులో ఉన్న గత 12 నెలల గణాంకాల ప్రకారం ఫోర్బ్స్ ఈ లిస్టును రూపొందించింది. జాబితాలోని కంపెనీల మొత్తం విక్రయాలు 50.8 లక్షల కోట్ల డాలర్లుగా, లాభాలు 4.4 లక్షల కోట్ల డాలర్లుగా, అసెట్స్ 231 లక్షల కోట్ల డాల ర్లుగా ఉన్నాయి. 58 దేశాలకు చెందిన లిస్టెడ్ కంపెనీలకు చోటు దక్కింది. 611 కంపెనీలతో అమెరి కా అగ్రస్థానంలో ఉండగా 346 సంస్థలతో చైనా రెండో స్థానంలో ఉంది.

ఆరు నెలల గరిష్టానికి మార్కెట్

మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు... • ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు • 418 పాయింట్ల లాభంతో 63,177కు సెన్సెక్స్ • 115 పాయింట్లు పెరిగి 18,716 కు నిఫ్టీ

ముంబై: మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాల నమోదుతో పాటు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో దేశీయ మార్కెట్ ఆరు నెలల గరిష్టానికి చేరుకుంది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ షేర్లు ఒకటిన్నర శాతం రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 54 పాయింట్లు పెరిగి 62,779 వద్ద, నిఫ్టీ 30 లాభంతో 18,632 వద్ద మొదలయ్యాయి. సానుకూలంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు రోజంతా లాభాల్లోనే కదలాడాయి. మిడ్ సెషన్ తర్వాత కీలక రంగాల్లో కొనుగోళ్లు మరింత పెరిగాయి. ఫలితంగా ఒక దశలో సెన్సెక్స్ 425 పాయింట్లు పెరిగి 63,177 వద్ద, నిఫ్టీ 127 పాయింట్లు బలపడి 18,729 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. ఆఖరికి సెన్సెక్స్ 418 పాయింట్ల లాభంతో 63,177 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 115 పాయింట్లు పెరిగి 18,716 వద్ద నిలిచింది. ఇరు సూచీలకు ఈ ముగింపు ఆరునెలల కనిష్ట స్థాయి కావడం విశేషం. రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, టెలీ కమ్యూనికేషన్, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, మెటల్, షేర్లకు డిమాండ్ లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.17%, 0.82 శాతం చొప్పున పెరిగాయి. ఆటో షేర్లు మాత్రమే నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 3 డాలర్లు దిగి రావడంతో బర్గర్ పెయింట్స్, కన్సాయ్ నెరోలాక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు 4-2% శాతం బలపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,678 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 203 కోట్ల షేర్లను విక్రయించారు. డాలర్ మారకంలో రూపాయి ఐదు పైసలు బలపడి 82.38 స్థాయి వద్ద స్థిరపడింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించవచ్చనే ఆశలతో ప్రపంచ ఈక్విటీ మా ర్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

> సెన్సెక్స్ అరశాతానికి పైగా లాభపడటంతో మంగళవారం ఒక్కరోజే ఇన్వెస్టర్లు రూ. 2.09 లక్షల కోట్లను ఆర్జించారు. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 290 లక్షల కోట్లకు చేరింది.



సెన్సెక్స్ జీవిత కాల గరిష్టం 63,583 స్థాయిని పరీక్షించే వీలుంది.
–దీపక్ జెసానీ, మార్కెట్ నిపుణులు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-6-2023	
విశాఖ	515–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480–00
విజయవాడ	480–00
రిటైల్ ధర (డజను)	72.00
13-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

ఎంఆర్ఎఫ్ @ రూ. 1 లక్ష

- ఆరు అంకెల ధర తాకిన తొలి దేశీ షేరు
- ఇంట్రాడేలో రూ. 1,00,300; రూ. 99,950 వద్ద క్లోజింగ్



దేశీ టైర్ల దిగ్గజం ఎంఆర్ఎఫ్ షేరు కొత్త రికార్డు సృష్టించింది. రూ. 1 లక్ష మార్కును అధిగమించిన తొలి షేరుగా ఘనత దక్కించుకుంది. మంగళవారం బీఎస్ఈలో 52 వారాల గరిష్టం రూ. 1,00,300 స్థాయిని తాకింది. చివరికి క్రితం ముగింపుతో పోలిస్తే 1.02% లాభంతో రూ. 99,950.65 వద్ద క్లోజయ్యింది. ఎన్ఎస్ఈలో ఇంట్రాడేలో రూ. 1,00,439.95ని తాకి చివరికి 0.94% లాభంతో రూ. 99,900 వద్ద ముగిసింది. స్టాక్ ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 12.89% పెరిగింది.

బెలూన్ల కంపెనీగా ప్రారంభం.. మరింత సమాచారం 'సాక్షి ప్లస్'లో...

బంగారం ఈటీఎఫ్‌ల జోరు

మే నాటికి రూ. 23 వేల కోట్ల పైకి పెట్టుబడులు



న్యూఢిల్లీ: అనిశ్చిత సమయాల్లో సురక్షిత పెట్టుబడి సాధనమైన గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్) మే నెలలో నికర పెట్టుబడులను ఆకర్షించాయి. ఇన్వెస్టర్లు ఏప్రిల్ నెలలో రూ.124 కోట్లను బంగారం ఈటీఎఫ్‌లలో నికరంగా పెట్టుబడి పెట్టగా, మే నెలలో 20 శాతం తక్కువగా, రూ.103 కోట్లను ఇన్వెస్ట్ చేశారు. దీనితో బంగారం ఈటీఎఫ్‌ల నిర్వహణలో మొత్తం ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువ మే చివరికి రూ.23,128 కోట్లుగా ఉంది. ఏప్రిల్ చివరికి ఇది రూ.22,950 కోట్లు కావడం గమనార్హం. కాగా, అంతకుముందు నెల మార్చిలో (2023)లో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి ఇన్వెస్టర్లు రూ.266 కోట్లను ఉపసంహరించుకున్నారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ గణాంకాలు విడుదల చేసింది. మే నెలలో బంగారం ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు తగ్గడం అన్నది లాభాల స్వీకరణ వల్లేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సెంట్రల్ బ్యాంకులు తదుపరి వడ్డీ రేట్ల పెంపును నిలిపివేయడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గ చూపించి ఉండవచ్చని భావిస్తున్నారు.

డైరెక్ట్ ప్లాన్ల విషయంలో ఇన్వెస్టర్లకు రక్షణ

- నూతన కార్యాచరణను ప్రకటించిన సెబీ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లలో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. డైరెక్ట్ ప్లాన్లలో పెట్టుబడులకు వీలు కల్పించే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు నూతన నియంత్రణపరమైన కార్యాచరణను ప్రకటించింది. ఇది సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని సెబీ ప్రకటించింది. మ్యూచువల్ ఫండ్స్‌లో రెగ్యులర్ ప్లాన్, డైరెక్ట్ ప్లాన్ అని రెండు రకాలు ఉంటాయి. డైరెక్ట్ ప్లాన్లలో మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. దీంతో రెగ్యులర్ ప్లాన్లతో పోలిస్తే డైరెక్ట్ ప్లాన్లలో ఎక్స్‌పెన్స్ రేషియో తక్కువగా ఉంటుంది. దీనివల్ల రెగ్యులర్ ప్లాన్లతో పోలిస్తే, డైరెక్ట్ ప్లాన్లలో దీర్ఘకాలంలో అధిక రాబడులు పొందొచ్చు. ఫలితంగా డైరెక్ట్ ప్లాన్ల పట్ల ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో జెరోదా తదితర స్టాక్ బ్రోకర్లతోపాటు, పేటీఎం మనీ తదితర ఎన్నో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు వీటిని ఇన్వెస్టర్లకు ఆఫర్ చేస్తున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎవరైనా డైరెక్ట్ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఆయా సంస్థలకు క్లయింట్లు కానక్కర్లేదు. ఇలా తమ క్లయింట్లు కాని వారికి కూడా మ్యూచువల్ ఫండ్స్ పథకాల డైరెక్ట్ ప్లాన్లలో కొనుగోళ్లు, అమ్మకాల లావాదేవీలకు వీలు కల్పించే సంస్థలకు జవాబుదారీ ఉండాలని సెబీ భావించి ఈ దిశగా నిబంధనలను ప్రకటించింది. ఇప్పటి వరకు క్లయింట్లు కాని వారికి సేవల విషయంలో నియంత్రణ లేదు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాల్లో 113 సబ్జెక్ట్ అసోసియేట్ పోస్టులు

తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాల (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)ల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌తోపాటు ఐఐటీ-జేఈఈ(మెయిన్స్/అడ్వాన్స్‌డ్), నీట్ శిక్షణ ఇస్తున్న సీనియర్ ఫ్యాకల్టీకి సహాయంగా పార్ట్ టైం సబ్జెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 113

» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** మ్యాథ్స్-22, ఫిజిక్స్-24, కెమిస్ట్రీ-21, బోటనీ-21, జువాలజీ-25.

» **అర్హత:** మొదటి శ్రేణిలో పీజీ, బీఈడీ. జేఈఈ మెయిన్స్/అడ్వాన్స్‌డ్, నీట్, ఎంసెట్ శిక్షణకు సంబంధించి బోధించడంలో అనుభవం ఉండాలి.

» **వేతనం:** నెలకు రూ.32,500 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023. » **రాతపరీక్ష తేది:** 25.06.2023.

» **డెమో/ఇంటర్వ్యూ తేది:** 30.06.2023. »**వెబ్‌సైట్:** www.tswreis.ac.in

బీఈఎల్, బెంగళూరులో 205 ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 205

» **పోస్టుల వివరాలు:** ట్రెయినీ ఇంజనీర్-191, ప్రాజెక్ట్ ఇంజనీర్-14.

» **విభాగాలు:** సమాచారం సాంకేతికత/సమాచారం సైన్స్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ -కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్-టెలికమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్/కమ్యూనికేషన్/మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ తదితరాలు.

అర్హత

» **ట్రెయినీ ఇంజనీర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంజనీరింగ్ బీఎస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.

» **వేతనం:** నెలకు రూ.40,000 చెల్లిస్తారు.

» **ప్రాజెక్ట్ ఇంజనీర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంజనీరింగ్ బీఎస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.

» **వేతనం:** నెలకు రూ.30,000 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.06.2023.

» **వెబ్‌సైట్:** www.bel-india.in

దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో 35 జూనియర్ టెక్నికల్ అసోసియేట్ పోస్టులు

సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే కాంట్రాక్ట్ ప్రాతిపదికన జూనియర్ టెక్నికల్ అసోసియేట్ (వర్క్స్/డ్రాయింగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 35 » **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ టెలికమ్యూనికేషన్.

» **అర్హత:** డిప్లొమా, బీఎస్సీ, ఇంజనీరింగ్‌లో డిగ్రీ(ఐటీ/సీఎస్/కంప్యూటర్ ఇంజనీరింగ్/సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్)ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి.

» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, పర్సనాలిటీ టెస్ట్/ఇంటెలిజెన్స్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2023.

» **వెబ్‌సైట్:** scr.indianrailways.gov.in

ఐఐటీల్లో సీఎస్ఈ క్రేజ్

ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఐఐటీల్లో ప్రవేశాలకు ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను 4వ తేదీన నిర్వహించారు. ఐఐటీ గువహటి ప్రొవిజనల్ కీని కూడా విడుదల చేసింది. 18వ తేదీన ఫలితాలు వెల్లడించే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 పరీక్ష తీరుతెన్నులు, కటాఫ్ అంచనా, ఐఐటీల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, బ్రాంచ్‌లు, ప్రవేశ విధానంపై ప్రత్యేక కథనం..

» కటాఫ్ 80గా ఉంటుందనే అంచనా
» 19 నుంచి ఐఐటీలు, నిట్‌ల్లో జోసా కౌన్సెలింగ్
» మొత్తం 49 బ్రాంచ్‌లు.. 16,598 సీట్లు

అడ్వాన్స్‌డ్ పరీక్ష రెండు పేపర్లుగా.. ఒక్కో పేపర్‌లో 51 ప్రశ్నలు అడిగారు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 17 చొప్పున ప్రశ్నలు వచ్చాయి. ఒక్కో పేపర్‌కు 180 మార్కులు లెక్కన రెండు పేపర్లను కలిపి మొత్తం 360 మార్కులకు పరీక్ష నిర్వహించారు.

క్లిష్టంగా మ్యాథమెటిక్స్

రెండు పేపర్లలోనూ మ్యాథమెటిక్స్ విభాగం ప్రశ్నలు క్లిష్టంగా ఉన్నాయని.. విద్యార్థులు, సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు. ట్రిగ్నోమెట్రిక్ ఈక్వేషన్స్, హార్మోనిక్ ప్రోగ్రెషన్స్, వెక్టార్స్, ప్రాబబిలిటీ, ఎలిప్స్, మ్యాట్రిసెస్, ఫంక్షన్స్ నుంచి అడిగిన ప్రశ్నలు కొంత సులభంగా ఉన్నా.. 3-డి జామెట్రీ, కానిక్ సెక్షన్స్ విభాగం ప్రశ్నలు చాలా క్లిష్టంగా ఉన్నట్లు చెబుతున్నారు. పేపర్-2లో కో-ఆర్డినేట్ జామెట్రీ, కాలిక్యులస్‌ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారని.. హైపర్ బోలా, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, డెఫినిట్ ఇంటిగ్రేషన్ విభాగాల నుంచి డైరెక్ట్ కొశ్చన్స్ అడిగినా.. అవి సుదీర్ఘ సమాధానం ఇవ్వాల్సిన విధంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది.

ఫిజిక్స్.. ఓ మోస్తరు క్లిష్టత

ఫిజిక్స్‌లో ప్రశ్నలు ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు ఎక్కువగా కనిపించాయి. ఎలక్ట్రిసిటీ, రొటేషనల్ మోషన్, కైనమాటిక్స్, వర్క్ పవర్ అండ్ ఎనర్జీ, థర్మోడైనమిక్స్, సర్ఫేస్ టెన్షన్‌ల నుంచి అడిగిన ప్రశ్నలు రెండు, మూడు కాన్సెప్ట్‌ల కలయికతో.. సుదీర్ఘంగా ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

కెమిస్ట్రీ.. ఊరట

కెమిస్ట్రీలో ప్రశ్నలు కొంత సులభంగా ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి మోల్ కాన్సెప్ట్,ఎలక్ట్రో కెమిస్ట్రీ, సర్ఫేస్ కెమిస్ట్రీ, థర్మో డైనమిక్స్, కెమికల్ కైనటిక్స్ విభాగాల్లో ప్రశ్నలు అడిగారు. ఆర్గానిక్ కెమిస్ట్రీలో కాన్సెప్ట్ బేస్డ్ ప్రశ్నలు, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో రియాక్షన్ బేస్డ్ ప్రశ్నలు ఎదురయ్యాయి.

కటాఫ్ 80 మార్కులు

మొత్తం 360 మార్కులకు నిర్వహించిన అడ్వాన్స్‌డ్‌లో.. కటాఫ్ మార్కులు 80గా ఉంటాయని నిపుణుల అంచనా. ఈ మార్కులు 60కు పరిమితమైనా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే పరీక్ష కొంత సులభంగా ఉండడంతో కటాఫ్ మార్కులు పెరిగే అవకాశముంది. గత ఏడాది జనరల్ కేటగిరీ కటాఫ్ 55 మార్కులు మాత్రమే.

ఐఐటీల్లో 16,598 సీట్లు

అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా 23 ఐఐటీల్లో మొత్తం 16,598 సీట్లలో ప్రవేశం లభిస్తుంది. వీటిలో విద్యార్థులు ఎంతో క్రేజీగా భావించే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ వంటి ఎవర్ గ్రీన్ బ్రాంచ్‌లతో పాటు.. బయో సైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్, బయోటెక్ అండ్ బయోకెమ్ ఇంజనీరింగ్, బయో ఇంజనీరింగ్ వంటి వైద్య అనుబంధ బ్రాంచ్‌లు ఉండడం విశేషం. వీటితో పాటు ఇటీవల మార్కెట్ ట్రెండ్, జాబ్ మార్కెట్ స్కిల్స్‌కు అనుగుణంగా.. డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ-ఎంఎల్ వంటి బ్రాంచ్‌లను ప్రవేశపెట్టారు. అంతేకాకుండా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీ రింగ్‌లోనూ డేటా సైన్స్ మేజర్‌గా కొత్త ప్రోగ్రామ్ అందుబాటులోకి వచ్చింది. అదే విధంగా అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ(బీటెక్+ఎంటెక్) ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి.

సీఎస్ఈకే తొలి ప్రాధాన్యం

గత కొన్నేళ్లుగా అడ్వాన్స్‌డ్ ర్యాంకర్ల తొలి ప్రాధమ్యంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ నిలుస్తోంది. గత ఏడాది ఐఐటీ-ముంబైలో క్లోజింగ్ ర్యాంకు 62గా ఉండగా.. ఐఐటీ-ఢిల్లీలో 102గా, ఐఐటీ-చెన్నైలో 175గా, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 303, ఐఐటీ-రూర్కీలో 413, ఐఐటీ-హైదరాబాద్‌లో 608గా నమోదయ్యాయి. మిగతా ఐఐటీల్లో ఓపెన్ కేటగిరీలో 2000లోపు ర్యాంకుతోనే సీఎస్ఈ సీట్లు భర్తీకావడం ఈ బ్రాంచ్‌కున్న క్రేజ్‌కు నిదర్శనంగా చెప్పొచ్చు.

ప్రాధాన్యం వీటికే

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ తర్వాత ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్‌లు విద్యార్థుల ప్రాథమ్యాలుగా నిలుస్తున్నాయి. గత ఏడాది ఆరు రౌండ్లలో నిర్వహించిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో.. విద్యార్థుల ఆప్షన్లను పరిశీలిస్తే ఈ నాలుగు బ్రాంచ్‌లే ముందంజలో నిలిచినట్లు స్పష్టమవుతోంది. వీటిలో ఓపెన్ కేటగిరీలో చివరి రౌండ్‌లో తొమ్మిది వేలలోపు క్లోజింగ్ ర్యాంకు నమోదైంది.

ఏఐ కోర్సులకూ క్రేజ్

- జాబ్ మార్కెట్ అవసరాలు, లేటెస్ట్ టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని పలు ఐఐటీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ అనుబంధ ప్రోగ్రామ్‌లను కూడా ప్రారంభించాయి. వీటిలోనూ క్లోజింగ్ ర్యాంకు గరిష్టంగా రెండు వేల లోపు నమోదవుతోంది.
- **డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్:** ఐఐటీ రూర్కీలో 822, గువహటిలో 951, భిలాయ్‌లో 5744గా ఓపెన్ కేటగిరీ క్లోజింగ్ ర్యాంకులు ఉన్నాయి.
- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్:** ఐఐటీ హైదరాబాద్‌లోనే ఉన్న ఈ ప్రోగ్రామ్‌లో క్లోజింగ్ ర్యాంకు 840గా నమోదైంది.
- **డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** ఐఐటీ మండిలో 3974, పాలక్కాడ్‌లో 6502గా క్లోజింగ్ ర్యాంకులు ఉన్నాయి.
- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్:** జోధ్‌పూర్‌లో 3257గా, పాట్నాలో 3702గా క్లోజింగ్ ర్యాంకులు నిలిచాయి.

కెరీర్ అవకాశాలు

- సీఎస్ఈ బ్రాంచ్‌తో బీటెక్ పట్టా అందుకుంటే..జాబ్ గ్యారెంటీ అనే అభిప్రాయం నెలకొంది. ఐఐటీల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో సీఎస్ఈ విద్యార్థులకు సగటున రూ.35 లక్షల వేతనం లభిస్తోంది.
- సీఎస్ఈ తర్వాత ఎలక్ట్రానిక్స్‌కు జాబ్ మార్కెట్లో అధిక డిమాండ్ కనిపిస్తోంది. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, 5జీ టెక్నాలజీస్ కారణంగా..ఈసీఈ, ఎలక్ట్రికల్ విద్యార్థులకు డిమాండ్ పెరుగుతోంది. వీరికి కూడా సగటున రూ.30 లక్షల వార్షిక వేతనం లభిస్తోంది. మెకానికల్, సివిల్ వంటి బ్రాంచ్‌ల వారికి కూడా ఐఐటీల్లో ఆకర్షణీయ వేతనంతో ఆఫర్స్ లభిస్తున్నాయి.

జోసా కౌన్సెలింగ్

ఐఐటీల్లో సీట్ల కేటాయింపు కోసం జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ(జోసా) ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ఛాయిస్ ఫిల్లింగ్‌లో ఇన్‌స్టిట్యూట్స్, ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల ప్రాథమ్యాలను వరుస క్రమంలో పేర్కొనాలి. తదుపరి దశలో అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా ఇన్‌స్టిట్యూట్స్, బ్రాంచ్‌లలో అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది. సీట్ అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నిర్దేశిత ఫీజు చెల్లించి.. సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరవడంతోపాటు జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు ఐఐటీలు, నిట్‌లు తదితర ఇన్‌స్టిట్యూట్‌లను తమ ప్రాథమ్యాలుగా ఎంచుకోవచ్చు.



ఆరు రౌండ్లలో కౌన్సెలింగ్

- జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ మొత్తం ఆరు రౌండ్లలో జరుగుతుంది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం- జోసా-2023 కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 19న ప్రారంభం కానుంది. అభ్యర్థులు అయిదో రౌండ్ వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొని స్లైడింగ్ ప్రక్రియకు హాజరవ్వచ్చు.
- **జూన్19:**జోసా వెబ్‌సైట్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్,ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ ప్రారంభం.
- **జూన్ 25:** మాక్ సీట్ అలొకేషన్(సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-1 విడుదల. (జూన్ 24 రాత్రి 8గంటల వరకు అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాల ఆధారంగా దీన్ని విడుదల చేస్తారు).
- **జూన్ 27:** మాక్ సీట్ అలొకేషన్(సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-2 విడుదల. (జూన్ 26 సాయంత్రం అయిదు గంటల వరకు పేర్కొన్న ప్రాథ్యమాల ఆధారంగా వెల్లడించనున్నారు).
- **జూన్ 28:** ఛాయిస్ ఫిల్లింగ్, క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ.
- **జూన్ 29:** వివరాల పునస్సమీక్ష, పరిశీలన.
- **జూన్30:**మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూన్ 30–జూలై 4:** మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిపోర్టింగ్ చేయాలి. అదే విధంగా యాక్సప్టెన్స్ ఫీజును చెల్లించాలి. నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.
- **జూలై 6:** రెండో దశ సీట్ల కేటాయింపు.
- **జూలై 6-10:** రెండో రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ల అప్‌లోడ్.
- **జూలై 7-11:** రెండో రౌండ్‌లో పొందిన సీటు విషయంలో ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి విరమించుకునే అవకాశం.
- **జూలై 12:**మూడో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 12-14:** మూడో రౌండ్ సీట్ల కేటాయింపునకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 13-15:** మూడో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి ఉపసంహరణ.
- **జూలై 16:**నాలుగో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 16-19:** నాలుగో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 18-20:** నాలుగో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- **జూలై 21:**అయిదో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 21-24:** అయిదో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, డాక్యుమెంట్ అప్‌లోడ్, ఫీజు పేమెంట్.
- **జూలై 21-25:** అయిదో రౌండ్ తర్వాత సీటు విత్‌డ్రా లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- **జూలై 26:** ఆరో రౌండ్(చివరి రౌండ్) సీట్ల కేటాయింపు.
- **జూలై 26-28:** ఆరో రౌండ్‌లో పొందిన సీటుకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://josaa.nic.in

పైరవీలు, పడిగాపుల్లేవ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాఠశాల విద్యా శాఖలో పనిచేస్తున్న వివిధ కేడర్ల ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అన్ని అర్హతలు ఉన్న 56,829 మందిని బదిలీ చేశారు. గతంలోలా అర్ధరాత్రి వరకు పడిగాపులు, పోస్టుల బ్లాక్, రికమండేషన్లు, యూనియన్ నేతల పైరవీలకు చోటు లేకుండా ఈ ప్రక్రియ సాఫీగా సాగింది. గత 25 ఏళ్లలో ఇలాంటి సమర్థవంతమైన ప్రక్రియ చూడలేదని ఉపాధ్యాయ సంఘాలే ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాయి. ప్రభుత్వం ముందుగా ఇచ్చిన హామీ మేరకు ఐదేళ్లు పూర్తిచేసుకున్న ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయుల బదిలీకి అవకాశం కల్పించారు. అభ్యర్థన మేరకు మరికొందరిని బదిలీ చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో సర్వీసు రికార్డులను ఆన్‌లైన్‌లో ఉంచడంతో మొత్తం ప్రక్రియ సులభతరమైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు, ప్రాంతాల ఎంపిక, చివరికి బదిలీ ఆర్డర్‌ను సైతం ఆన్‌లైన్‌లోనే పొందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో 15 రోజుల్లోనే మొత్తం ప్రక్రియ ముగిసింది. ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు బదిలీలకు పాత స్టేషన్ పాయింట్‌ను ప్రామాణికంగా తీసుకున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజే (జూన్ 12) ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ముగియడం విశేషం.

ఉమ్మడి తూర్పు గోదావరిలో అత్యధికంగా

ఈసారి అత్యధికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 6,128 మంది బదిలీ అయ్యారు. ఈ జిల్లా నుంచి గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు అత్యధికంగా 286 మందికి బదిలీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా 2,621 మంది ప్రధానోపాధ్యాయులు, భాషాయేతర స్కూల్ అసిస్టెంట్లు 16,081 మంది, లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్లు 11,119 మంది, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు 2,554 మంది, ఎస్‌జీటీలు 23,428 మంది, తెలుగు పండిట్లు 631 మంది, హిందీ పండిట్లు 309 మంది, ఉర్దూ పండిట్లు 17 మంది, పీఈటీలు 25 మంది, ఒకేషనల్, డ్రాయింగ్, క్రాఫ్ట్ టీచర్లు 44 మందితో పాటు ఇతర భాషా పండితులు నలుగురిని కూడా బదిలీ చేశారు.

ఆ రెండింటి వల్లే 'నైరుతి'కి తంటా!

నిన్న 'మోకా', నేడు 'బిపర్‌జోయ్'లతో ఇబ్బంది



సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలకు మోకా, బిపర్‌జోయ్ తుపానులు ప్రతిబంధకాలుగా మారాయి. రుతుపవనాల ప్రవేశం నుంచి విస్తరణ వరకు ఇవి అడుగడుగునా అడ్డుపడుతున్నాయి. ఫలితంగా ఒకవైపు వడగాడ్పులు విజృంభిస్తుంటే మరోవైపు వర్షాలకు బ్రేకులు పడుతున్నాయి. సాధారణంగా అండమాన్ సముద్రంలోకి ప్రవేశంతో 'నైరుతి' ఆగమన ప్రక్రియ ఆరంభమవుతుంది. అక్కడ నుంచి బంగాళాఖాతంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించి పది రోజుల్లో జూన్ ఒకటో తేదీ నాటికి కేరళను తాకుతాయి. అనంతరం వారం రోజుల్లోగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తాయి. ఈ ఏడాది అండమాన్ సముద్రంలోకి నిర్ణీత సమయానికి రెండ్రోజుల ముందే అంటే మే 18 నాటికే రుతుపవనాలు ప్రవేశించాయి. అక్కడ నుంచి అవి బంగాళాఖాతంలోని ఇతర ప్రాంతాలకు చాలా నెమ్మదిగా విస్తరించాయి. దీంతో ఈ రుతుపవనాలు కేరళలోకి వారం రోజులు ఆలస్యంగా ఈ నెల 8న ప్రవేశించాయి. ఆ తర్వాత కూడా అవి ఆశించినంతగా చురుకుదనాన్ని సంతరించుకోలేదు. ఫలితంగా వర్షాలు కురవడం లేదు. పైగా రోహిణీకార్తె వెళ్లి మృగశిర కార్తె ప్రవేశించినా ఇంకా రోహిణిని తలపించే ఉష్ణోగ్రతలే (42–45 డిగ్రీల వరకు) నమోదవుతున్నాయి. వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీస్తూనే ఉన్నాయి. ఈ పరిస్థితి ఇంకా ఈనెల 18 వరకు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

ఆ రెండు తుపానుల వల్లే..

రుతుపవనాల ప్రవేశానికే కాదు.. వాటి విస్తరణలో ఆలస్యానికి ఇటీవల సంభవించిన తుపానులే కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత నెల 9న బంగాళాఖాతంలో 'మోకా' తుపాను ఏర్పడింది. అనంతరం అది అత్యంత తీవ్ర తుపానుగా మారి బంగ్లాదేశ్ వైపు పయనించి తీరాన్ని దాటింది. దీంతో బంగాళాఖాతంలోని తేమను ఈ తుపాను అటు వైపు లాక్కుని పోయింది. దీంతో రుతుపవనాలు బంగాళాఖాతంలోకి వేగంగా విస్తరించకుండా, ఆపై కేరళలోకి సకాలంలో ప్రవేశించకుండా ఆలస్యమైంది. ఎట్టకేలకు ఈనెల 8న నైరుతి రుతుపవనాలు కేరళను తాకినా ఆ తర్వాత కూడా మందగమనమే కొనసాగుతోంది. తాజాగా అరేబియా సముద్రంలో ఈనెల 6న 'బిపర్‌జోయ్' తుపాను సంభవించింది. ఈ తుపాను కూడా అత్యంత తీవ్ర తుపానుగా బలపడి గుజరాత్ వైపు పయనిస్తోంది. ఈ తుపాను కూడా 'మోకా' మాదిరిగానే నైరుతి రుతుపవనాల వేగానికి కళ్లెం వేసింది. అరేబియా సముద్రంలోని తేమను తుపాను ప్రభావిత ప్రాంతం వైపు తీసుకెళ్లిపోవడంతో రుతుపవనాలు ఆశించినంతగా విస్తరించడం లేదు.. వర్షించడం లేదు. వాస్తవానికి సాధారణ పరిస్థితులుంటే రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు విస్తరించి విస్తారంగా వర్షాలు కురవాల్సి ఉంది. అయితే ఇప్పటికీ రాయలసీమలో ఒకట్రెండు చోట్ల అరకొరగా మినహా రాష్ట్రంలో ఎక్కడా రుతుపవనాల వర్షాలు కురవడం లేదు. ఇంకా రాష్ట్రంలో ఎక్కడైనా అడపా దడపా వానలు కురుస్తుండడానికి రుతుపవనాల ఆగమనానికి ముందస్తుగా ఏర్పడే థండర్ స్టార్మ్ (ఉరుములు, మెరుపులు, పిడుగులు ఈదురుగాలులతో కూడిన వాతావరణం) పరిస్థితులే కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈనెల 18 తర్వాతే రాష్ట్రంలో రుతుపవనాల వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా 'సాక్షి'కి చెప్పారు.

మందకొడిగా నైరుతి రుతుపవనాలు..

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించినా మందకొడిగా కదులుతున్నాయి. ఈ నెల 11వ తేదీన అవి శ్రీహరికోట వద్ద రాయలసీమను తాకినా ఆ తర్వాత పెద్దగా ముందుకు కదల్లేదు. ఈపాటికి రాయలసీమలోని అన్ని జిల్లాలకు విస్తరించి తెలంగాణ, కోస్తా జిల్లాల్లోకి ప్రవేశించాల్సివుంది. కానీ మంగళవారం నాటికి ఇంకా రాయలసీమలోనే పూర్తిగా విస్తరించలేదు. అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాలకు కొద్దిమేర విస్తరించినా అక్కడ పెద్దగా వర్షాలు కూడా పడడంలేదు. ఈ నెల 16 వరకు రుతుపవనాలు ఇలా నెమ్మదిగానే కదిలే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. బిపర్‌జోయ్ తుపాను ప్రభావం 16వ తేదీ నుంచి తగ్గే అవకాశం ఉండడంతో ఆ తర్వాత రుతుపవనాల గమనంలో వేగం పెరుగుతుందని భావిస్తున్నారు. 20 నాటికి రుతుపవనాలు రాష్ట్రమంతా విస్తరించే అవకాశం ఉందని చెబుతున్నారు. అప్పటి నుంచి వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం అక్కడక్కడా వర్షాలు పడుతున్నా అది నామమాత్రంగానే ఉంది.

విశాఖ తూర్పులో దొంగ ఓట్ల రగడ

- నియోజకవర్గంలో 40 వేల నకిలీ ఓట్లు ఉన్నట్లు గుర్తింపు
- కొన్ని ఇళ్లలో 10 నుంచి 14 మంది ఓటర్లు
- ఆ ఇళ్లలో ఉన్నది ముగ్గురు, నలుగురే
- ఇతర జిల్లాలు, రాష్ట్రాల వారి పేర్ల మీద ఓట్లు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని
- దొంగ ఓట్లతోనే టీడీపీ ఎమ్మెల్యే గెలుస్తున్నారని ఆరోపణ
- ఆ ఓట్లు తిరిగి జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే డిమాండ్



దొంగ ఓట్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

మహారాణిపేట: విశాఖ తూర్పు నియోజకవర్గంలో దొంగ ఓట్లు రగడ సృష్టిస్తున్నాయి. నియోజకవర్గంలో సుమారు 40 వేల నకిలీ ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. కొన్ని ఇళ్లలో వాస్తవంగా ముగ్గురు, నలుగురు ఉంటే.. 10 నుంచి 15 వరకు ఓటర్లు ఉన్నట్లు జాబితాలో ఉండడం కలకలం రేపింది. దీంతో అధికారులు ఆ ఓట్లను తొలగించారు. వాటిని తిరిగి చేర్చాలని తూర్పు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆ పార్టీకి చెందిన ఇతర నేతలు డిమాండ్ చేస్తున్నారు. అవన్నీ తెలుగుదేశం పార్టీ వారు చేర్పించిన దొంగ ఓట్లని, వాటిని తిరిగి జాబితాలో చేర్చవద్దని వైఎస్సార్‌సీపీ నేతలు కోరుతున్నారు. ఈ మేరకు ఇరు పార్టీల నేతలు మంగళవారం కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రాలు సమర్పించారు. దీంతో ఈ ఓట్లన్నీ తెలుగుదేశం పార్టీ వారే అక్రమంగా జాబితాలో చేర్పించారన్న ఆరోపణలు మరోసారి వెల్లువెత్తుతున్నాయి. ఎటువంటి వివాదాలు చెలరేగకుండా కలెక్టరేట్ వద్ద పోలీసులు ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు.

దొంగ ఓట్లతోనే వెలగపూడి గెలుపు

విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ నేత వెలగపూడి రామకృష్ణబాబు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రతి ఎన్నికలకు ముందు వెలగపూడి దొంగ ఓట్లు నమోదు చేస్తున్నారని, ఆ ఓట్లతోనే ఎమ్మెల్యేగా గెలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఆరోపించారు. ఈ మేరకు ఆమె కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దొంగ ఓట్లన్నింటినీ పూర్తిగా తొలగించాలని, తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చవద్దని కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వెలగపూడి స్థానికేతరుడు కావడం వల్ల విజయవాడ, గుంటూరు, గన్నవరం తదితర ప్రాంతాల ప్రజలు, గీతం కాలేజీ విద్యార్థులను ఓటర్ల కింద నమోదు చేశారని ఆరోపించారు. ఒకే ఇంటి నంబర్‌పై 20 ఓట్లు ఉంటున్నాయని, 2019 ఎన్నికల్లో జనవరి నుంచి మార్చి వరకు కనీసం 40,000 ఓట్లు నమోదు చేయించారని ఆరోపించారు. దొంగ ఓట్లతో గెలవడం నిజమైన విజయం కాదన్నారు. ప్రజలకు మంచి చేసి ఓట్లు వేయించుకోవాలని అన్నారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

ఇష్టానుసారం తొలగించేశారు: వెలగపూడి

మరోపక్క టీడీపీ ఓట్లు తొలగించారంటూ ఎమ్మెల్యే రామకృష్ణబాబు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో అక్రమంగా 40,000 ఓట్లు తొలగించారని వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. కేవలం తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్లు మాత్రమే తొలగించారని ఆరోపించారు. ఒక ఎమ్మెల్యేకు 30,000 నుంచి 40,000 ఓట్లు నమోదు చేసే అవకాశం ఉంటుందా అని ప్రశ్నించారు. తొలగించిన ఓట్లన్నీ తిరిగి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఓట్లు తొలగించిన అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు.

రేపు విజయవాడలో నర్సరీ గ్రోయర్స్ వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: ఏపీ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన 'పనస, మామిడి పంటలు–ప్రత్యామ్నాయ ఆలోచనలు' అనే అంశంపై విజయవాడలో ఈ నెల 15వ తేదీన రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల చలపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిగడపలోని ఎస్ఎన్ఎస్ అసోసియేట్స్‌లో జరిగే ఈ వర్క్‌షాప్‌లో పనస, మామిడి పంటల సవాళ్లు, ప్రత్యామ్నాయ ఆలోచనలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎగుమతులు వంటి అంశాలపై ఏపీ, కర్ణాటకకు చెందిన నిపుణులు అప్పాజీ, శివన్న, నాగమల్లై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌నకు హాజరయ్యేవారు అసోసియేషన్ ప్రతినిధులు సరిత (9177471566), నరసింహారెడ్డి (6309043648)లను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాలని తెలిపారు. వర్క్‌షాప్‌లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో సాగయ్యే మామిడి రకాల ప్రదర్శన ఉంటుందని వివరించారు.

ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై దృష్టి పెట్టండి

- వర్షాభావ పరిస్థితులుంటే జిల్లాల వారీగా పంటల ప్రణాళిక
- వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది



సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. జూలై 15, జూలై 31, ఆగస్ట్ 15 నాటికి సరైన వర్షాలు పడకపోతే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. పంటలు, పంట రకాల మార్పుపై దృష్టి సారించాలన్నారు. ఉత్తరకోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాలకు వేర్వేరుగా పంటల కాలంలో అవసరమయ్యే వివిధ పంటల సరళి, అవసరమైన ఉత్పాదకలపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికకు అనుగుణంగా జూలై 15 నాటికి వర్షాలు పడకపోతే.. 40 వేల క్వింటాళ్లు, జూలై 31 నాటికి వర్షాలు పడకపోతే 71 వేల క్వింటాళ్లు, ఆగష్టు 15 నాటికి వర్షాలు పడకపోతే లక్ష క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం రాయితీపై పంపిణీ చేసేలా చర్యలు చేపడతామన్నారు. ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ గెడ్డం శేఖర్‌బాబు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాల పంపిణీకి కార్పొరేషన్ సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే నేషనల్ సీడ్స్, తెలంగాణ సీడ్స్, కర్ణాటక సీడ్స్ కార్పొరేషన్ల నుంచి విత్తనాలు సమీకరించి ఆర్బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

నారాయణ స్కూల్ సీజ్

- అనుమతి లేకుండానే పాఠశాల అడ్మిషన్లు ప్రారంభం

ఒంగోలు: ఒంగోలు సంతపేట నారాయణ స్కూల్‌కు విద్యాశాఖ అధికారులు తాళం వేశారు. అనుమతి లేకుండా ఎవరైనా పాఠశాల నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ హెచ్చరిస్తున్న.. 'నారాయణ ఈ టెక్నో స్కూల్' పేరుతో స్థానిక సంతపేటలో ప్రారంభించారు. ఇటీవల ఎంఈవో కిషోర్‌బాబు, డిప్యూటీ ఈవో అనిత రోజ్‌రాణి పాఠశాలకు చేరుకుని అడ్మిషన్లు నిర్వహించరాదని ఆదేశించారు. తాము పాఠశాల నిర్వహించడం లేదని చెప్పడంతో ఆ భవనం వద్ద అనుమతి లేనిదే పాఠశాలలో పిల్లలను చేర్చవద్దంటూ విద్యాశాఖ అధికారి ఫ్లెక్సీ వేయించారు. అయితే.. తెల్లవారేసరికి ఫ్లెక్సీ మాయమైంది. దీంతో పాఠశాల నిర్వాహకులే ఈ పని చేసి ఉంటారని భావించిన విద్యాశాఖ అధికారులు నిఘా పెట్టారు. అందులో భాగంగా మంగళవారం తల్లిదండ్రులతో అడ్మిషన్ల వ్యవహారం గురించి యాజమాన్యం చర్చిస్తున్నట్టు తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. అక్కడ ఒక పాపతో 8వ తరగతి అడ్మిషన్ గురించి మాట్లాడుతుండగా.. అక్కడికక్కడే పాఠశాలను సీజ్ చేసి తాళాలు వేశారు. అనంతరం తాళాలను డీఈవో రమేష్‌కు అందించారు. ఈ సందర్భంగా డీఈవో రమేష్ మాట్లాడుతూ అనుమతిలేని పాఠశాలల్లో పిల్లలను చేర్చరాదన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా పాఠశాలలను నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రాష్ట్రపతిని కలవడం గర్వంగా ఉంది

- ఏపీ గిరిజన బృందం ఆనందం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఏపీ గిరిజన బృందం

సాక్షి, అమరావతి: మారుమూల అటవీ ప్రాంతాల్లో ఉండే తాము ఢిల్లీ వెళ్లి దేశ ప్రథమ పౌరురాలైన ద్రౌపది ముర్మును కలవడం గర్వంగా ఉందని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గిరిజన బృందం ఆనందం వ్యక్తం చేసింది. దేశంలో 75 అత్యంత బలహీన గిరిజన తెగలు (పీవీటీజీ)కు చెందిన 1,500 మందికి ఢిల్లీ రావాలని రాష్ట్రపతి ఆహ్వానం పంపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తొమ్మిది తెగలకు చెందిన 180 మంది గిరిజనులు, ఐదుగురు అధికారులు ఈ నెల 8వ తేదీ రాత్రి విశాఖపట్నం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర బృందానికి నేతృత్వం వహించిన (లైజనింగ్ ఆఫీసర్) ట్రైకార్ జనరల్ మేనేజర్ సీహెచ్ మణికుమార్ గిరిజనుల ఢిల్లీ పర్యటన వివరాలను మంగళవారం 'సాక్షి'కి వెల్లడించారు. రాష్ట్రపతిని కలిసిన గిరిజనులు ఇది తమకు చాలా గొప్ప అవకాశమని ఆనందం వ్యక్తంచేశారని చెప్పారు. తాము 10వ తేదీ రాత్రికి ఢిల్లీ చేరుకున్నామని, 11న పార్లమెంట్ భవనం, నేషనల్ ట్రైబల్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించామని, అదేరోజు రాత్రి గిరిజనులతో కలిసి కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్‌ముండా భోజనం చేశారని తెలిపారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌ను సందర్శించామని, అక్కడే రాత్రికి భోజనం ఏర్పాటు చేశారన్నారు. అన్ని రాష్ట్రాల గిరిజన బృందాలను వేర్వేరుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కలిసి ఫొటోలు దిగారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 'థింసా నృత్య' జ్ఞాపికను రాష్ట్రపతికి అందించడంతో ధన్యవాదాలు తెలిపారన్నారు. 'అత్యంత బలహీన గిరిజన తెగల(పీవీటీజీ)కు చెందిన వారిని కలవడం చాలా సంతోషంగా ఉంది. విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా గిరిజనులు సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గిరిజన మహిళలు సైతం సాధికారత సాధించాలి' అని రాష్ట్రపతి పిలుపునిచ్చారని మణికుమార్ తెలిపారు. రాష్ట్రపతితో సమావేశం గిరిజనులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని మణికుమార్ చెప్పారు. ఏపీ బృందం ఈ నెల 15న ఢిల్లీ నుంచి తిరిగి వస్తుందని పేర్కొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు 'కేశవరెడ్డి' సన్మానం



హబీబుల్లాను సన్మానిస్తున్న కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత కేశవరెడ్డి

కర్నూలు సిటీ: ఇటీవలే ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా లెవెల్‌లో 189వ ర్యాంకు సాధించిన హబీబుల్లాకు కర్నూలులోని వెంకటరమణ కాలనీ కేశవరెడ్డి స్కూల్లో అభినందన సభ ఏర్పాటు చేశారు. స్కూల్ అధినేత కేశవరెడ్డి పాల్గొని హబీబుల్లాను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్కూల్ పూర్వ విద్యార్థి సివిల్స్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. తమ పాఠశాలలు స్థాపించినప్పటి నుంచి నేటి వరకు ఎంతో మంది పూర్వ విద్యార్థులు లాయర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, జడ్జిలుగా పనిచేస్తున్నారని చెప్పారు. అనంతరం సివిల్స్ ర్యాంకర్ హబీబుల్లా మాట్లాడుతూ తనకు నడక నేర్పింది తన తల్లిదండ్రులు అయితే, చదువుతో పాటు, విలువలు నేర్పింది.. లక్ష్య సాధనకు మార్గం చూపింది కేశవరెడ్డి పాఠశాలేనన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో పాటు క్రమశిక్షణతో మెలిగినప్పుడే విజయం వరిస్తుందని తెలిపారు. తనకు చదువు చెప్పిన గురువుల పట్ల ఎప్పుడు కృతజ్ఞుడినై ఉంటానన్నారు.

పాడేరు–లంబసింగి రహదారికి పచ్చజెండా

సీతారాంపురం–దుత్తలూరు రహదారి నిర్మాణానికీ గ్రీన్‌సిగ్నల్

మదనపల్లి సమీపంలో ఆర్వోబీకి ఆమోదం

రూ.545 కోట్లతో మూడు ప్రాజెక్టులకు టెండర్లు ఖరారు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో రెండు రహదారులు, ఒక రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ) నిర్మాణానికి జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పాడేరు–లంబసింగి రహదారి నిర్మాణానికి ఆమోదముద్ర వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దాంతోపాటు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సీతారాంపురం–దుత్తలూరు రహదారితోపాటు ఓ ఆర్వోబీ నిర్మాణానికి ఆమోద ముద్ర వేసింది. ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.545 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లను ఖరారు చేసింది.

దుత్తలూరు రోడ్డుకు రూ.267 కోట్లు

ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో సీతారామపురం నుంచి దుత్తలూరు వరకు 36.40 కి.మీ. మేర పావడ్ సోల్డర్స్‌తో రెండు లేన్ల రహదారి నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది. అందుకోసం రూ.267 కోట్లతో టెండర్ల ప్రక్రియను ఖరారు చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లి సమీపంలోని చిన్నతిప్ప సముద్రం సమీపంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది. సేతు భారతం ప్రాజెక్ట్ కింద ఈ రెండు లేన్ల ఆర్వోబీ నిర్మాణానికి రూ.72.50 కోట్లతో టెండర్లను ఖరారు చేసింది.

పర్యాటకానికి ఊతమిచ్చేలా..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ రహదారులను విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. అందులో భాగంగా ఇప్పటికే రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం మీదుగా అరకుకు నాలుగు లేన్ల రహదారి నిర్మిస్తున్నారు. మరోవైపు జిల్లా కేంద్రం పాడేరు నుంచి లంబసింగికి కూడా రహదారి నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగిని పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయవచ్చన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రం పాడేరు–లంబసింగి మధ్య 48 కి.మీ. మేర పావడ్ సోల్డర్స్‌తో రెండు లేన్ల రహదారిని నిర్మించాలని నిర్ణయించింది. అందుకోసం రూ.206 కోట్లతో టెండర్ల ప్రక్రియను ఇటీవల ఖరారు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభించి 2024 మార్చి కల్లా పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ భావిస్తోంది.

'భాటియా సార్' ఇక లేరు!

- కన్నుమూసిన గ్రేహౌండ్స్ పితామహుడు భాటియా
- 33 ఏళ్లుగా యాంటీ నక్సల్స్ బలగాలకు శిక్షణ
- 2011లో సేవలకు గుర్తుగా పద్మశ్రీ అవార్డు
- నేటి ఉదయం మహా ప్రస్థానంలో అంత్యక్రియలు

సాక్షి, హైదరాబాద్: గ్రేహౌండ్స్ పితామహుడు, 'భాటియా సార్'గా సుపరిచితుడైన నారాయణ్ సింగ్ భాటి (93) మంగళవారం తెల్లవారుజామున 4.15 గంటలకు ప్రేమావతిపేటలోని గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రంలోని తన నివాసంలో కన్నుమూశారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి అక్కడి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో అధికారుల సందర్శనార్థం ఉంచనున్నారు. ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించడానికి పోలీసు విభాగం ఏర్పాట్లు చేస్తోంది. భాటి 33 ఏళ్లుగా గ్రేహౌండ్స్‌కు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన సేవలకుగానూ 2011 జనవరిలో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందించింది. జోథ్‌పూర్‌కు చెందిన భాటి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి 1953లో పారా మిలటరీ బలగాల్లో ప్రవేశించారు. స్పెషల్ సర్వీస్ బ్యూరో (ఎస్ఎస్‌బీ) డీఐజీగా 1989లో పదవీ విరమణ చేశారు.

ఎల్‌టీటీఈ యాక్టివిస్టులకు శిక్షకునిగా.. గ్రేహౌండ్స్‌కు చిరునామాగా..

గతంలో భారత బలగాలు శ్రీలంకకు చెందిన ఎల్‌టీటీఈ యాక్టివిస్టులకు తమిళనాడులో రహస్య శిక్షణ ఇచ్చాయి. వారికి జంగిల్, గెరిల్లా వార్ ఫేర్‌లో భాటినే శిక్షణ ఇచ్చారన్నది అతి కొద్ది మందికి మాత్రమే తెలిసిన రహస్యం. భాటి 1989 మేలో పదవీ విరమణ చేయగా జూన్‌లో గ్రేహౌండ్స్ సృష్టికర్త, ఐపీఎస్ అధికారి కేఎస్ వ్యాస్ కోరిన మీదట కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కన్సల్టెంట్‌గా వచ్చారు. ఆ ఏడాది అక్టోబర్ 2న గ్రేహౌండ్స్‌లో అడుగుపెట్టి మరుసటి రోజు నుంచే భాటి గ్రేహౌండ్స్ బలగాలకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. భాటి గ్రేహౌండ్స్‌కు శిక్షణ ఇవ్వడం ప్రారంభించిన ఆరేళ్లకు పూర్తిస్థాయి ఫలితాలు రావడం మొదలైంది. పదేళ్లకు (1999) ఆ విభాగం దేశంలోనే ఎదురు లేనిదిగా రూపొందింది. నక్సల్ ప్రభావిత రాష్ట్రాలకు గ్రేహౌండ్స్ కారణంగా రాష్ట్రం దిక్సూచిగా మారింది. గ్రేహౌండ్స్ విభాగం చేపట్టే కూంబింగ్ ఆపరేషన్లకు ఎంతో ఉపకరించే మ్యాప్ రీడింగ్‌ను భాటినే ప్రవేశపెట్టారు. ప్రేమావతిపేటలోని గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రంలోనే ఆయన నివాసం కూడా ఉంది. 'ఇక్కడ జరిగే శిక్షణ మాత్రమే కాదు..చెట్టు, పుట్ట కూడా నా ఆధీనంలోనే ఉంటాయి. ఆకుల్ని కూడా నా సూచనల ప్రకారమే రాలుస్తాయి' అని భాటి తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించే వారు.

మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి కన్నుమూత

- క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ మృతి

మక్తల్/చిన్నచింతకుంట, సాక్షి, హైదరాబాద్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొన్ని నెలల నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన దయాకర్‌రెడ్డి 1958 ఆగస్టు 18న మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం పర్కాపూర్‌లో జన్మించారు. ఆయన డిగ్రీ వరకు చదువుకున్నారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరి అమరచింత నియోజకవర్గం నుంచి 1994, 1999 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వరుసగా రెండుసార్లు గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఆయన మక్తల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందగా.. అదే సమయంలో ఆయన సతీమణి సీతాదయాకర్‌రెడ్డి దేవరకద్ర నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. భార్యా భర్తలు ఎమ్మెల్యేలుగా గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టిన వారిలో సీత, దయా కర్‌రెడ్డి రికార్డు సృష్టించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిని చవిచూశారు. దయాకర్‌రెడ్డి అంత్యక్రియలకు టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం పర్కపురం గ్రామానికి చేరుకున్న చంద్రబాబు తొలుత దయాకర్‌రెడ్డి పార్థివదేహానికి నివాళి అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్, కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన ఆప్త మిత్రుడిని కోల్పోయానన్నారు. అంతిమయాత్రలో పాల్గొన్న చంద్రబాబు కాసేపు పాడె మోశారు. తెలంగాణ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

'సరోగసీ' ప్రక్రియ వాణిజ్యమే

- ఆస్పత్రి నుంచి పన్ను వసూలును తప్పుబట్టలేం
- కేంద్ర చట్టం వివరాలు అందించాలన్న తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సరోగసీ ప్రక్రియకు సంబంధించి తల్లిదండ్రులు, ఆస్పత్రి, అద్దె గర్భం ఇచ్చే తల్లి మధ్య కుదిరే ఒప్పందం.. వాణిజ్యం కిందికే వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఆస్పత్రికి ఈ విషయంలో పన్ను విధించడాన్ని తప్పుబట్టలేమని వ్యాఖ్యానించింది. పన్ను నుంచి ఆస్పత్రులకు ఎందుకు మినహాయింపు ఇవ్వాలంటూ ప్రశ్నించింది. ఒప్పందం అమల్లో నగదు పాత్ర కూడా ఉన్నందున రెవెన్యూ శాఖ పన్ను విధించి ఉంటుందని చెప్పింది. సరోగసీ సేవా కార్యక్రమం అయితే నగదు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించింది. సరోగసీకి సంబంధించి కేంద్రం తెచ్చిన చట్టం వివరాలతోపాటు పన్ను మినహాయింపు ఎలా వర్తిస్తుందో చెప్పాలని ఆదేశించింది. 2011–12, 2012–13 ఆర్థిక సంవత్సరాల ఆదాయ మదింపులో సరోగసీకి పన్ను విధించడాన్ని సమర్థిస్తూ ఆదాయపు పన్ను శాఖ ట్రిబ్యునల్ 2021 మార్చిలో ప్రొసీడింగ్స్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌లోని కిరణ్ ఇన్ఫెర్టిలిటీ సెంటర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిల్లలు లేనివారికి అద్దె గర్భం ద్వారా ఆ సౌకర్యాన్ని ఆస్పత్రి కల్పిస్తుందని పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపించారు. దీన్ని ఓ సేవగా పరిగణించాలని, వ్యాపారంగా భావించకూడదన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. సరోగసీ ప్రక్రియ మూడు పార్టీల మధ్య కుదిరిన ఒప్పందమేనని.. ఇందులో ఆస్పత్రి కూడా భాగస్వామేనని పేర్కొంది. సేవగా భావించాలని అనుకున్నప్పుడు నగదు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించింది. సరోగసీ ప్రక్రియ కచ్చితంగా వ్యాపారమేనని తేల్చిచెప్పింది. దీనిపై మరిన్ని వివరాలు తదుపరి విచారణ రోజున వివరించాలని, విచారణను జూలై 24కు వాయిదా వేసింది.

తెలంగాణ

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943